అపరాధ పరిశోధన

రూ. 5.50 | జనవరి '84



Blank Page

సంపుటి: 37
సంచిక: 6

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 60 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

జనవరి, 1984

Kattukolu Subba Reddy
Home Library, Pedac...

ఎడిటర్ :
...దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

మీ ఉత్తరాలు

డిసెంబరు నెల 'అపన'లో రచయితలారా ఏకంకండి, గోడలకు చెవులుంటాయి, వూబి—కథలు మమ్మల్ని ఆకట్టుకున్నాయి. 'గుడ్డి దర్బారు' సీరియల్‌లో గౌరికి ఇంత త్వరగా చూపు వచ్చినందుకు సంతోషించాను. కాని ఆమెకు జరిగిన అన్యాయానికి బాధపడుతున్నాను. ఆమె ఏ విధంగా ప్రతీకారం తీర్చుకుంటుందోనని ఎంతో ఆసక్తితో వచ్చే అపన కోసం ఎదురు చూస్తున్నాము.

—యు. విజయ శేఖరరెడ్డి. హైదరాబాదు-38.

'రచయితలారా ఏకంకండి' కథ చాలా చక్కగా వుంది. నిజమే. అలాంటి 'దోపిడీ' నేను కూడా చేయబడ్డాను. దాదాపు 6 సం॥ క్రితం నా నవల ఒకటి ఓ పబ్లిషింగ్ సంస్థ ప్రచురించింది. అంతే.... కాంప్లిమెంటరీ కాపీకాని, పారితోషికంగాని, ఆ సంస్థ నుంచి ఇంతవరకు అందలేదు. పది దాకా ఉత్తరాలు రాసి—సమాధానం లేకపోవడంతో ఆ రచనలకి తిలోదకాలిచ్చాను. ఇది నా స్వానుభవం. ఇలాంటి మంచి కథని అందించిన వర్మగారికీ, ఎడిటర్‌గారికీ ధన్యవాదాలు.

—కె.బి.యస్. కుమార్, కర్నూలు.

'సాగరలోయ'లో పాఠకుల్ని ఓలలాడించిన శ్రీ బొమ్మిడి అచ్చారావుగారి అద్భుత సృష్టి 'కళ్యాణ దుర్గం' కొత్త సీరియల్ బ్రహ్మాండంగా వుంది. 'గుడ్డిదర్బారు' కూడ రసవత్తరంగా ముందుకు దూకుతోంది. సీరియల్స్ ప్రచురించటంలో - మీకు మీరే సాటి అని మరోసారి నిరూపించుకున్నారు.

—కోలపల్లి ఈశ్వరరావు, నెల్లూరు-2.

'కోటి సౌరంగాలు' నవల తరువాత అదే అనుభూతి ఈ నెల 'మృత్యు తరంగాలు' చదివాక కలిగింది. అసహజాన్ని కూడా సహజంగా చిత్రించి అందులో పాఠకుల్ని లీనం అయ్యేలా చేయగలిగిన అజీజ్‌గారు అభినందనీయులు. ఇలాంటి వెరైటీ నవలలను ముందు ముందు ఇక ముందూ అందిస్తారని ఆశిస్తున్నాము.

—యం. శంకర్‌రెడ్డి, బెల్లంపల్లి.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. మరో 420—విశ్వమోహిని
30. నీలిరంగు ఉత్తరం—పి. అరుణ
41. అగ్ని సమాధి—వాణిశ్రీ
52. చిదానంద స్వామి కుటీరం—కాశీభట్ల భానుమూర్తి
68. మూడు ముళ్ళు ఏడు—బొమ్మిడి అచ్చారావు
90. మందు మర్మం—విద్వాన్ షీలాదేవి
107. సిగరెట్ లైటర్—ప్రతాప రవిశంకర్
117. గుణహీన—బి. రాజేశ్వరి
136. నేను దొంగని కాను—అజీజ్
158. కాలుకాలిన పిల్లి—కె.బి.యస్. కుమార్
177. గుడ్డి దర్బారు (సీరియల్)—వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. గుప్పిట్లో గువ్వ—వాణిశ్రీ
39. అమ్మాయిల బందిఖానా—బి. రాజేశ్వరి
76. ప్రాణం వచ్చిన ప్రతిమ—అజీజ్
122. విందు వంటకాలు—కె.బి.ఎస్. కుమార్
158. కళ్యాణదుర్గం (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!!

మరో 420

విశ్వమోహిని

పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు డిటెక్టివ్ డీలక్స్.

"నీళ్ళు! నీళ్ళు! నీళ్ళు! .... డామిట్! డబ్బుకంటె అపురూపమయిపోయాయి ఈ నీళ్ళు! మద్రాసుకేదో శని పట్టింది. అందుకే త్రాగడానికి మంచి నీళ్ళే కరువై పోయాయి" అని తిట్టుకున్నాడు.

క్రింద రాలిపడిన వెంట్రుకలన్నీ ఎత్తి బయట పార

బోపి వచ్చాడు అసిస్టెంటు అయోమయం.

"ఎదురుగా సముద్రం పెట్టుకుని నీళ్ళకోసం దేవిళ్లాడ వలసిన గతి పట్టింది మనకు" అన్నాడు అయోమయం, కిటికీలోంచి శాంథోమ్ బీచ్ వంక చూస్తూ "ఇది ముమ్మాటికీ పి. ఐ. ఏ. ఏజెంట్ల పనే అయివుండాలి!"

"కె.జి బి. పనికూడా కావచ్చును" అన్నాడు డీలక్స్. అలా అంటూనే 'కెవ్వు' మన్నాడు జుట్టు పీక్కుంటూంటే చర్మం వూడివచ్చినంత పనయింది మరి! బాధతో కళ్ళమ్మట నీళ్ళు వస్తూంటే చేతితో రుద్దుకున్నాడు.

"అదేమిటి బాస్, కె.జి బి. ఎందుకు చేస్తుంది? మన ప్రగతికి అనుక్షణమూ అడ్డుపడుతూన్నది పి.ఐ.ఏ. నని మన బడా నాయకులంతా చెవిని ఇల్లు కట్టుకుని పోరుతూంటే, ఇది కె.జి.బి. పనంటావేమిటి?" అన్నాడు అయోమయం. అయోమయంగా.

"అందులో వున్న కిటుకు తెలిస్తే నువ్వు అయోమయానివి యెందుకవుతావోయ్?" అన్నాడు డీలక్స్, నొప్పి ఇంకా తగ్గనందున గట్టిగా తల రుద్దుకుంటూ. "చేయవలసిందంతా కె జి.బి. చేసేస్తే అనుమానం పి.ఐ.ఏ. మీదికి పోతుంది గదా!"

"నిజమే బాస్, ఆ ఐడియా నాకు తట్టనేలేదు సుమా!" అన్నాడు అయోమయం. "అయితే మద్రాసులో నీటి కొరతకు ఖచ్చితంగా కె.జి.బి. ఏ కారణమంటావా?"

"కారణం ఎవరయినా కష్టాలు మనకే గదోయ్.... అయినా, ఆ మీసాల మేజర్ ఠంచన్‌గా అద్దె అందుకోవడమే గాని ఓ నీటి బొట్టయినా మన నోట్లో పోయాలనుకోడేం? పోనీ, గట్టిగా దులిపేద్దామంటే ఆ దొక్కు గన్నొకటి యెప్పుడూ వాడి భుజాన్నే వ్రేలాడుతూ వుంటుం

దాయె!" అన్నాడు డీలక్స్.

"ఈ మధ్య సీటీకోసం మేజర్ వూరిమీద పడ్డాడని విన్నాను" అన్నాడు అయోమయం, డీలక్స్ ఎదురుగా కుర్చీ ఈడ్చుకుని కూర్చుంటూ.

"ఈ ఆర్మీ వాళ్ళతో ఇదో నోయ్ చిక్కు. ఏనుగు బ్రతికినా, చచ్చినా ఒకటే విలువ అన్నట్టు—ఈ మిలిటరీవాళ్ళు సర్వీసులో వున్నా, రిటైరయినా ఒకలాగే వుంటారు. వీళ్ళని చూసి ఎదుటివాళ్ళు భయపడి చావాలి!" అన్నాడు డీలక్స్ జుట్టు పీక్కోవడం మానేసి. ఆనాటి దిన పత్రిక అందుకున్నాడతను.

"పోనీలే బాస్! ఆ మేజర్‌తో మనకు గొడవెందుకు గాని, స్నానాలు బీచ్‌కి వెళ్ళి సముద్రంలో చేసి వచ్చేద్దాం. దాహం వేస్తే గొంతు తడుపుకోవడానికి బీర్ ఎలాగూ వుంది....మద్రాసులో ప్రొహిబిషన్ రద్దుచేసి ప్రభుత్వం మేలే చేసింది ప్రజలకు" అన్నాడు అయోమయం.

"స్నానం గురించి ఇప్పుడు బెంగపెట్టుకున్న దెవరోయ్!" అన్న డీలక్స్ వంక ఆశ్చర్యంగా చూశాడు అయోమయం.

"అదేమిటి బాస్, మనం స్నానంచేసి వారమయిందిగా?" అన్నాడు.

"అయితే? స్నానం రోజూ చేయాలని రూలు లేదుగా! ఆ మాటకొస్తే సూటూ, బూటుతో షోకుచేసే దొరలందరూ రోజూ స్నానం చేస్తున్నారంటావా?"

"ఆఁ!" అంటూ నోరు వెళ్ళబెట్టాడు అయోమయం.

"అసలు షేక్‌స్పియర్ ఏమన్నాడు? 'ఓన్లీ డర్టీ ఫెలోస్ షూడ్ టేక్ బాత్' అన్నాడు...."

"ఆ కొటేషన్ ఎవరో సర్దార్‌జీది అనుకుంటాను

బాస్!"

"ఎవడో ఒకడు—అసలు అన్నాడా, లేదా అన్నది పాయింటు!"

"పాయింటే!" ఒప్పుకున్నాడు అయోమయం. "ఈ పాయింటు తెలిస్తే ప్రజలు నీటికోసం ఇంత గగ్గోలు పెట్టే వారు కాదేమో బాస్!"

"నా అసలు బెంగ నీటికోసం కాదోయ్ అయోమయం! ఈ నీటి కొరత మూలంగా మనకు కేసులు కరువై పోయాయే అన్నదే బాధ!" అన్నాడు డీలక్స్.

ఈసారి జుట్టు పీక్కోవడం అయోమయం వంతయింది.

"గులామ్ మొహమ్మద్‌కీ, గోకులాష్టమికీ సంబంధం అన్నట్టు—నీటి కరువుకూ, మన కేసుల కరువుకూ సంబంధ మేమిటో నాకు బోధపడడం లేదు బాస్!" అన్నాడు.

"గులామ్ మొహమ్మద్‌కీ, గోకులాష్టమికీ సంబంధం లేకపోవచ్చును గాని—నీటికొరతకూ, మన కేసుల కరువుకూ మాత్రం ఖచ్చితంగా సంబంధం వుందోయ్" అన్నాడు డీలక్స్.

"అదెలా?"

"సింపుల్. నగరంలోని నేరస్తులంతా నీటికోసం వెదకడంతోనే సరిపోతోంది. ఇక నేరాలు చేయడానికి వాళ్ళకు టైమ్ ఎక్కడుంది గనుక! అందుకే నగరంలో నేరాలు కరువయిపోయాయి. మనబోటి ప్రఖ్యాత డిటెక్టివ్ లకు పని లేకుండా పోయింది" అంటూ వివరించాడు డీలక్స్.

"అమోఘం! నీ అనాలిసిస్ అద్భుతం గురో! హేట్సాఫ్!" అన్నాడు అయోమయం, బాస్ తెలివికి

పొంగిపోతూ.

"హీటాఫ్కి నీ దగ్గర హీట్ ఎక్కడుంది గానీ, ముందు ఆ ఫ్యాన్ ఆఫ్‌చెయ్యి. కరెంట్ గూడా దండుగ" అని డీలక్స్ అనడంతో, అయోమయం లేచి వెళ్ళి గదిలో ఫ్యాన్ స్విచ్ ఆఫ్‌చేసి వచ్చేడు.

తిరిగి వచ్చి కూర్చోబోతూంటే, బయట అడుగుల చప్పుడు వినిపించింది.

వెంటనే సాభిప్రాయంగా ఒకరి వంక ఒకరు చూసుకుని, అర్జెంటుగా సర్దుక్కూర్చున్నారు గురుశిష్యులు.

"బాస్! ఎవరో క్లయెంట్ లాగుంది, వస్తున్నాడు" అన్నాడు అయోమయం మెల్లగా.

గంభీరంగా అయిపోయాడు డీలక్స్.

"అయోమయం!"

"ఎస్, బాస్!"

"ఈ మర్డర్ కేసు చాలా క్లిష్టంగా వుందోయ్" అన్నాడు డీలక్స్.

"ఏ మర్డర్ కేసు, బాస్?" అని, చటుక్కున నాలిక కరుచుకున్నాడు అయోమయం. "ఎస్ బాస్" అన్నాడు వెంటనే.

గుమ్మం దగ్గర అడుగుల చప్పుడు వినిపించింది.

"ఈ హత్య చేసింది హతుడే ననడంలో సందేహం లేదు!" అన్నాడు డీలక్స్.

"ఎస్ బాస్!" అని, అంతలోనే "బాస్....?" అంటూ అరిచాడు అయోమయం.

పొరపాటు గ్రహించిన డీలక్స్, "సారీ ...హంతకుడే ననడంలో సందేహం లేదు" అన్నాడు వెంటనే, గుమ్మం వంక వోరగా చూస్తూ.

అయోమయం ఏదో అనబోయేంతలో "నమస్కారం సార్!" అంటూ గుమ్మంవద్ద పదహారేళ్ళ కుర్రాడొకడు ప్రత్యక్షమయ్యాడు. సన్నగా, పొడవుగా, నల్లగా వున్నాడు. ఖాకీ నిక్కరూ, తెల్ల చొక్కా తొడుక్కున్నాడు. కాటన్ దుస్తులయినా శుభ్రంగానే వున్నాయి.

"లోపలికి రావచ్చా సార్?" అన్నాడు ఆ కుర్రాడు లోపలికి వచ్చేసి.

గంభీరంగా తల పంకించాడు డీలక్స్.

ఆ కుర్రాడు బెదురు చూపులతో వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూ, కంగారుగా డిటెక్టివ్‌లను సమీపించాడు.

"నా పేరు సుందరం సార్!" అన్నాడు ఆ కుర్రాడు డిటెక్టివ్‌ల నుద్దేశించి.

ఎత్తు పళ్ళతో, నల్లగా వున్న ఆ కుర్రాడివంక అదోలా చూస్తూ, "నీ రూపం చూడగానే తెలుస్తోందిలే!" అని, తన జోక్‌కి తానే పెద్దగా నవ్వుకున్నాడు డీలక్స్.

"ఏమిటి, అలా బెదిరిపోతున్నావ్? నిన్నెవరయినా తరుముకొస్తున్నారా?" అంటూ ప్రశ్నించాడు అయోమయం.

"ఔన్సార్. అహఁ, లేద్సార్" అన్నాడు సుందరం.

"మరెందుకా కంగారు, బెదురుగొడ్డులా?" అన్నాడు అయోమయం, తన అంచనా తప్పినందుకు చికాకుగా.

"అదే సార్. నేను ఇక్కడికి రావడం ఎవరైనా చూస్తారేమో నని."

కుతూహలంతో ముందుకు వంగాడు డీలక్స్.

"చూడు. సుందరం! నిన్నెవరయినా బెదిరిస్తున్నారా?" అంటూ ప్రశ్నించాడు.

"ఔన్సార్."

"మా దగ్గరకు వెళ్ళొద్దని నీకు వార్నింగ్ ఇచ్చారా?" ఆసక్తిగా ప్రశ్నించాడు అయోమయం.

"కరెక్టుగా చెప్పారు సార్" అన్నాడు సుందరం.

"డిటెక్టివ్ డీలక్స్‌ని కలుసుకుంటే నిన్ను మర్డర్ చేస్తామని హెచ్చరించారు కదూ?" ప్రశ్నించాడు డీలక్స్.

"అరె! ఆ సంగతి మీకెలా తెలిసిపోయింది సార్?" ఆశ్చర్యపోతూ అన్నాడు సుందరం.

"మాకు కొంచెం దివ్యదృష్టి గూడా వుందిలే. అసలు విషయమేమిటో చెప్పు" అన్నాడు డీలక్స్.

"అచ్చంగా అలాగే బెదిరించాడు సార్ నన్ను! డిటెక్టివ్ డీలక్స్ దగ్గరకు వెళ్ళావో చంపేస్తాను అంటూ తీవ్రంగా హెచ్చరించాడు" అన్నాడు సుందరం.

"అసిస్టెంట్ అయోమయం అని కూడా అన్నాడా? అనే వుంటాడు భయపడకుండా బాగా ఆలోచించుకుని చెప్పు" అన్నాడు అయోమయం.

"సరిగ్గా చెప్పారు సార్! డిటెక్టివ్ డీలక్స్, అసిస్టెంట్ అయోమయాలలో ఎవరిని కలుసుకున్నా చంపి శాంథోమ్ బీచ్‌లో పారేస్తానన్నాడు" అన్నాడు సుందరం.

డీలక్స్ వంక చూస్తూ సగర్వంగా షర్ట్ కాలర్ పైకెత్తాడు అయోమయం.

"ఈ డిటెక్టివ్ డీలక్స్ పేరుచెబితే ఈ మహానగరంలో జడుసుకోని వాళ్ళెవరులే! ఇంతకూ ఏం జరిగిందో, హంతకుడు నిన్నెందుకు బెదిరిస్తున్నాడో అంతా వివరంగా చెప్పు" అన్నాడు డీలక్స్.

"ముందు ఆ కుర్చీలో కూర్చుని అలుపు తీర్చుకో.... భయం లేదులే! ప్రఖ్యాత డిటెక్టివ్‌లం—మా సమక్షంలో నిన్ను చంపాలంటే ఎన్ని దమ్ములుండాలి! నువ్వు వచ్చినా!

JBM 84 (6)

నిన్ను చంపిన వాణ్ణి మేం విడిచి పెట్టంగా!" అన్నాడు అయోమయం.

(217)

"సార్! హంతకుడు అంటున్నారు. అతనింకా హత్య చేయలేదుగా సార్?" సందేహం వెలిబుచ్చాడు సుందరం.

"నువ్విక్కడికి రాకపోయినట్టయితే నిన్ను చంపేసి ఖచ్చితంగా హంతకుడు అయిపోయి వుండేవాడులే వాడు!" అన్నాడు డీలక్స్.

"లేద్సార్! మీ దగ్గర కొస్తేనే మర్డర్ చేస్తానన్నాడు" అన్నాడు సుందరం వినయంగా.

"డామిట్!" అంటూ లేచి నిలుచున్నాడు డీలక్స్ గదిలో పచార్లు ప్రారంభించాడు.

"చూడబ్బాయ్, నీ పలుకులు వింటూంటే నువ్వు పెద్ద డేంజర్‌లో వున్నట్టు కనిపిస్తున్నావ్...."

"పైగా, హంతకుడికి మేమంటే గొప్ప భయమని గూడా తెలుస్తోంది" అంటూ బాస్‌కి జత కలిపాడు అయోమయం.

"ఔన్సార్" అన్నాడు సుందరం వినయంగా లేచి నిలుచుంటూ.

"ఏ చిన్న విషయమూ దాచకుండా అంతా వివరంగా చెప్పావంటే నిన్ను రక్షించడానికి ప్రయత్నిస్తాం" అన్నాడు డీలక్స్.

డీలక్స్ పలుకులు పూర్తి కాగానే "సార్!" అంటూ హఠాత్తుగా అతని కాళ్ళమీద పడిపోయాడు సుందరం.

డీలక్స్ కంగారుపడి వెనక్కి గెంతాడు.

"మా సమక్షంలో నీకు వచ్చిన భయం లేదన్నాగా! లే, అలా కాళ్ళమీద పడనవసరం లేదు" అన్నాడు అయోమయం.

"కాళ్ళమీద పడడం కాదు సార్! ఆయన కాళ్ళకు వున్న చెప్పుల్ని చూస్తున్నాను... అవి నా చెప్పులలాగే వుంటేనూ...." అన్నాడు సుందరం లేచి నిలుచుంటూ.

"ఆ(!" డిటెక్టివ్‌లు నోళ్ళు తెరిచారు.

"ఔన్సార్! నెలక్రితమే కొన్నాను వాటిని. వారం నుండీ కనిపించడం లేదు. ఎవరో కొట్టేశారు."

"ఆ(....!?"

"శాంథోమ్ బీచ్‌లో చెప్పులు ఇసుకలో విడిచి నీళ్ళలో దిగాను సార్! తిరిగివచ్చి చూసేసరికి చెప్పులు మాయ మయ్యాయి....కొత్తచెప్పులు సార్! మోడల్ బాగుందని ముప్పయ్‌అయిదు రూపాయలు అప్పు చేసి పారిస్‌లో కొన్నాను....ఇవే చెప్పులు...." అన్నాడు సుందరం చెప్పులవంకే చూస్తూ.

ఆ కుర్రాడివంక వురిమిచూశాడు డీలక్స్.

"అయితే నీ చెప్పులు నేను కొట్టేశానంటావా?" అన్నాడు చిరాగ్గా.

"అమ్మమ్మ! అంతమాట యెందుకంటాను సార్? కాకుంటే అవి నా చెప్పుల్లాగే వున్నాయంతే!" అన్నాడు సుందరం నొచ్చుకుంటూ.

"చూడు, సుందరం! చెప్పులు మన కాళ్ళకు వున్నంత వరకే మనవికాని. కాళ్ళు దాటిపోయాక మనవి ఎలా అవు తాయి చెప్పు" అన్నాడు అయోమయం వోదార్పుగా. "ఏ దొంగ వెధవో శాంథోమ్‌లో నీ కొత్త చెప్పులు కొట్టేసి మెరీనాలో ఇంకెవరికో ఏ ఇరవై రూపాయలకో చవగ్గా అమ్మేసి వుంటాడు"

ఉలిక్కిపడి అయోమయం వంక చూసాడు, డీలక్స్.

సాభిప్రాయంగా చిరునవ్వు నవ్వాడు అయోమయం.

మూడురోజుల క్రితం మెరీనాలో ఎవరో కుర్రాడు చవకగా అమ్ముతూంటే మోడల్ బావుందని ఆ చెప్పుల్ని ఇరవై రూపాయలకు కొన్నాడు డీలక్స్!

"సుందరం! ఎన్నో కేసులతో వూపిరి సలపకుండా వుంది మాకు. నువ్విలా మా టైమ్ వేస్ట్ చేస్తే లాభంలేదు. నీకేసేమిటో త్వరగా చెబితే, మేము ఏ విధంగా నీకు సహకరించగలమో ఆలోచిస్తాము" అన్నాడు డీలక్స్ అసహనంగా కుర్చీలో కూర్చుంటూ.

"చెబుతాను సార్! మీ పేరు ప్రఖ్యాతులు విని మీ దగ్గరకు వస్తూంటే .... మిమ్మల్ని కలుసుకుంటే చంపేస్తానన్నాడు కాశింఖాన్ ...."

"కాశింఖాన్ ఎవడు?" అంటూ మధ్యలోనే ప్రశ్నించాడు అయోమయం. కాశింఖాన్ పేరు ఆలకించేసరికి ఆ కుర్రాణ్ణి ఎక్కడో చూసినట్లు అనిపించింది అతనికి చటుక్కున.

"అతనే సార్....నా యజమాని...."

"నీ యజమానా?"

"ఔన్సార్. ఈ వీధి చివర వున్న ఖాన్ టీస్టాల్ వోనర్. నేను ఆ టీస్టాల్‌లోనే పనిచేస్తున్నాను...."

హఠాత్తుగా గుర్తుకొచ్చింది డిటెక్టివ్ ద్వయానికి సుందరాన్ని ఎక్కడ చూసారో. అప్పుడప్పుడు తాము టీ త్రాగే ఖాన్ టీ స్టాల్‌లో టీలు సప్లయ్ చేస్తుంటాడు ఆ కుర్రాడు. మంచి దుస్తుల్లో నీట్‌గా కనిపించడంవల్ల వాణ్ణి గుర్తుపట్టలేకపోయారు.

"సార్! నేను మీ దగ్గరకు వెళ్ళబోతున్నట్లు తెలియగానే ఖాన్ సాహెబ్ నా తోలు వొలిచేసి పెరియమేట్‌లో వున్న టానరీలకు పంపించేస్తానన్నాడు" అన్నాడు

సుందరం.

ఒకక్షణం కాశింఖాన్ ఆకారం డిటెక్టివ్‌ల కన్నుల ముందు మెదిలింది. ఓ చిన్నసైజు హిడింబుడిలా వుండే ఖాన్‌తో గొడవ పెట్టుకుంటే ఏమవుతుందో కూడా గ్రహింపుకు వచ్చింది.

"అసలు నువ్వు మా దగ్గరకు యెందుకు రావాలనుకున్నావ్?" అన్నాడు డీలక్స్ కించిత్తు విసుగ్గా. వాడి మూలంగా ఖాన్‌తో విరోధం తెచ్చుకోవడం క్షేమంగా అనిపించలేదు అతనికి. ఖాన్ తలచుకుంటే వాడితోపాటు తన తోలు, తన అసిస్టెంట్ తోలు కూడా వొలిచి టానింగ్‌కి పంపించేయగలడు!

"అదేమిటి సార్, మీ దగ్గరకు రావాలని యెవరు అనుకోరు?" అంటూ ఎదురుప్రశ్న వేశాడు సుందరం.

"అదేనోయ్. నీ కొచ్చిన కష్టమేమిటి? అని అడుగుతున్నాం" అన్నాడు అయోమయం.

"కష్టమా? అదేంలేదు సార్!"

"అంటే—?" తెల్లబోయాడు డీలక్స్.

"మరైతే మా దగ్గరకు ఎందుకు రావాలనుకున్నావ్? అందువల్ల కాశింఖాన్‌కి వచ్చే నష్టమేమిటి?"

"అదేసార్! నాకు మొదటినుంచీ డిటెక్టివ్ నవలలన్నా, డిటెక్టివ్‌లన్నా చాలా పిచ్చి. మీ సంగతి వినగానే ఆ టీ స్టాల్‌లో కప్పులు కడుగుతూ మరి ఉండలేకపోయాను. వెంటనే మీకు అసిస్టెంటయి పోవా లనిపించింది. ఆ విషయమే చెబితే, టీ స్టాల్‌లో పని మానేసి పిచ్చి పిచ్చి వేషాలేస్తే చంపేస్తానన్నాడు ఖాన్‌సాహెబ్. మీతో మాట్లాడినా, మిమ్మల్ని కలుసుకున్నట్టు తెలిసినా తోలు వొలిచేస్తానన్నాడు."

అసలు విషయం అర్థమయిపోయింది డిటెక్టివ్‌లకు.

డీలక్స్‌కి ఓ క్షణం ఆనందంతో సీలింగ్‌వరకు యెగిరి రావాలనిపించింది తనకు అసిస్టెంటుగా పని చేయడానికి మద్రాసునగరంలోని మనుషులంతా పోటీ పడుతున్నట్లు అని పించింది. యజమాని చంపుతానని బెదిరించినా ధైర్యంచేసి వచ్చిన ఆ కుర్రాణ్ణి చూస్తే గర్వం కలిగింది.

కాని—

అయోమయం రియాక్షన్ వేరేలా వుంది.

"డామిట్! మాకే కేసులు లేక జుట్టు పీక్కుంటూంటే మధ్య సువ్వొకడివా? కప్పులు కడిగేవాళ్ళందరినీ అసి స్టెంటుగా పెట్టుకుంటామని ఎలా అనుకున్నావ్?" అంటూ చిరాకుపడ్డాడు అయోమయం.

అప్పుడు స్ఫురించింది డీలక్స్‌కి, సుందరం టీస్టాల్‌లో ఎంగిలి కప్పులు కడిగే కుర్రాడని. మనిషికి మించిన కోపం వచ్చేసింది అతనికి. ఆ కుర్రాడికి యెంత ధైర్యం! తాను అంత చీప్‌గా కనిపించాడా వాడికి అనుకున్నాడు.

"నాన్సెన్స్! డీలక్స్ డిటెక్టివ్ ఏజన్సీ అంటే నీ కంత చీప్‌గా కనిపించిందా?! అడ్డమైనవాళ్ళందర్నీ అసిస్టెంట్స్‌గా పెట్టుకుంటే నా పరువు యేం కావాలనుకున్నావ్ ?" అంటూ గయ్యిన సుందరం మీదికి వొంటి కాలిమీద లేచాడు.

సుందరం బిత్తరపోయాడు.

"సార్" అన్నాడు తడబడుతూ. "నేర పరిశోధన లంటే నాకు చాలా ఇష్టం సార్!"

"అయితే—?" రెట్టించాడు అయోమయం కోపంగా.

"నేను డిటెక్టివ్ నవలలు చాలా చదివాను సార్! ఏ ఏ డిటెక్టివ్ ఎలా పరిశోధిస్తాడో ఆ పద్ధతులన్నీ నాకు బాగా

తెలుసు సార్!" బ్రతిమాలాడు సుందరం. "అంతెందుకూ, రాగానే మీ కాళ్ళనున్న నా చెప్పుల్ని చిటికెలో కనిపెట్టే సాను."

ఉలిక్కిపడ్డారు డిటెక్టివ్‌లు.

"నోర్ముయ్. ఈ చెప్పులు నీవికావు" అంటూ ఎందు కైనా మంచిదని కాళ్ళు రెండూ పైకెత్తి పెట్టేసుకున్నాడు డీలక్స్.

"నా కళ్ళముందు మెరీనాలో కొన్నాడు వీటిని" అనేసి చటుక్కున నాలుక కరుచుకున్నాడు అయోమయం.

"అయితే ఖచ్చితంగా అవి నావే సార్!" అన్నాడు దృఢంగా. "శాంథోమ్‌లో కొట్టేసి మెరీనాలో అమ్మేయడం ఈ వూళ్ళో కేటుగాళ్ళకు అలవాటే సార్!"

"షటప్!" అరిచాడు డీలక్స్.

"గెటౌట్!" అన్నాడు అయోమయం.

"సార్! నన్ను మీ అసిస్టెంటుగా తీసుకోండి సార్!" ప్రాధేయపడ్డాడు సుందరం.

"ముందిక్కడినుండి బయటకు పోతావా లేదా?" అరిచాడు డీలక్స్.

"సార్....సార్....ఎంతో ఆశతో వచ్చాను సార్! నిరాశ చేయకండి సార్...."

"గెటౌట్! నువ్వింకా ఇక్కడేవుంటే నాకు పిచ్చెక్కుతుంది...."

"పిచ్చెక్కిందంటే జుట్టంతా పీకేసుకుంటాడు. ఆ వెంట్రుకలన్నీ ఎత్తిపోయలేక నేను చావాలి!" అన్నాడు అయోమయం.

"ఒద్దుసార్! తలంతా గుండయిపోతుంది" అన్నాడు సుందరం.

"గెటౌట్....!" అంటూ డిటెక్టివ్ లిద్దరూ ఒకేసారి గట్టిగా అరవడంతో హడలిపోయి బయటకు పరుగెత్తాడు సుందరం.

"చానాళ్ళకు ఏదో కేసు దొరికిందని ఆశపడితే, ప్రొద్దుటే మంచి బేరమే ఎదురయింది" అన్నాడు డీలక్స్ జేబులోంచి ఆఖరు సిగరెట్ బయటకు తీస్తూ సిగరెట్‌ను రెండు ముక్కలు చేసి ఒకటి అయోమయానికి యిచ్చాడు.

"వీడి కెంత ధైర్యం! కప్పులు కడిగేవాళ్ళందరినీ అసి స్టెంట్సుగా పెట్టుకునేంత చీప్‌గా కనిపించినట్టున్నావ్ నువ్వు!" అన్నాడు అయోమయం, సిగరెట్ ముక్క నోట్లో పెట్టుకుంటూ.

"బహూశా నిన్ను చూసాకే ఆ ఆలోచన కలిగివుంటుంది వాడికి!" జవాబిచ్చాడు డీలక్స్, సిగరెట్ వెలిగిస్తూ.

చురుక్కుమంది అయోమయానికి. బాస్ ఏ వుద్దేశ్యంతో అలా అన్నాడో ఓ పట్టాన అర్థంకాలేదు. సిగరెట్ పీలుస్తూ అర్జెంటుగా ఆలోచనలో పడిపోయాడు.

అంతలో బయట అడుగుల చప్పుడు వినిపించింది.

"రాస్కెల్, మళ్ళీ వస్తున్నట్టున్నాడు" అన్నాడు డీలక్స్ నేలమీదవున్న కాళ్ళను మళ్ళీ కుర్చీమీద పెట్టుకుంటూ.

"రానియ్ బాస్! ఈసారి వాడి తోలు నేను వొలిచేస్తాను" అంటూ లేచాడు అయోమయం.

గుమ్మం దగ్గరకు వెళ్ళి బయటకు తొంగిచూశాడు.

మరుక్షణంలో ఎగిరి గంతేసాడు అయోమయం. ఒక్క వురుకులో డీలక్స్‌ని సమీపించి, "బాస్! ఎవరో అందమయిన అమ్మాయి టాక్సీ దిగి మన దగ్గరకే వస్తోంది" అన్నాడు హుషారుగా.

అర్జెంటుగా సర్దుకుని కూర్చుని బిజీ పోజు పెట్టేసాడు డీలక్స్.

అయోమయం టేబిల్‌మీద వున్న దుమ్ముపట్టిన పాత ఫైలు అందుకుని, హడావుడిగా దాన్ని తిరగేస్తూ డీలక్స్ ప్రక్కన నిలుచున్నాడు.

ఇద్దరి చూపులూ వారగా గుమ్మంవైపే వున్నాయి.

2

"మే ఐ కమిన్ ప్లీజ్!" అంటూ వినిపించింది ఓ తీయని స్వరం.

నాగస్వరం విన్న పాముల్లా తలలు త్రిప్పి గుమ్మం వైపు చూసారు డిటెక్టివ్‌లు.

ఓ అందమయిన యువతి గుమ్మంలో నిలుచుని, వారి వంక చూసి ఓ చిరునవ్వు నవ్వింది.

"ప్లీజ్....ప్లీజ్ కమిన్" అన్నారు గురు శిష్యులిద్దరూ ఒకేసారి.

హంసగమనంతో నడిచి వచ్చి డీలక్స్ కెదురుగా కూర్చుంది ఆమె.

పాతికేళ్ళు వుంటాయి ఆమెకు. తెల్లగా, అందంగా, తగిన పొడ్డూ పొడవుతో ఆకర్షణీయంగా వుంది. లైట్ రోజ్ పాలిస్టర్ శారీలో షోకేసుల్లోని బొమ్మలా కనిపించింది వాళ్ళకు. ఆమె యెవరో సినిమా స్టార్‌లా అనిపించింది.

"హౌ కెన్ వుయ్ హెల్ప్ యూ, మిస్?" అన్నాడు డీలక్స్ దర్పంగా.

"అయాం మిసెస్ షీలారామ్" అందామె. "పారిస్‌లోని రామ్ అండ్ రామ్ జువెలర్స్ మీకు తెలిసే వుంటుంది. దాని ప్రొప్రయిటర్ గంగూరామ్‌గారు మా వారే."

ఉమ్మడియార్ప్ ఎట్ సెట్‌రా తప్పితే 'రామ్ అండ్

రామ్' జువెలర్స్‌ను గురించి ఆలకించిన గుర్తులేదు డిటె క్టివ్‌లకి. అయినా, తెలియదంటే అంత పెద్ద డిటెక్టివ్‌లకు ఆ నగలషాపే తెలియదా అనుకుంటుందేమోనని "ఎపెస్. మద్రాసు పిటీలో రామ్ అండ్ రామ్ జువెలర్స్‌ను గురించి ఎరుగనివాళ్ళెవరుంటారు?" అన్నాడు డీలక్స్.

"ఔను. అది చాలా ప్రసిద్ధిచెందిన నగల షాపు" అన్నాడు అయోమయం, పారిస్‌లో ఆ షాపు ఎక్కడ వున్నదా అని లోలోపలే గింజుకుంటూ.

టేబిల్‌మీదున్న పాత కాలింగ్‌బెల్‌ని మ్రోగించాడు డీలక్స్.

"ఏం కావాలి, బాస్?" అన్నాడు అయోమయం.

"బాయ్ ఎక్కడ?మూడు కాంపాకోలా తీసుకురమ్మను" అన్నాడు డీలక్స్.

"బాయ్ బయటకు వెళ్ళాడు బాస్! ఆ చోరీకేసులో ఫింగర్ ప్రింట్సు తీసుకురమ్మని నేనే పంపించాను" అన్నాడు అయోమయం.

"పరవాలేదండీ. నాకు ఇప్పుడేమీ వొద్దు"అందాయువతి.

"అబ్బెబ్బె....మీరు మా గెస్ట్...." అన్నాడు డీలక్స్ లాంఛనంగా.

"థాంక్యూ ...ప్లీజ్! డోంట్ బాదర్" అందామె.

"బాయ్ రాగానే తెప్పించుదాం బాస్!" అన్నాడు అయోమయం.

"చెప్పండి. మిసెస్ రామ్! మీకు ఏ విధంగా వుపకరించగలమో చెప్పండి" అన్నాడు డీలక్స్.

ఆమె గొంతు సవరించుకుంది.

అయోమయం పెన్నూ, నోట్‌బుక్కూ పట్టుకుని సిద్ధమయ్యాడు.

"డీలక్స్‌గారూ! ఈమధ్య నాకు కొన్ని బెదిరింపు వుత్తరాలు వస్తున్నాయి ..."

"ఎవరయినా మిమ్మల్ని చంపుతామంటున్నారా?" చటుక్కున ప్రశ్నించాడు అయోమయం.

"ఛఛ—" అందామె.

అయోమయం వంక కోపంగా చూశాడు డీలక్స్. అలాంటి అందమైన యువతిని అటువంటి చచ్చుప్రశ్న వేయడం నచ్చలేదు అతనికి.

"ఏమీ అనుకోకండి. ఈమధ్య మాకు వచ్చేవన్నీ మర్డర్ కేసులే కావడంతో మా వాడు నోరువిప్పితే చావు ప్రశ్నలే వస్తున్నాయి" అన్నాడు ఆమెతో.

"నేను చెప్పబోయేది రహస్యంగావుంచి, నాకు హెల్ప్ చేస్తారని ఆశిస్తున్నాను" అందామె.

"డిటెక్టివ్‌లను. యాక్టర్లను నిస్సంకోచంగా నమ్మొచ్చు మీరు" అన్నాడు డీలక్స్, ఏదో డిటెక్టివ్ నవలలో చదివిన డైలాగ్‌ని గుర్తుకు తెచ్చుకుంటూ.

"యాక్టర్స్ కాదేమో బాస్! డాక్టర్స్ అనుకుంటాను" అంటూ కరెక్ట్ చేయబోయాడు అయోమయం.

అతనివంక వురిమిచూసాడు డీలక్స్.

"కేసులతో వూపిరి సలపడంలేదు మాకు. అయినా మిమ్మల్ని చూస్తూంటే యేదో పెద్ద ప్రమాదంలోనే చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అందుకే మీ కేసు చేపట్టడానికి నిశ్చయించుకున్నాం. మీకు వచ్చిన కష్టమేమిటో చెప్పండి" అన్నాడు ఆమెతో.

"నాకు తెలుసు. మీ పేరుప్రఖ్యాతులు విని మీ దగ్గరకు వచ్చాను" అందామె చిరునవ్వుతో. "గంగూరామ్‌గారితో నా పెళ్ళయి మూడేళ్ళవుతుంది. అంతకు ముందు నేను

ఒకతన్ని ప్రేమించాను. కారణాంతరాలవల్ల పెళ్ళి చేసుకో లేకపోయాం....”

“అయాం సారీ!” అన్నాడు డీలక్స్.

“నా ప్రేమ గాథంతా మీవారితో చెప్పేస్తానంటూ ఈ మధ్య ఎవరో నన్ను బెదిరిస్తున్నారు” అందామె.

“ఉత్తరాలు వస్తున్నాయా?” ప్రశ్నించాడు డీలక్స్.

“లేదు. టెలిఫోనులో బెదిరిస్తున్నాడు” అందామె. “వాడు కోరిన సొమ్ము ఇవ్వకపోతే నేను నా ప్రియుడితో తీయించుకొన్న ఫోటోలను మా వారికి అందజేస్తానంటున్నాడు.”

హఠాత్తుగా ముఖం చేతుల్లో కప్పుకొని ఏడవ నారంభించిందామె.

అందమైన యువతి ఏడ్పు ప్రారంభించేసరికి కంగారు పడ్డారు డిటెక్టివ్‌లు. వారి మనసులు వెన్నలా కరిగి పోయాయి.

డీలక్స్ చటుక్కున కుర్చీలోంచిలేచి ఆమె ప్రక్కకువెళ్ళి, “ప్లీజ్!....ఏడవకండి” అంటూ ఆమె చేయి పట్టుకున్నాడు.

గరుడి అదృష్టానికి అయోమయానికి కించిత్తు అసూయ కలిగింది. ఆమెను ఓదార్చే నెపంతో తానూ ఆమెను తాక బోయాడు. కాని. డీలక్స్ వురిమి చూడడంతో మానేసాడు.

ఎంబ్రాయిడరీ అల్లిన చేతిరుమాలుతో సుతారంగా కన్నులు అద్దుకుందామె.

“సారీ!” అంటూ సర్దుకొన్నుంది.

“డీలక్స్ గారూ! ఈ మూడు నెలల్లోనూ లక్షన్నర ముట్ట జెప్పాను వాడికి అయినా నన్ను విడిచిపెట్టలేదు. ఇప్పుడు ఒకేసారి రెండు లక్షలు యివ్వమనీ, యికమీదట నా

జోలికి రానని అంటున్నాడు....” చెప్పుకుపోయిం దామె.
“కాని. ఒకేసారి రెండు లక్షలు ఇనప్పెట్టెలోంచి తీస్తే మా వారికి అనుమానం కలుగుతుంది పైగా వాడి దాహం అంతటితో తీరుతుందన్న నమ్మకమూ లేదు నాకు.”

“ఔనౌను. ఈ బ్లాక్ మెయిలర్స్ వున్నారే జలగల్లా పీల్చేస్తారు” ఒప్పుకున్నాడు డీలక్స్.

“ఆలోచిస్తూంటే మీరు గుర్తుకొచ్చారు. వెంటనే ఇలా వచ్చేసాను” అందామె.

“తెలివైన పని చేసారు!” అన్నాడు డీలక్స్.

“ఔనౌను. అది చాలా తెలివైన పని!” వంతపాడాడు అయోమయం.

“డీలక్స్‌గారూ! ఎలాగైనా సరే మీరు ఆ బ్లాక్ మెయిలర్ యెవరో కనిపెట్టి వాడిపీడ నాకు విరగడ చేశారంటే మీరు కోరినంత డబ్బు ఫీజు యిచ్చుకుంటాను. ప్లీజ్” అందామె.

“తప్పకుండా. తక్షణమే రంగంలోకి దిగి వాడి పని పట్టేస్తాం. మళ్ళీ జన్మలో వాడు మీ వూసెత్తకుండా చేసేస్తాం” అంటూ హామీ యిచ్చాడు డీలక్స్.

“థాంక్స్” అందామె. “ఇప్పుడు నా మనసెంతో తేలికగా వుంది.”

“ఓ సారి మీ యింటికి వచ్చి మీ ఇంట్లో వాళ్ళందరినీ గమనించాలి” అన్నాడు డీలక్స్.

“అలాగే రండి. మీరు నా ఫ్రెండ్ అని చెబుతాను.... సాయంకాలం నాలుగ్గంటలకు వచ్చారంటే మా వారు ఇంటి దగ్గర వుండరు” అందామె. “ప్రస్తుతానికి అడ్వాన్సుగా ఈ పదివేలూ వుంచండి.”

హ్యాండ్ బ్యాగ్ తెరిచిందామె. లోపల చేయి పెట్టింది. మరుక్షణంలో ఆమె వదనం వెలతెలబోయింది. కంగారుగా

బ్యాగ్ అంతా వెదికింది.

ఆమె కంగారు చూసి, "ఏమయింది మేడమ్? ఎందుకలా కంగారు పడుతున్నారు?" అని అడిగాడు డీలక్స్.

అందమైన ఆమె వదనం పాలిపోయింది. "మనీపర్స్ యెక్కడో జారిపోయినట్టుంది" అంది జీవంలేని నవ్వుతో.

"అరె! ఎంత వుంది అందులో? ఎలా పోయింది!" ఎక్కడ పోయింది?" అన్నాడు అయోమయం ఆతృతగా.

"పదిహేను వేలకు మించి వుండదనుకోండి....పది వేలు మీకు అడ్వాన్సుగా యివ్వాలని తెచ్చాను. దారిలో కొన్ని ముఖ్యమైన వస్తువులేవో కొనవలసివుంది కూడాను" అందామె.

"టాక్సీలో పడిపోయిందేమో చూసివస్తాను" అంటూ బయటకు పరుగెత్తాడు అయోమయం.

రెండు నిముషాలలో తిరిగి వచ్చి, లేదని చెప్పాడు.

"వచ్చేటప్పుడు ఐస్ పార్లర్‌కి వెళ్ళి డ్రింక్ త్రాగి వచ్చాను. బహుశా అప్పుడెప్పుడో జారిపోయి వుంటుంది" అందామె.

"వుయ్ ఆర్ వెరీ సారీ, మేడమ్!" అన్నాడు డీలక్స్.

"అయాం సారీ, డీలక్స్‌గారూ! వెంటనే మీకు అడ్వాన్సు యివ్వలేకపోతున్నాను. ఇఫ్ యూ డోంట్ మైండ్, సాయంత్రం ఇంటికి వచ్చినప్పుడు తీసుకుందురుగాని" అందామె నొచ్చుకుంటూ.

"ఇట్సాల్ రైట్. అడ్వాన్సు ఎక్కడికి పోతుంది!" అన్నాడు డీలక్స్.

"ఛఛ....నా అజాగ్రత్త వల్ల చేతిలో మరీ పైసా అయినా లేకుండా చేసుకున్నాను" అందామె స్వగతంలా.

"పోనీ, డబ్బు కావలిస్తే తీసుకువెళ్ళండి. సాయంత్రం

ఇద్దరుగాని" అన్నాడు డీలక్స్.

"ఒద్దులెండి. మా కార్లో రావడం ఇష్టంలేక టాక్సీలో వచ్చాను. టాక్సీ ఫేర్ ఇంటికి వెళ్ళాక యివ్వొచ్చును" అందామె.

"ఏదో కొనాలన్నారుగా? ఫరవాలేదు, తీసుకువెళ్ళండి" అంటూ జేబులో వున్న ఒకే ఒక వందరూపాయల నోటు తీసి ఆమెకు ఇచ్చాడు డీలక్స్.

మొహమాటపడుతూనే 'థాంక్స్' చెప్పి తీసుకుందామె.

"ప్లోసీ, మీ అసిస్టెంటును నాతో పంపించండి. అడ్వాన్సు ఇచ్చి పంపిస్తాను" అందామె.

"నో, నో....అంత అర్జెంట్ ఏమీలేదు. సాయంత్రం వచ్చినప్పుడు తీసుకుంటాంలెండి" అన్నాడు డీలక్స్.

"థాంక్స్!" అంటూ, తన యింటి చిరునామా చెప్పి లేచిందామె.

"మీ సహాయానికి కృతజ్ఞురాలిని, డీలక్స్‌గారూ! సాయంత్రం మీ కోసం ఎదురు చూస్తూంటాను" అని ఇద్దరికీ నమస్కరించి బయటకు నడిచిందామె.

అందమైన ఆమె రూపం వంకే చూస్తూ మంత్రముగ్ధుల్లా వుండిపోయారు డిటెక్టివ్‌లు.

"మిగిలిన ఒక్క నోటూ సమయానికి పనికి వచ్చింది. ఆ మాత్రం సాయం చేయకపోతే ఆవిడ ఏమనుకునేది?" అన్నాడు డీలక్స్.

"కరెక్ట్. పైగా ఖరీదైన క్లయింట్ కూడాను" అన్నాడు అయోమయం ఆమె అందాన్నే నెమరు వేసుకుంటూ.

3

సాయంకాలం నాలుగ్గంటలకు ట్రిమ్‌గా తయారయి కీల్వాక్‌లో వున్న మిసెస్ షీలారామ్ ఇంటికి బయలుదేరింది

డిటెక్టివ్ ద్వయం.

"సిటీ బస్‌లో వెళదాం" అన్నాడు అయోమయం.

"ఛఛ....అంత పెద్ద క్లయింట్ దగ్గరకు నడిచి వెళితే మన పరువేంకాను? టాక్సీలో వెళదాం" అన్నాడు డీలక్స్.

"మిగిలి వున్న చివరి నోటు ప్రొద్దుట ఆవిడికే ఇచ్చేసావు. మరి టాక్సీకి డబ్బులెలా వస్తాయి?" అన్నాడు అయోమయం కొశ్చన్ మార్కు ముఖంతో.

"అందుకే ఓ పాతికి అప్పుచేసి తెచ్చాను, ఆవిడ దగ్గర అడ్వాన్సు తీసుకున్నాక తిరిగి ఇచ్చెయ్యవచ్చునని" అన్నాడు డీలక్స్.

ఇద్దరూ టాక్సీలో బయలుదేరారు.

కొంత సేపటికి టాక్సీ కీల్పాక్‌లో ఒక బిల్డింగ్ ముందు ఆగింది.

దర్పంగా దిగి టాక్సీవాలాకు డబ్బులు యిచ్చాడు డీలక్స్.

అదే సమయంలో దర్జాగా ఆ బిల్డింగ్ వంక చూసిన అయోమయం వులిక్కిపడి కీచుగా అరిచాడు.

"ఏమయింది?" అన్నాడు డీలక్స్.

"బాస్! ఇది మిసెస్ షీలారామ్ ఇల్లు కాదు—పిచ్చాసుపత్రి!" అన్నాడు అయోమయం.

త్రుళ్ళిపడ్డాడు డీలక్స్.

బయలుదేరబోతూన్న టాక్సీవాలా వంక కోపంగా చూసాడు డీలక్స్.

"ఏమిటయ్యా ఇది? యెక్కడికో తీసుకువెళ్ళమంటే తిన్నగా పిచ్చాసుపత్రికి తీసుకొచ్చి విడిచావ్?" అంటూ గయ్యమన్నాడు.

"ఏయ్ మిస్టర్! మర్యాదగా మాట్లాడు. మీరు చెప్పిన

అడ్రస్ ఇదే!" అన్నాడు టాక్సీవాలా.

"మరి శేఠ్ గంగూరామో?" అన్నాడు అయోమయం, అయోమయంగా.

"బహూశా లోపల వుండివుంటాడు. వెళ్ళి చూడండి" అనేసి, నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు టాక్సీవాలా.

కొయ్యబొమ్మల్లా పిచ్చాసుపత్రివంకే చూస్తూ నిలుచుండి పోయారు డిటెక్టివ్‌లు.

జేబులోంచి అడ్రస్ స్లిప్ తీసిచూసాడు డీలక్స్. అదే అడ్రస్.

పిచ్చాసుపత్రి అడ్రస్ యెందుకిచ్చిందామె!?

పిచ్చెక్కిందిి డీలక్స్‌కి. జుట్టు పీక్కోబోయి తాను వున్నది పిచ్చాసుపత్రి ముందు అన్న విషయం గుర్తుకు రావడంతో మానేసాడు.

'ఆమె యెవరో తమ్మి మోసం చేసిందా?' అన్న అనుమానం కలిగింది. కాని అటువంటి అందగత్తె మోసం చేస్తుందంటే నమ్మ బుద్ధికావడంలేదు.

"మోసపోయాం గురూ! అద్వాన్సు మాట దేవుడెరుగు! మన వందరూపాయలుకూడా పోయాయి" అన్నాడు అయోమయం.

"నో,నో ....అడ్రస్ పొరపాటుగా రాసుకుని వుంటావ్ నువ్వు. టెలిఫోను డైరెక్టరీ చూస్తే కరెక్టు అడ్రస్ తెలుస్తుంది" అంటూ సమీపంలో వున్న పబ్లిక్ టెలిఫోను బూతువైపు నడిచాడు డీలక్స్.

అయోమయం అతని ననుసరించాడు.

డీలక్స్ బూతులో ప్రవేశించి టెలిఫోను డైరెక్టరీలో వెదికాడు. డైరెక్టరీ అంతా తిరగవేసినా శేఠ్ గంగూరామ్ గాని, అతని నగల షాపు గాని కనిపించలేదు అందులో,

"మోసపోయాం, గురో!" అన్నాడు అయోమయం మళ్ళీ ఏడుపు ముఖంపెట్టి.

"డామిట్! ఆమె అందం చూపి మోసపోయాం" అన్నాడు డీలక్స్, డై రక్టరీని దభీమని బల్లమీద పడేస్తూ.

ఇద్దరూ టెలిఫోను బూత్‌లోంచి బయటకు వస్తూంటే ఎవరో వ్యక్తి బూత్‌లో ప్రవేశించబోయాడు.

ఆ సమయంలో చూసుకోకుండా, డీలక్స్ వెనుక వస్తూన్న అయోమయం కాలిని తన బూటుకాలితో త్రొక్కేసాడు ఆ వ్యక్తి.

'కెవ్వ' మన్నాడు అయోమయయం.

ఉలిక్కిపడి తిరిగిచూసాడు డీలక్స్, అయోమయాన్ని ఏ తేలయినా కుట్టిందేమోనని.

అయోమయం కాలు పట్టుకొని వొంటికాలిపైన భరత నాట్యం చేస్తున్నాడు.

జరిగింది గ్రహించి ఆ వ్యక్తివంక కోపంగా చూశాడు డీలక్స్.

అదేక్షణంలో ఆ వ్యక్తి కూడా డీలక్స్‌వంక చూసాడు.

ఒక క్షణం యిద్దరి చూపులూ కలుసుకున్నాయి!

అంతే!

డీలక్స్ బుర్రలో డేంజర్‌లైట్ వెలిగింది!

ఆ వ్యక్తిని గుర్తుపట్టడంతో యెగిరి పడ్డాడు డీలక్స్.

అతను కూడా డీలక్స్‌ని గుర్తు పట్టినట్టున్నాడు. బూత్‌లోకి వెళ్ళడం మానేసి, హఠాత్తుగా వెనక్కితిరిగి పరుగు లంకించుకున్నాడు.

"అయోమయం! పారిపోతున్నాడు....వాణ్ణి పట్టుకో!" అని అరిచి, ఆ వ్యక్తి వెంటపడ్డాడు డీలక్స్.

అనుకోని ఆ పరిణామానికి క్షణం తెల్లబోయాడు

అయోమయం. అంతలోనే తేరుకుని బాస్‌తోపాటే ఆ వ్యక్తి వెనుక పరుగెత్తాడు.

అలా కొంతదూరం మగ్గురూ రన్నింగ్ రేస్ చేసిం తరువాత, ఆ వ్యక్తి డిటెక్టివ్‌లకు దొరికిపోయాడు.

"రాస్కెల్! మమ్మల్ని మోసగించి పారిపోవాలను కుంటున్నావ్రా?" అంటూ ఒకటి తగిలించాడు డీలక్స్.

ఆ వ్యక్తి ముఖంలోకి పరీక్షగా చూసిన అయోమయం త్రుళ్ళిపడ్డాడు.

వెంటనే. "బాస్! గల్ఫ్ కంట్రీస్‌లో నాకు వుద్యోగం యిప్పిస్తానని చెప్పి రెండేళ్ళ క్రితం నా దగ్గర మూడువేలు తీసుకొని పరారయిన రాస్కెల్ వీడే!" అన్నాడు వుద్యోగంతో.

"ఔను. వీడు నాకూ టోకరా వేసాడు. నా దగ్గరా మూడువేలు తీసుకున్నాడు. మనలాగే చాలామంది నిరుద్యోగుల్ని మోసంచేసి రెండేళ్ళుగా పరారీలో వున్నాడు" అన్నాడు డీలక్స్. "ఈ రోజు వీడికి మూడింది. అందుకే మన కళ్ళబడ్డాడు."

"మీ డబ్బు తిరిగి ఇచ్చేస్తాను. నన్ను వొదిలెయ్యండి" అన్నాడు ఆ వ్యక్తి ప్రతిమాలుతూ.

"షటప్! నిన్ను పోలీసులకు అప్పగించి దేహశుద్ధి చేయిస్తేగాని నీకు బుద్ధిరాదు. ఆనక మా డబ్బు ఎలాగూ కక్కక తప్పదు నువ్వు" అన్నాడు డీలక్స్ అతని మెడ పైన గ్రుద్దుతూ.

డిటెక్టివ్ ద్వయం అతన్ని కీల్పాక్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించింది.

అతను కొన్ని వందల మందికి గల్ఫ్ కంట్రీస్‌లో వుద్యోగాలు ఎరచూపి వారి నుండి వేలకు వేలు గుంజి,

అందరినీ మోసగించి పరారయ్యాడనీ. పోలీసులు రెండు ఏళ్ళుగా అతని కోసం వెదుకుతున్నారనీ తెలిపింది.

ఆ తరువాత డిటెక్టివ్ లిద్దరికీ వారివారి సొమ్ములు వాపసు రావడమేకాక, ఆ చీట్ ని పట్టిచ్చినందుకు పోలీసులు చెరో అయిదువందలూ బహుమతిగా ఇవ్వడం జరిగింది.

"బాస్! మనం ఆ యువతి చేతిలో మోసపోయి వంద రూపాయలు పోగొట్టుకున్నా, ఆమె మూలంగా మనం పోయిందనుకున్న ఆరువేలూ కాక అదనంగా ఐదువందలు అదనంగా లభించాయి" అన్నాడు అయోమయం ఆనందంగా.

"రైట్. పద. బుహారీకివెళ్ళి డిన్నర్ కి ఆర్డర్ చేద్దాం" అన్నాడు డీలక్స్ హుషారుగా ఈలవేస్తూ. □

1983 'వెంకట్ అవార్డు' పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కార్టూను



ఇంట్లో నేనొక్కడినే వున్నాను — వరండాలో పేము కుర్చీలో వెనక్కు వాలి ఇంగ్లీషు దినపత్రిక చదువుతున్నాను.

ఇంతలో—పోస్టుమేన్ గేటు నెట్టుకుని చిరునవ్వుతో లోపలకు వచ్చి నా చేతికో నీలిరంగు కవరును అందించి వెళ్ళిపోయాడు.

ఆ కవరుమీద నా పేరే వున్నది. ఆ దస్తూరి నాకు పరి

చయ మయినది కాదు—వంకరటింకరగా ఎక్కువగా చదువుకోని మనిషి రాసినట్టుగా వున్నాయి అక్షరాలు.

నేను పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా చేసి రిటైరు అయిన తర్వాత నాకు ఉత్తరాలు రావటం బాగా తగ్గిపోయింది.

ఆత్రంగా కవరు చించాను.

అందులో ఇలా వున్నది:

'డియర్ జయంత్‌రావ్—....నేను ఈ మధ్యనే జైలునించి విడుద లయినాను .... నాలో ఇప్పటి వరకూ తీరని కోరిక ఒకటి వుంది. ఇప్పుడా కోరికను తీర్చుకుంటాను. ఆ కోరిక ఏమిటో చెబితే నీ గుండె ఆగిపోవచ్చు. ఐనా సరే రాస్తాను. నీ ఒకే ఒక్క కొడుకు ఇన్‌స్పెక్టర్ విజయ్‌ని నా రివాల్వర్‌తో కాల్చి చంపటం. అర్థమయిందా? ఎందుకో తర్వాత మళ్ళీ రాస్తాను.

బై— ఒక పాత ఖైదీ'

పోలీసు వుద్యోగి నయిన నాకు ఆ ఉత్తరం చదవగానే గుండె చిన్నగా అదిరింది. ఉద్యోగంలో వున్నప్పుడు ఇలాంటి బెదిరింపు ఉత్తరాలు చాలా వచ్చాయి. వాటిని నేను ఎప్పుడూ లెక్కచెయ్యలేదు.

కాని—యిప్పుడు ఈ ఉత్తరాన్ని తేలికగా తీసెయ్యలేకపోయాను. ఎందుకంటే ఆ పాత నేరస్తుడు నా మీద పగ తీర్చుకుంటానని—నన్ను రివాల్వర్‌తో కాల్చి చంపుతానని బెదిరిస్తూ రాసినట్టయితే నే నంతగా భయపడే వాడిని కాదు.

వాడెవరో నా ఒకేవొక్క కొడుకయిన విజయ్‌ని చంపుతానని రాసేసరికి నాకు నిజంగానే భయం కలిగింది.

ఎందుకంటే నేరస్తులు అన్నింటికీ తెగించిన మను

షులు. అందరిలోనూ యెక్కువ కాలం జైల్లో శిక్ష అనుభవించి వచ్చిన నేరస్తుడిలో తెగింపు మరింత ఎక్కువగా వుంటుంది.

ఇంతకీ ఈ పాతఖైదీ ఎవరు?

ఎవరని గుర్తుచేసుకోగలను? నేను వుద్యోగంలో వున్నప్పుడు లెక్కలేనంతమంది దొంగలను, హంతకులను ఇతర నేరస్తులను పట్టుకుని చట్టానికి అప్పగించాను.

అంత మంది నేరస్థులలో ఇప్పుడు నన్ను బెదిరిస్తూ ఉత్తరం రాసిన నేరస్థుడు ఎవరో?

ఐనా నామీద వున్న పగకు నా కొడుకును చంపుతానని బెదిరిస్తూ ఉత్తరం రాయటం ఎందుకూ?

ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

నేనిలా ఆలోచిస్తున్నప్పుడే కోవెలకు వెళ్ళిన నా భార్య కోడలు తిరిగి వచ్చారు. వారితో ఆ బెదిరింపు ఉత్తరం గురించి చెబుదామనే అనుకున్నాను.

కానీ మళ్ళీ చెప్ప దల్చుకోలేదు. వాళ్ళు బాగా భయపడి పోవచ్చు. అందుకే మవునంగా వుండిపోయాను.

ఓఅరగంట తర్వాత మోటార్ సైకిలు మీద నా కొడుకు విజయ్ వచ్చాడు.

అతను నా దగ్గరకు రాగానే పిల్చి నా ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్న తర్వాత ఆ ఉత్తరాన్ని వాడికి ఇచ్చాను.

నిమిషంలో ఆ ఉత్తరాన్ని చదివి నాకు ఇచ్చేస్తూ "సిల్లీగా వుంది. ఎవడో జోక్ చెయ్యటానికి రాశాడు" అన్నాడు నవ్వుతూ.

"కాదు. ఇది జోక్ చెయ్యటానిక్కాదు. సీరియస్‌గా రాసిన ఉత్తరం. నువ్వు చాలా జాగ్రత్తగా వుండాలి. పగ

బట్టిన నేరస్థుడు పగపట్టిన పాముతో సమానం. తన పగ తీర్చుకునే వరకు నిద్రపోడు" అన్నాను.

విజయ్ నవ్వి "మీరేనా ఈ మాటలు చెబుతున్నది. నేను మామూలు మనిషిని కాదు పోలీసు ఇన్‌స్పెక్టర్‌ని.... నేనంటే ఈ వూరంతటికీ టెర్రర్. నన్ను ఎవడో ఫూల్ రివాల్వర్‌తో కాల్చి చంపుతానని బెదిరిస్తూ ఓ లెటర్ రాస్తే మీరు నిజంగానే భయపడుతున్నారా?" అన్నాడు లేచి నిల్చుంటూ.

నాకు ఏ౦ నాలో తెలియక "సరే. ఎందుకయినా మంచిది నీ జాగ్రత్తలో నువ్వుండు. మీ అమ్మకు—భార్యకు ఈ ఉత్తరం గురించి చెప్పకు" అన్నాను.

"అలాగే" అని నవ్వుకుంటూ బూట్లు టకటకలాడించు కుంటూ లోపలకు వెళ్ళాడు విజయ్.

నిజంగానే ఆ ఉత్తరాన్ని జోక్ చెయ్యటానికి ఎవడైనా రాశాదేమోననే ఆలోచన నాలో ఎందుకో కలిగింది వున్న ట్టుండి.

2

ఆ రాత్రి నాకు చాలాసేపటి వరకు నిద్ర పట్టలేదు. ఆ పాత ఖైదీ యెవరో వూహించుకోటానికి ప్రయత్నం చేస్తూనే వున్నాను.

జైలుకు వెళ్ళబోయే ముందు కోర్టు హాలులోనే నన్ను ముగ్గురు హంతకులు హెచ్చరికలు చేశారు.

ఆ ముగ్గురిలో యాదగిరి బాగా పౌరుషం వున్న మనిషి. అతడికి నలభై యేళ్ళుంటాయి. ఇద్దరు స్త్రీలను దారుణంగా హత్య చేశాడు నగలకోసం. అతడిని నేనే పట్టుకుని కోర్టుకు అప్పగించాను. అతడికి యావజ్జీవ కారాగారశిక్ష పడింది.

అతను జైలుకు వెళ్ళబోతూ ఎప్పటికైనా తిరిగి వచ్చి నా మీద పగ తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేసి వెళ్ళాడు.

మిగిలిన మనుషుల గురించి నేను అంతగా పట్టించుకో లేదు. యాదగిరి రూపాన్ని బాగా గుర్తు చేసుకోటానికి ప్రయత్నించాను.

ఒకమాదిరి లావు పొట్టిగా వుండేవాడు. నల్లటి వంటి రంగు—దేగ కళ్ళు—పలుచని జుట్టు.

ఎప్పుడో రాత్రి రెండు గంటలు దాటిన తర్వాత నిద్ర పోయాను.

నాకు మెలకువ వచ్చేసరికి మోటార్ సైకిలు స్టార్టయిన చప్పుడు వినిపించింది. వెంటనే బయట కొచ్చాను.

విజయ్ డ్యూటీకి వెళ్ళబోతున్నాడు. వాడి దగ్గరకు వెళ్ళి "జాగ్రత్త. మనల్ని హెచ్చరించిన మనిషి ఓ హంత కుడు" అన్నాను.

విజయ్ నవ్వి "మీ రింకా ఆ ఉత్తరం గురించి మరచి పోలేదా? సర్లెండి. ఆ హంతకుడి అంతు నేను చూస్తాను. నేను పోలీసు ఇన్స్పెక్టర్ని. నన్ను నేను రక్షించుకో గలను" అని వెళ్ళిపోయాడు.

నా కొడుకు ఆత్మ విశ్వాసానికి నాకు ఎంతో గర్వం కలిగింది. కాని కన్నతండ్రిగా వాడికి రాబోయే ప్రమాదం గురించి ఎంతో భయం కలిగింది.

నేను కూడా ఇంతే. ఉద్యోగంలో వున్నప్పుడు ఎంతటి భయంకరమైన హంతకుడినైనా, ఎటువంటి ప్రమాదాన్నీ లెక్క చెయ్యలేదు.

*

ఆ రోజుకూడా పోస్టుమేన్ మరో నీలిరంగు కవర్ని నాకు ఇచ్చి వెళ్ళిపోయాడు.

కవరుమీద అదే దస్తూరి. ఫ్రమ్ ఎడ్రసు లేదు. ఆ పూళ్ళోనే క్రితం రోజు పోస్టు చెయ్యబడింది ఆ కవరు.

చించాను.

'డియర్ పోలీసు ఇన్‌స్పెక్టర్,

నిన్నటి నా ఉత్తరాన్ని చదువుకుని నువ్వు నీ కొడుకును జాగ్రత్తగా వుండమని హెచ్చరించి వుంటావు. అతను ఎంత జాగ్రత్తగా వున్నా నా రివాల్వర్ గురినుండి తప్పించుకోలేడు నిజానికి నాకు అతనిమీద పగలేదు. నా పగ అంతా నీమీదే. ఎందుకంటే నువ్వు నన్ను వెతికి, వెతికి పట్టుకుని కోర్టుకు అప్పగించి జైలుశిక్ష వేయించావు. నేను జైలుకు వెళ్ళిన నాలుగేళ్ళకు నాకు వున్న ఒకే ఒక్క కొడుకును నామీది కోపంతో కొంతమంది మనుషులు దారుణంగా హత్య చేశారు. కనీసం ఆ విషయం గూడా నీకు తెలీదు.

నా కొడుకు మరణవార్త విని నేనెంత కుమిలిపోయానో నీకు అర్థంకాదు. ఇన్నేళ్ళూ జైల్లో రోజూ నా కొడుకు చావును తల్చుకుని ఏడుస్తూనే వున్నాను. ఆ పుత్ర శోకం ఎలా వుంటుందో నీక్కూడా తెలియాలి. అందుకోసమే నేను నీ ఒక్క కొడుకును కాల్చి చంపటానికి నిర్ణయించుకున్నాను. ఇక నీకు నానుండి ఉత్తరం రాదు. నీ కొడుకు శవమే వస్తుంది—బై—ఒక పాత ఖైదీ.'

ఇక నేను ఆ ఉత్తరం గురించి జోక్‌గా అనుకోలేక పోయాను. నాలో ఏమూలనో వున్న అలాంటి ఆలోచన రెండోసారి వచ్చిన ఆ ఉత్తరాన్ని చదవటంతో యెగిరి పోయింది.

గబగబా ఫోన్ దగ్గరకు నడిచాను.

పోలీసుస్టేషన్‌కు డయల్ చేశాను.

విజయ్ రిసీవర్ యెత్తాడు.

"హల్లో" అన్నాడు.

మళ్ళీ వచ్చిన ఆ బెదిరింపు ఉత్తరం గురించి వివరంగా చెప్పాను.

వాడు ఫోన్లో పెద్దగా నవ్వి "మీరు పోలీసు డిపార్టు మెంటులో ఉద్యోగం చేసిన మనిషేనా అనే అనుమానం వస్తోంది డాడీ మీరు ఆ ఉత్తరాల గురించి మరచిపొండి. ఎవడో మతిలేని మనిషి ఆ ఉత్తరాలను రాపి మీకు పోస్టు చేస్తున్నాడు" అని తర్వాత ఫోన్ పెట్టేశాడు.

విజయ్ మొండితనానికి ఈసారి నాకు కోపం వచ్చింది. ఐనా నేను చెయ్యగలిగింది యేమీ లేదు.

రాత్రి ఏడు గంటల వరకూ ఆలోచనలతోనే గడిపాను. ఎనిమిది గంటలు కావస్తున్నా విజయ్ ఇంటికి రాలేదు. ఆ రోజు మధ్యాహ్న భోజనం ఎవరో స్నేహితుడింట్లో చేస్తానని ఉదయం వెళ్ళేటప్పుడే చెప్పి వెళ్ళిపోయాడు.

వాడికోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను.

తొమ్మిది గంటలు కావస్తున్నప్పుడు మోటార్ సైకిలు వస్తున్న చప్పుడు వినిపించింది.

క్షణం తర్వాత దానిమీద విజయ్ వచ్చాడు.

వాహనానికి స్టాండువేసి వాడు నా దగ్గరకు వచ్చాడు. వాడి మొహం సీరియస్‌గా వున్నది.

"మీరు చెప్పింది నిజమే డాడీ" అన్నాడు.

ఉలిక్కిపడ్డాను.

"ఏమయ్యింది?" కంగారుగా అడిగాను.

"ఎనిమిదిన్నర సమయంలో పార్కురోడ్డులో వస్తున్నప్పుడు వెనకనించి ఎవరో మూడుసార్లు రివాల్వర్ పేల్చారు. కొంచెంలో ప్రమాదం నుంచి బయటపడ్డాను.

మూడు బుల్లెట్లు దాదాపు రాసుకుంటూనే వెళ్ళిపోయాయి. వెనక్కి తిరిగి వచ్చేసరికి అక్కడ ఎవ్వరూ కనిపించలేదు. పిస్తోలు పేల్చిన మనిషి పారిపోయాడు."

"మై గాడ్. ఎంత ప్రమాదం తప్పిపోయింది" అన్నాను భయంగా.

ఆ మూడు బుల్లెట్లూ శరీరంలో దిగబడిపోయినట్లయితే??

వూహించలేక పోయాను.

"ఇప్పటి కయినా ఒప్పుకుంటావా? అవి కేవలం బెదిరింపు ఉత్తరాలు కావు. ఆ ఉత్తరాల్లో నిజముంది. నేరస్థుడు తాను అనుకున్నది చెయ్యాలనే పట్టుదల వున్న మనిషి అతనిది పాము పగ" అన్నాను.

"నిజమే ఇప్పుడు యిక ఆ మనిషి పట్టుబడే వరకూ నేను జాగ్రత్తలో వుండక తప్పదు" అన్నాడు విజయ్.

"బాగా రద్దీ వున్న వీధుల్లో నించే వెళుతూ వుండు. ఒంటరిగా ఎక్కడికీ వెళ్ళవద్దు" అన్నాను.

సరే నన్నాడు విజయ్.

ఇంత జరిగినా ఈ విషయాన్ని ఇద్దరం యింట్లో వున్న స్త్రీలకు తెలియనివ్వలేదు.

4

రాత్రి ఏడు గంట లయ్యింది—

ఆరోజు అపాత ఖై దీనించి నాకుమళ్ళీ ఉత్తరం రాలేదు.

నా భార్య—కోడలు మా బంధువుల యింటికి వెళ్ళారు ఓ గంట క్రితం.

నేనొక్కడినే లోపలి గదిలో కూర్చున్నాను ఓ ఇంగ్లీషు జర్నల్ చదువుతూ.

గోడనున్న గడియారం టిక్ టిక్ మంటోంది. నా మన సంతా ఆదుర్దాగా వున్నది విజయ్ గురించి.

ఈరోజు ఏమైతుందో కళ్ళుమూసుకుని ఆలోచిస్తున్నాను.

ఉన్నట్టుండి గది తలుపులు మూసుకున్న చప్పుడు విని పించి కళ్ళు తెరిచాను వులిక్కిపడి.

ఆశ్చర్యం!

నా ఎదురుగా—పొట్టిగా నల్లగా వున్న మనిషి తలుపుల దగ్గర నిల్చుని వున్నాడు.

పలుచని జుట్టు-డేగ కళ్ళు తీక్షణమైన చూపులు....

"గుర్తున్నానా జయంతరావ్" నవ్వుతూ అడిగాడు.

"నువ్వు యాదగిరివి"

"అవును. యాదగిరినే. నీ కారణంగా కొడుకును పోగొట్టుకున్న దురదృష్టవంతుడిని."

జుట్టు నెరిపింది. అదే అతడిలో మార్పు.

అతను అక్కడినించి కదల్లేదు.

"ఇంతకీ నువ్వు ఇక్కడికి ఎందుకువచ్చావ్?" అడిగాను.

"పిచ్చి ప్రశ్న....నిన్న రాత్రి నీ కొడుకు నా రివాల్వర్ గురినించి తప్పించుకున్నాడు. ఈ రోజు నా గురి తప్పదు. అతడిని నీ కళ్ళముందే హత్య చేస్తాను. ఇంతకంటే అనువైన చోటు నాకు దొరకదు" అంటూ నవ్వాడు.

నవ్వుతూనే గీతల ప్యాంటు జేబులో నించి నల్లగా మెరుస్తున్న రివాల్వర్‌ని బయటకు తీశాడు.

"వద్దు....నా కొడుకును ఏమీచెయ్యవద్దు....అప్పట్లో నా ఉద్యోగధర్మం నేను నిర్వర్తించాను. అంతేకాని నీ కొడుకు చావుకు నేను కారణం కాదు. వెళ్ళిపో...." అన్నాను.

అతను మళ్ళీ నవ్వి "నీ వుద్యోగ ధర్మం గురించి నాకు అనవసరం. ప్రాణానికి ప్రాణం. అంతే, నువ్వు యెన్ని మాటలు చెప్పినా నా నిర్ణయం మారదు. ఇక నా గురి తప్పదు" అన్నాడు అతను.

నేనేదో మాట్లాడబోయేంతలో మోటార్ సైకిలు లోపలకు వస్తున్న చప్పుడు వినిపించింది.

విజయ్ వస్తున్నాడు. యాదగిరి లోపల వున్నట్లు ఎలాగైనా వాడికి తెలియజేయాలి.

కుర్చీలోనించి లేవబోయాను.

"కదలకు. రివాల్వర్ పేలుతుంది" అన్నాడతను కటువుగా.

ఐనా నేను లక్ష్యపెట్టలేదు. ఎలాగైనా నా కొడుకు ప్రాణాలు కాపాడుకోవాలి.... అందుకే మొండిగా మళ్ళీ లేవబోయాను.

రివాల్వర్ పేల్చాడు యాదగిరి.

డామ్మని చప్పుడయ్యింది. బుల్లెట్ నా పక్కనించి దూసుకు వెళ్ళింది.

వెంటనే మోటార్ సైకిలు బయటకు వెళ్ళిపోతున్న చప్పుడు వినిపించింది.

"ఈసారి గూడా నీ కొడుకు తప్పించుకున్నాడు. నువ్వు తెలివిగా అతడిని పంపించివేశావు. ఐనా ఈసారి తప్పించుకో లేడు. మళ్ళీ వస్తాను" అని రివాల్వర్‌ని జేబులో పెట్టుకుని తలుపులు తెరిచాడు.

అంతే, ఒక్క విసురున వచ్చి వుండలా. లోపల పడిపోయాడు.

ఆశ్చర్యంగా చూశాను.

ఎదురుగా చేతిలో రివాల్వర్‌తో నా కొడుకు విజయ్ నిల్చుని వున్నాడు.

"నువ్వు వెళ్ళిపోలేదా?" అన్నాను సంతోషంగా.

"లేదు. నాతోపాటు మరో కానిస్టేబుల్ గూడా వచ్చాడు. రివాల్వర్ పేలిన శబ్దం వినిపించగానే లోపలి పరిస్థితి నాకు

అర్థమయి పోయింది. వెంటనే మోటార్ సైకిలు మీద కానిస్టేబుల్‌ని బయటకు పంపించి నేను ఇక్కడికి వచ్చి నిల్చున్నాను" అన్నాడు.

ఇంతలోనే కిందపడిన యాదగిరి జేబులోనించి రివాల్వర్ బయటకు తీశాడు. అతను రివాల్వర్ పేల్చకముందే విజయ్ చేతిలో రివాల్వర్ పేలింది.

యాదగిరి చేతిలో రివాల్వర్ యెగిరి దూరంగా పడి పోయింది. అప్పటికప్పుడే యిద్దరం కలిసి యాదగిరిని తాళ్ళతో కట్టేశాము.

తర్వాత విజయ్ పోలీసు స్టేషన్‌కి ఫోన్ చేసి, కానిస్టేబుల్స్‌ను రమ్మని చెప్పాడు.

"ఈసారి జైలునించి తప్పించుకుని వచ్చి. మిమ్మల్నిద్దరినీ చంపుతాను" అని మళ్ళీ బెదిరించాడు యాదగిరి. □

1983 'వెంకట్ అవార్డు' పోటీలో
రెండవ బహుమతి పొందిన కార్టూను



హోటల్ యువరాజ్ ముందు ఆటో ఆగింది.

ఆటో దిగి ఫేర్ చెల్లించి లోపలకు వెళ్ళింది రేఖ. అందరి కళ్ళూ ఆమెమీదే వున్నాయి అనడం కంటే, అందరి కళ్ళనీ ఆమె అందం ఆకర్షించింది అనడం బాగుంటుంది. రేఖకి నిండా ఇరవై ఏళ్ళు లేవు. సన్నజాజి తీగలా నాజూకుగా వుంది గులాబీ రంగు నైలెక్స్ చీర గాలికి రెపరెపలాడుతూ చూపరుల గుండెలు గుబగుబలాడి

స్తోంది.

అయితే ఆమె ఎవరి వంకా చూడలేదు. ఠీవిగా చకచక అడుగులు వేసుకుంటూ మేడపైకి వెళ్ళింది. అదొక మధ్య రకం హోటల్. మూడంతస్థుల భవనమే అయినా లిఫ్ట్ సౌకర్యం లేదు.

రూమ్ నెంబర్ 101 ముందు ఆగి బెల్ నొక్కింది. వెంటనే తలుపులు తెరుచుకున్నాయి.

గళ్ళ లుంగీలో వున్న పాతికేళ్ళ యువకుడు "హాయ్ రేఖా!" అన్నాడు.

ఆమె చిరునవ్వు నవ్వింది.

బెడ్ మీద వాలిపోయింది.

అతను తలుపులు మూసి బోల్టు పెట్టాడు.

"డ్యూటీనుంచి ఇటే వచ్చేశావా?" అని ప్రశ్నించాడు.

"వూఁ...."

"ఆ రాస్కెల్ ఏమన్నాడు?"

"ఎవరూ సలీమా?"

"ఆఁ....వాడే."

ఆమె గలగల నవ్వింది.

మధూ! అదంతా తల్చుకుంటుంటే నాకు వచ్చే నవ్వొస్తోంది సుమా!" అంటూ ఆమె పకపక నవ్వింది.

"ఏం జరిగిందేం?" అన్నాడు మధు నవ్వుతూ.

ఫ్యాక్టరీ సైరన్ కూశాక నేను ముందే వెళ్ళి బస్‌స్టాప్ దగ్గర నిల్చున్నాను. సలీమ్‌గాడు అలవాటు ప్రకారం నా దగ్గరగా వచ్చి వెకిలినవ్వు నవ్వాడు. మామూలుగా అయితే వాడిని చూసీ చూడనట్లు వుండేదాన్ని గదా. ఈ రోజు నేనూ నవ్వాను. వాడు దంగై పోయాడు.

"వెధవ బస్ యెంతకీ వచ్చి చావదేం?" అన్నాను

నెమ్మదిగా.

"అవును రేఖా! ఈ బస్ ఎప్పుడూ టైమ్‌కు వచ్చి చావదు" అంటూ దగ్గరగా వచ్చాడు.

"తల నొప్పిగా వుంది" అన్నాను ఓరగా చూస్తూ.

"అరెరె....అలాగా! నా హేండ్ బ్యాగ్‌లో అనాసిన్ వుంది. అది వేసుకుని కాఫీ తాగితే తలనొప్పి ఇట్టే మాయ మౌతుంది" అన్నాడు.

"వద్దు....వద్దు....అదే పోతుంది" అన్నాను బెట్టు చేస్తూ.

ఇక చూడు వాడి తిప్పలు. పట్టుకుని జిడ్డులా వదల్లే దనుకో. అయిష్టం నటిస్తూ వాడివెంట వెళ్ళాను. అల్పా హోటల్‌కి తీసికెళ్ళాడు. వద్దు వద్దంటున్నా సమోసాలు, బిస్కెట్లు తెప్పించాడు. కాఫీ తాగాక అసలు సంగతి చెప్పాను.

"సలీమ్! రోజూ నా వెంట యెందుకు పడతావ్?"

సలీమ్ బిత్తరపోయాడు. కొంచెం సేపటికి తేరుకుని "రేఖా! నువ్వు అందంగా వుంటావు" అన్నాడు.

"అందంగా ఎందరో వున్నారు" అన్నాను.

"వాళ్ళందరికన్నా నువ్వు అందగత్తెవు" అన్నాడు.

నేను నవ్వాను. ఇక వాడు ధైర్యం తెచ్చుకుని నా అందం పొగడడం మొదలుపెట్టాడు.

వాడి పొగడ్తలకు నేను కరిగిపోయినట్టు నటించాను. వాడు చొరవచేసి నా చేతివేళ్ళను తాకాడు.

"ఇప్పుడు కాదు సలీమ్!" అన్నాను.

"ఎప్పుడు?" అన్నాడు.

"రేపు."

"ఎక్కడ కలుసుకుందాం?"

"మా ఇంట్లోనే" అన్నాను.

"సలీమ్ ఆశ్చర్యపోయాడు."

"మీ ఇంట్లోనా?"

"అవును."

"ఎలా?"

"మధు వూళ్ళోలేడు" అన్నాను.

"అలాగా?" అని సంతోషించాడు.

"చూడు సలీమ్! మనం మొదటిసారి కలుసుకో బోతున్నాం. గ్రాండ్‌గా వుండాలి. నేను చికెన్ ఫ్రై, యగ్ మసాలా, ఫ్రైడ్ రైస్ తయారు చేస్తాను. నువ్వు మాత్రం మెక్‌డోల్ బ్రాందీ ఫుల్ బాటిల్ పట్టుకురావాలి" అన్నాను.

"ఏమిటీ నువ్వు డ్రింక్ చేస్తావా?" అన్నాడు బిత్తర పోతూ.

నేను నవ్వాను.

"ఏం చెయ్యకూడదా?"

"ఆహాఁ....అలాకాదు. నిన్ను చూస్తే అలా అనుకో లేదు" అన్నాడు.

"సరిగ్గా చీకటిపడే సమయానికి బ్యాక్ డోర్ నుంచి రావాలి. నేను రెడీగా వుంటాను" అన్నాను.

ఇక వాడు లొట్టలేసుకుంటూ పోయాడు. బహుశా యీ రాత్రికి వాడు నిద్రపోడనుకుంటాను.

రేఖ చెప్పడం ముగించింది.

ఇద్దరూ నవ్వుకున్నారు.

"మీకు రిజర్వు దొరికిందా?" ప్రశ్నించింది రేఖ.

"ఎల్లుండి రాత్రికి దొరికింది" అన్నాడు మధు.

"మైగాడ్ ఎలా?" అంది రేఖ.

"ఏం?"

"రేపు రాత్రి నువ్వీ వూళ్లో వుండగూడదు."

"పరవాలేదు. డోంట్ వర్రీ" అన్నాడు మధు.

ఇద్దరూ కొంచెం సేపు కబుర్లు చెప్పుకున్నారు. మధు బేరర్‌తో డిన్నర్ తెప్పించాడు. మధు విస్కీ, రేఖ బీర్ తీసుకున్నారు.

రాత్రి తొమ్మిది దాటింది.

"గుడ్‌నైట్ మధూ!" అంది రేఖ వెళ్ళడానికి సిద్ధ పడుతూ.

"బీ కేర్‌ఫూల్ రేఖా! వాడొట్టి మూర్ఖుడు. జాగ్రత్తగా డీల్ చెయ్యి" అన్నాడు మధు.

"ఆల్‌రైట్ మధూ! గుడ్‌నైట్" చెప్పి రేఖ చరచర బయటికి నడిచింది.

2

అప్పుడప్పుడే చీకటి పడుతోంది.

రేఖ కిచెన్ రూమ్‌లో వుంది.

బ్యాక్ డోర్ చప్పుడు వినిపించింది.

రేఖ తలుపులు తీసింది.

సలీమ్ కంగారుగా లోపలకు వచ్చాడు.

"ఇటీజ్ ఓన్లీ సిక్స్. అప్పుడే వచ్చేశావే" అంది రేఖ.

"చీకటి పడిందిగా" నవ్వాడు సలీం.

"అబ్బ! ఎంత తొందర నీకు?" అంది రేఖ గోముగా.

సలీమ్ ఆమె అరచేతిని ముద్దుపెట్టుకున్నాడు.

"యూ! సిల్లీ...." అంటూ సుతారంగా అతని చేతిని వదిలించుకుంది.

సలీమ్‌ని బెడ్‌రూంలో కూర్చోబెట్టి. టేప్‌రికార్డర్ ఆన్ చేసి, కిచెన్‌లోకి వెళ్ళింది రేఖ.

అరగంట తర్వాత టేబుల్‌మీద గ్లాసులు, డిష్‌లు,

వేయించిన జీడిపప్పు వగైరా సర్దింది రేఖ.

పార్టీ మొదలైంది.

రేఖ తను కొంచెం కొంచెం గొంతులో పోసుకుంటూ ముప్పాతిక బాటిల్ సలీమ్‌తో త్రాగించింది. అతను వద్దు వద్దంటున్నా బలవంతంగా బాటిల్ పూర్తి చేయించింది.

సలీమ్ బెడ్ మీద పడిపోయి గుర్రుపెట్టాడు.

"డర్టీ ఫెలో. ఇక లేవడు" అనుకుని సంతృప్తిగా నవ్వుకుంది.

తలుపులన్నీ జాగ్రత్తగా వేసింది. బెడ్ మీద భాస్వరం కలిపిన నీళ్ళు పోసింది. ఇంటికి తాళం వేసి డ్యూటీకి బయల్దేరింది రేఖ.

రేఖ డ్యూటీ చేస్తున్నదన్న మాటేగాని ఆమె యెంతో టెన్షన్ ఫీలవుతున్నది. భాస్వరం మీద నీళ్ళ ప్రభావం పోగానే మంట చెలరేగుతుంది. బెడ్ కాలిపోతుంది. అంతే కాదు యిల్లే తగలబడుతుంది. అందులో సలీమ్‌గాడు చస్తాడు.

'ఎప్పుడు వింటుంది ఆ శుభవార్త?'

'ఆమెకు ఆదుర్దాగా వుంది. అంతా తను అనుకున్నట్లే జరుగుతుంది గదా! లేక సలీమ్‌గాడికి మెలకువ వచ్చి బ్రతికి బయటపడడు గదా! అట్లా జరిగి కథ అడ్డం తిరిగితే?'

ఆమె గుండె వేగంగా కొట్టుకుంది.

రేఖ వుంటున్న ఇంటికి ఫ్యాక్టరీ మూడు మైళ్ళ దూరంలో వుంది.

ఆమె అనుకున్నట్లే జరిగింది.

షిఫ్టు డ్యూటీ సూపర్‌వైజర్ వచ్చి "ఐ యామ్ సారీ రేఖా!" అన్నాడు.

"వాట్ సార్? వాట్ హేపెండ్?" భయంగా అంది.

"మీ ఇల్లు తగలబడిందట. మీ వీధిలో ఎవరో ఫోన్ చేశారు. నిన్ను వెంటనే పంపమని చెప్పారు. మిసెస్ రేఖా! నీ కోసం వ్యాన్ రెడీగా వుంది. వెంటనే వెళ్ళు" అన్నాడు సూపర్‌వైజర్.

"ఓ మై గాడ్!" అంటూ కుప్పలా కూలిపోయి ఏడుపు సాగించింది రేఖ.

కొలిగ్స్ అంతా ఆమె చుట్టూ చేరి ధైర్యం చెప్పారు.

"ఇంట్లో నా హస్బెండ్ నిద్రపోతున్నాడు. ఏమైపోయాడో!" అంటూ పడీ పడీ ఏడ్చింది రేఖ.

అంతా ఆమెను బలవంతంగా వ్యాన్‌లోకి ఎక్కించారు.

వ్యాన్ శరవేగంతో వచ్చింది. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అందులో కాలిపోయిన శవం వికృత రూపం దాల్చివుంది.

"నా భర్త పోయాడు దేవుడో!" అని రేఖ గుండె బాదుకుంటూ వుంది.

అంతా ఆమెకు సానుభూతి చూపించారు.

3

"చూడమ్మా! మీరు చాలా దుఃఖంలో వున్నారు. అయినా ధైర్యంగా వుండాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ మురళి.

"ఇంకెక్కడి ధైర్యం ఇన్‌స్పెక్టర్. ఆయన నన్ను అన్యాయంచేసి పోయాడు. నన్ను ఒంటరిదాన్ని చేసి పోయాడు. నన్నూ ఆయనతో తీసికెళ్ళిపోయినా బాగుండేది" రేఖ కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

"అలా అనకండి. చావు అందరికీ వస్తుంది. కొంచెం ముందూ వెనుకా అంతే" అంటూ ఆమెను వూరడించాడు

యిన్‌స్పెక్టర్.

"మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగక తప్పదు. మీ దుఃఖం చూస్తుంటే నాకూ బాధగానే వుంది."

"అడగండి సార్!" అంది రేఖ కళ్ళు తుడుచుకుంటూ బొంగురుపోయిన గొంతుతో.

"మీరు రాత్రి ఎన్నింటికి డ్యూటీకి వెళ్ళారు?"

"తొమ్మిదింటికి."

"అప్పటికే మీ భర్త నిద్రపోయారా?"

"అవును."

"ఆయన ఏం చేస్తుంటారు?"

"మోడరన్ ఫార్మాస్యూటికల్ కంపెనీలో సేల్స్ రిప్రజెంటెటివ్."

"జీతం బాగానే వుంటుందనుకుంటాను."

"అవును సార్! అంతా కలిపి రెండు వేల వరకూ వస్తుంది. అయినా నేను ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా ప్యాసయ్యాను. అందుకని నేను గూడా ఉద్యోగం చేస్తున్నాను."

"ఐ సీ. చూడండమ్మా! మీరు డ్యూటీకి వెళ్ళేటప్పుడు డోర్ లాక్ చేసి వెళ్ళారు? ఎందుకని?"

"నాకు నైట్ డ్యూటీ వుండి, ఆయన ఇంట్లో ఉండడం జరిగితే అలాగే చేయడం అలవాటు. అర్ధరాత్రి నిద్రలేపితే ఆయనకు కోపం" అంది రేఖ.

"ఆయన నిద్రపోయాక మీరు డ్యూటీకి వెళ్ళారు. మరి అగ్నిప్రమాదం యెలా జరిగినట్లు?"

"ఆయన బాగా డ్రింక్ చేసి వున్నారు. మధ్యలో లేచి సిగరెట్ వెలిగించి అగ్గిపుల్ల నిర్లక్ష్యంగా పారేశారేమో? లేక సిగరెట్ ఆర్పడం మర్చిపోయి బెడ్ మీదే వుంచా

రేమో?" అంది రేఖ.

"అయితే ఆయన బాగా డ్రింక్ చేశారన్న మాట."

"అవును సార్!"

ఇన్‌స్పెక్టర్ మరి కొన్ని ప్రశ్నలు అడిగాడు.

"సార్ శవాన్ని ఎప్పుడు అప్పగిస్తారు?" అంది రేఖ దుఃఖం ఆపుకుంటూ.

"పోస్టుమార్టమ్ జరిగాక" అన్నాడు యిన్‌స్పెక్టర్.

4

రేఖ బంధువులు, స్నేహితులు ఆమెను ఓదార్చుతూ కూర్చున్నారు. శవాన్ని పోస్టుమార్టం చేశారనీ, తొందరలోనే పంపిస్తారనీ ఆ వీధిలోనే వుండే ఒక కుర్రవాడు వార్త తెచ్చాడు శవాన్ని ఇక్కడికి తెచ్చి స్మశానానికి తీసికెళ్ళాలా? లేక అట్నుంచటే హాస్పటల్నుంచి తీసికెళ్తే బాగుంటుందా? అని డిస్కస్ చేస్తున్నారు.

ఇంతలో పోలీస్ వ్యాన్ ఆగింది. అందులో నుంచి శవాన్ని దించుతారని అంతా ఆదుర్దాగా చూశారు. కాని శవం దిగలేదు. పోలీసులు దిగారు. ఇన్‌స్పెక్టర్ సీరియస్‌గా అన్నాడు.

"అరెస్ట్ హర్."

హెడ్ రేఖ చేతులకు కఫ్స్ తొడిగాడు.

అంతా బిత్తరపోయి చూస్తున్నారు. నోళ్ళు తెరిచి ఆశ్చర్యం ప్రకటిస్తున్నారు.

రేఖ మతిపోయిన దానిలా చూస్తూ "సార్! ఏమిటిది? నన్ను ఎందుకు అరెస్ట్ చేస్తున్నారు?" అంది.

ఇన్‌స్పెక్టర్ నవ్వాడు.

"ఎందుకు అరెస్ట్ చేస్తున్నామో నీకు తెలీదా?"

ఆమె తల అడ్డంగా వూపుతూ ఏడ్చింది.

"మంటల్లో చనిపోయింది నీ భర్త కాదు. దటీజ్ నంబర్ వన్ పాయింట్."

"నో....ఇన్‌స్పెక్టర్. మీరు పొరబడుతున్నారు ఆయన నా భర్తే. నా భర్త చనిపోయి నేను ఏడుస్తుంటే నన్ను అరెస్ట్ చేసి హింసించడం అన్యాయం" ఆక్రందన చేసింది రేఖ.

"నీ భర్త సజీవంగా వున్నాడు. నువ్వు మా స్టేషన్లో అతన్ని కలుసుకోవచ్చు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"సజీవంగా వున్నాడా?"

"యస్. రాత్రి జరిగిన రైడింగ్‌లో అతను దొరికాడు. యువరాజ్ హోటల్లో ఒక వేశ్యతో వుండగా మా వాళ్ళు పట్టుకున్నారు. కాలిపోయిన మీ యింట్లో అతని ఫోటో చూడడంవల్ల, అతన్ని నేను గుర్తించాను. నాలుగు తగి లించే సరికి నిజం చెప్పాడు."

రేఖ ముఖం పాలిపోయింది. చచ్చిపోయిన దానిలా అయిపోయింది. ఆ వీధిలో వాళ్ళంతా ఆమెను అసహ్యించుకున్నారు.

"చచ్చిపోయిన వ్యక్తి యెవరు ఇన్‌స్పెక్టర్?" ఎవరో ప్రశ్నించారు.

"సలీమ్ అనే వ్యక్తి. రేఖ పనిచేసే ఫ్యాక్టరీలోనే అతనూ పని చేస్తున్నాడు."

"అతన్ని చంపడం వల్ల లాభం ఏమిటి?" మరెవరో అడిగారు.

"చనిపోయిన వాడే తన భర్త అని నమ్మిస్తే అంతా లాభమే. మధు పేరున వున్న ఇన్సూరెన్స్ డబ్బు లక్ష.

వాళ్ళ కంపెనీ వాళ్ళు ఇచ్చే నష్టపరిహారం, ప్రావిడెంట్ ఫండ్ వస్తాయి."

"అమ్మో! గుండెలు తీసిన బంటు" ఆ వీధిలో ఆడ వాళ్ళు గుండెలు బాదుకుంటున్నారు.

"మధు కేరళకు చెందిన వాడు. ముందుగానే అతను వెళ్ళిపోవాలని ప్లాను వేశాడు. పాపం పండి వుండి పోయాడు" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"పాపం సలీమ్ అగ్ని సమాధి ఐపోయాడు" నిట్టూర్చాడు ఒక యువకుడు.

రేఖను ఎక్కించుకున్న పోలీస్ జీప్ కదిలింది. జనం విభ్రాంతి నుంచి తేరుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. □

1983 'వెంకట్ అవార్డు' పోటీలో మూడవ బహుమతి పొందిన కార్టూను



చిదానందస్వామి కుటీరం

కాశీభట్ల భానుమూర్తి

"ఎంత?" ప్రశ్నించాడు గురుమూర్తి.

"రెండు లక్షలు" అన్నాడు అవతారం.

"ఓరి నీ దుంపతెగ. ఈ అడవి సంపదంతా మహా రాజుల్లా పట్టుకెళ్ళుతున్నారు. నాకు ఇవ్వటం అనేసరికి ఏడుస్తారేం" అన్నాడు గురుమూర్తి డబ్బు లెక్క పెట్టుకుంటూ.

"ఏం! ఇదేమన్నా నీ స్వార్జితమా, మేం పట్టుకెళ్ళే

సామాన్లు చూసీ చూడనట్లు వదిలేసినందుకు, నీకు రెండు లక్షలు సరిపోవా? అసలు నన్నడిగితే అదే ఎక్కువ" అన్నాడు అవతారం.

గురుమూర్తి ఫారెస్టు ఆఫీసరు. మొదట్లో బాగానే నీతిగా బతికేవాడు. కానీ అమ్మాయి పెళ్ళిచేసి చాలా అప్పుల్లో పడిపోవటం మూలంగా ఇంక ఏ దారీ లేక అవతారంతో చేతులు కలిపాడు. అవతారం చిన్నసైజు స్మగ్లరు. అడవిలో వున్న ఖరీదైన సామగ్రిని బయటికి తరలించి కొంత లాభానికి అమ్ముకుంటాడు.

మొదట్లో అంటే గురుమూర్తి నిజాయితీగా వుండే రోజుల్లో, అవతారం చిన్నం చితకం కాస్త కాస్త తరలించి డబ్బు చేసుకునేవాడు. ఇప్పుడు గురుమూర్తి మారాక, అడవి సంపదను లారీలు లారీలకు తరలించ సాగాడు. అవతారం చలవ వల్ల గురుమూర్తి చిన్నసైజు డాబా కడితే, గురుమూర్తి చలవ వల్ల అవతారం పెద్ద మేడే కట్టాడు. ఒకరు గుడిని మింగితే మరొకరు గుడిలో లింగాన్నే మింగే రకం.

కొత్తలో గురుమూర్తి ఇంత కావాలని అవతారాన్ని నొక్కించలేదు. అవతారం ఎంతిస్తే అంత పుచ్చుకునేవాడు. కాని అనుభవం వచ్చాక కాస్త నొక్కించి అడగ సాగాడు గురుమూర్తి.

"నీకేం నాయనా, ఇలా డబ్బులిచ్చి, అలా లారీలు తోలుకుపోతావు. ఆ తరువాత నేను యెన్ని తిప్పలు పడాలి. గార్డ్సకి సర్దుబాటు చేయాలి. ఆ పైన చాలా మందిని సంతృప్తి పరచాలి" అన్నాడు గురుమూర్తి.

"నీత కష్టాలు నీతవి. నేను యిలా లారీలో సామాన్లు అలా తీసుకెళ్ళి అమ్ముకోవటమే అనుకున్నావా? ఎంత కష్ట

పడాలి నేను. దొంగసరుకు అమ్మటమంటే కూర్చుని కబుర్లు చెప్పటంకాదు," అన్నాడు అవతారం.

"సర్లే. ఈ సారి రెండున్నర లక్షలయినా లేనిదే గిట్టుబాటుకాదు. తరువాత నీ యిష్టం...." అన్నాడు గురుమూర్తి.

"ఎంతో కొంత ఇస్తాలే, ఇక వెళ్ళనిస్తావా, చాలా సమయిం అయింది" అన్నాడు అవతారం.

"ఆ! వెళ్ళు, వెళ్ళు" అన్నాడు గురుమూర్తి.

"ఆంధ్రప్రదేశ్‌లోని సినిమాహాలువాళ్ళు రేట్లు పెంచేసినట్టు పెంచేస్తున్నావు. సరే వస్తా, మళ్ళీ ఆదివారం కలుస్తా" అని, గురుమూర్తి దగ్గర శలవు తీసుకుని వెళ్ళిపోయాడు అవతారం.

"అమ్మయ్య! ఈ రెండులక్షల్లో గార్డ్స్‌కి, ఇతర ఖర్చులకి అరలక్ష పోయినా, లక్షన్నర మిగులు" అని డబ్బుని మరొకసారి లెక్క చూసుకొని, జేబులో పెట్టుకోబోయి, జేబు సరిపోదని గ్రహించి పాలిథిన్ సంచిలో సర్దసాగాడు ఫారెస్ట్ ఆఫీసర్ గురుమూర్తి.

ఇంతలో టేబిల్‌మీద వున్న ఫోన్ మ్రోగింది. విసుగ్గా దానివంక చూశాడు గురుమూర్తి. 'ఈ అడవిలో యీ ఏకాంత ప్రదేశానికి ఫోనుచేసే దెవరబ్బా?' అని విసుగ్గా ఫోను ఎత్తాడు గురుమూర్తి

అవతలనుంచి "హలో, గురుమూర్తేనా మాట్లాడుతోంది" అని వినబడింది. ఫోనువంక గుర్రుగా చూశాడు గురుమూర్తి.

"గురుమూర్తికి ఫోనుచేసి, గురుమూర్తేనా మాట్లాడుతోంది అంటున్నావు. నీ కసలు బుద్ధి వున్నదా?" అన్నాడు గురుమూర్తి కోపంగా.

"అంత కోపం తెచ్చుకోకు గురుమూర్తి, నేను చెప్పేది

వింటే, ముందు నీకు చమట్లు పడతాయి. ఆ తరువాత సన్నగా గుండెనొప్పి వస్తుంది. అందుకని ముందుగా కోపం తెచ్చుకోకు" అన్నారెవరో అవతలనించి.

"నా చమట్లు, గుండెనొప్పి సంగతి సరే. ముందు నువ్వెవరో చెప్పు. అయినా అడవిలో ఒక ఫారెస్టు ఆఫీసర్‌తో వేళాకోళాలేమిటి?" అన్నాడు గురుమూర్తి సీరియస్‌గా.

"వేళాకోళాలు కాదు గురుమూర్తి. పచ్చి నిజాలు. సహజసిద్ధమైన అడవి సంపదని, అక్రమమైన మార్గాల్లో ఒక ఫారెస్టు ఆఫీసర్ అమ్ముకోవటంకన్నా ఈ ప్రపంచంలో వేళాకోళం వుందా" అన్నాడు అవతలనుంచి.

గురుమూర్తికి అవతలవ్యక్తి అన్నట్టు చెమట్లుపట్టాయి. గుండెనొప్పి రాలేదుకాని, సన్నగా వణుకు ప్రారంభమైంది. ఇది నిశ్చయంగా బ్లాకుమెయిలేనని గురుమూర్తికి అర్థమైపోయింది. అందుకే లేని ధైర్యం తెచ్చుకొని, "నీ నోరుకి వచ్చినన్ని పేలితే అవి నిజాలు అయిపోతాయా, నిప్పులాంటి పారెస్టు ఆఫీసర్ ఈ గురుమూర్తి. అవినీతికి తల వంచడు. అలాంటి నన్ను స్మగ్లర్ అంటావా, నీ మీద పరువునష్టం దావా వేస్తాను. ఇంతకీ నీ వెవరవు" అన్నాడు గురుమూర్తి బింకంగా.

"నే నెవరినా. అది చెప్పినా నీ కర్థం అవదు. ఆ! పరువు-ష్టం దావావేస్తావా, అవినీతిమార్గంలో నడిచేవాడివి నీకు పరువేమిటి? నిప్పులాంటి ఫారెస్టు ఆఫీసర్! వెరీ గుడ్! బిరుదు బాగానే వుంది. కాని నీకు తగదు. నిప్పులాంటి ఫారెస్టు ఆఫీసర్ ముందు నిప్పును కూతురి పెళ్ళి అనే చెద తినేసింది ఇప్పుడు ఆ స్థానంలో నీతిలేని ఫారెస్టు ఆఫీసర్ అన్న పేరు స్థిరపడిపోయింది మిస్టర్ గురుమూర్తి" అన్నాడు అవతలినుంచి ఫోన్లో.

"నువ్వరిచి గీపెట్టినా, నీకు పైసా యివ్వను" అన్నాడు గురుమూర్తి కంగారుగా యిదేదో బ్లాకుమెయిలే అనుకొని.

"పైసా నేను అడిగానా, నాకు కావలసింది మూడు లక్షలు. అవతారంతో నువ్వు మాట్లాడిన మాటలు నా టేప్ రికార్డర్‌లో భద్రంగా వున్నాయి. మూడులక్షల్లో ఒక్క పైసా తగ్గినా, ఆ మాటలు యిన్‌స్పెక్టర్ సుధాకర్‌కి రిజిస్టర్ పోస్టులో పంపుతా."

"నా మాటలు విన్నానంటున్నావు, మరి మూడులక్షలు అడగటానికి నీకు సిగ్గుగా లేదు. నేను అవతారం దగ్గర పట్టింది రెండులక్షలేగా, కావాలంటే అందులో అరలక్ష ఇస్తా" అన్నాడు గురుమూర్తి బెదురుగా.

"ఇదేం కూరగాయల బేరం అనుకొన్నావా, అరలక్ష ఇస్తా, పావులక్ష యిస్తా అంటున్నావు. ఇప్పుడైతే నువ్వు పట్టింది రెండు రెండులక్షలే. కానీ ఇంతకుముందు నువ్వు పట్టింది ఎన్ని లక్షలు? కనుక నోరు మూసుకొని, నేను అడిగిన మూడు లక్షలు యివ్వు లేదా—" అని బెదిరింపు వినబడింది.

"ఆ! ఇస్తా....ఎక్కడివ్వను, ఎప్పుడివ్వను" అన్నాడు గురుమూర్తి నీరసంగా.

"ఆ! అలా రా దారికి. మిగిలిన వివరాలు రేపు చెబుతా పది గంటలకి. డబ్బు రెడీగా వుంచు. అన్నీ పదిరూపాయల నోట్లే వుండాలి. అవి పాతవి అయివుండాలి," అని ఫోను టక్కున పెట్టేసింది అవతలి గొంతు.

గురుమూర్తికి భోరున ఏడుపు వచ్చేసింది. ఫోనుపెట్టేసి ఒక మూల చతికిలపడ్డాడు. అతని బాధ మూడులక్షల గురించి కాదు. వెధవ మూడులక్షలు పోతేపోయాయి. కాని అవతలి వ్యక్తి యిప్పటికి దీంతో సరిపెట్టడుగా, వాడికి

డబ్బు అవసరమైనప్పుడల్లా బ్యాంకులోంచి డ్రా చేసినట్టు మాటిమాటికి బెదిరిస్తాడనే గురుమూర్తి భయం.

అంత భయంలోనూ గురుమూర్తికి ఒక ఆలోచన వచ్చింది. వెంటనే డబ్బువున్న పాలిథిన్ సంచి బీరువాలో పెట్టేసి. ఇంటికి తాళంపెట్టి చిదానందస్వామి కుటీరంవైపు బయలుదేరాడు గురుమూర్తి.

2

చిదానందస్వామి ఆ ఊరువచ్చి రెండేళ్ళు కూడా కాలేదు. కాని ఆ ఊరి చుట్టుపక్కల చిదానందస్వామి పేరు మారు మ్రోగిపోతోంది. అసలు అడవిదగ్గర వున్న ఊరేమో భక్తులకి కొదువలేదు. అందుకే చిదానందస్వామి జీవితం మూడు కొబ్బరికాయలు ఆరు అరటిపళ్ళులా వెళ్ళిపోతోంది ఆ ఊర్లో. ఆ ఊరిభక్తులే కాక, పొరుగూర్ల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా చిదానందస్వామిని చూడటానికి భక్తులు వస్తారు. వాళ్ళు వున్నన్నాళ్ళు సుఖంగా వుండటా టానికి వీలుగా చిన్నచిన్న కుటీరాలు వాళ్ళకోసం నిర్మించ బడి వున్నాయి.

చిదానందస్వామి జీబురు తలతో కాషాయ వస్త్రాలతో వుంటాడనుకొంటే అది అనుకొన్నవాళ్ళ పొరపాటు. నున్నని గుండుతో తెల్లని వస్త్రాలతో అరవిచ్చిన మల్లె మొగ్గలా, కడిగిన ముత్యంలా వుంటాడు.

చిదానందస్వామిగారు సాయంత్రం అరగంటపాటు ముఖ్యమైన భక్తులకోసం కేటాయిస్తాడు.

అదిగో అదే టైములో పరుగు పరుగున చిదానందస్వామి గారి దగ్గరకు వచ్చాడు గురుమూర్తి. ఆ టైములో చిదానందస్వామి దగ్గర వేరే భక్తులెవరూ లేరు. గురుమూర్తిని చూస్తూనే ఆశీర్వదించి విషయమేమిటని ప్రశ్నించాడు చిదా

నందస్వామి.

"అవతారం దగ్గర రెండులక్షలు తీసుకొన్నప్పటినుంచి" జరిగింది చెప్పాడు గురుమూర్తి. మౌనంగా విన్నాడు చిదానందస్వామి.

"మీరు చెప్పారు కదా అని, ఈ రొంపిలోకి దిగాను స్వామీ! మీరు ఆదుకుంటారు గదా అని పాతిక భాగం మీ కిస్తున్నాను. అయినా మీరు నన్ను ఆదుకోలేదు" అని బావురుమన్నాడు గురుమూర్తి.

"కొండకింద గోలేమిటంటే, ఫారెస్టు ఆఫీసర్ మాటాడుతున్నాడు. రహస్యంగా అన్నట్లు నువ్వూ, అవతారం మాట్లాడుకొనేటప్పుడు, ఆ పక్కన టేప్ రికార్డర్లు, అవీ వున్నాయా, లేవా అని చూసుకోనక్కరలేదా," అని మందలించాడు చిదానందస్వామి.

"అసలు నన్నడుగుతే, ఆ అవతారంగాడే చేయించుంటాడు ఈ ఫోను. వెధవడబ్బు పెంచరా నా కిచ్చేది, అంటే గునిసాడు. అందుకని నా కనుమానం వచ్చింది" అని అనుమానం వెలిబుచ్చాడు గురుమూర్తి.

"ఛ! ఆ అవతారంగాడు నీలాంటి బెదురుగొడ్డే, వాడు చేయించి వుండడు" అన్నాడు సాలోచనగా చిదానందస్వామి.

"మరి యిప్పుడేమిటి తక్షణ కర్తవ్యము" అన్నాడు గురుమూర్తి.

"ఏముంది. ఈసారికి వాడడిగిన డబ్బిచ్చేయి. సమయం లేదు. మళ్ళీ వాడు బెదిరిస్తే అప్పుడు చూస్తా" అన్నాడు చిదానందస్వామి.

"ఏమిటి మీరు చూసేది? ఒకటా రెండా, మూడు లక్షలు. అప్పనంగా ఆ వెధవకి యిచ్చేయటమే" అన్నాడు

గురుమూర్తి.

"స్వార్జితంలా మాట్లాడకు. ఈసారి కిచ్చేయి. తరువాత నేను చూస్తానన్నాను గదా!" అని భుజం తట్టి గురుమూర్తిని పంపించివేశాడు చిదానందస్వామి.

వేరే భక్తుడువస్తే అతని కష్టసుఖాలు కనుక్కోసాగాడు చిదానందస్వామి.

చిదానందస్వామిని తిట్టుకొంటూ, తన ఖర్మానికి ఏడ్చుకొంటూ, ఇంటికి బయలుదేరాడు గురుమూర్తి.

3

"ఇక బయలుదేరుదామా," అన్నాడు ఓంకారం.

"మరి బయలుదేరక, ఇక్కడే డిటెక్టివ్ ఆఫీసు తెరుద్దామంటావా?" అని కసురుకొన్నాడు పరిశోధనరావు.

"లేదు! బాస్! రేపు ఏకాదశిదాకా వుందాము. అప్పుడు చిదానందస్వామిగారు వుపన్యాస మిస్తారు. చాలా బావుంటుందిట. ఇక్కడ పెద్ద ఉత్సవం కూడా చేస్తారుట. ఎక్కడెక్కడినుండో భక్తులు తండోపతండాలుగా వస్తారు. అలాంటిది యెక్కడో తణుకునుంచి వచ్చిన మనం, ఇన్నాళ్ళు వుండి, ఈ ఉత్సవానికి లేకుండా పోవటం బావోదు బాసూ!" అన్నాడు శ్రీకారం?

"మనం యిక్కడ ఈ చిదానందస్వామి దగ్గరే భజన చేస్తే. అక్కడ తణుకులో మన డిటెక్టివ్ బిజినెస్సు గోవిందా అంటుంది. రేపే బయలుదేరుదాము. ఉత్సవమట, ఉత్సవము" అని శ్రీకారంమీద విసుక్కొన్నాడు పరిశోధనరావు.

"తప్పు, బాసు! కళ్ళు పోతాయి, రేపు వెళితే వెళదాం కాని. చిదానందస్వామివారిని తిట్టకండి" అన్నాడు శ్రీకారం భక్తిగా.

"ఉండటానికి నాకేం అభ్యంతరం లేదుగాని, ఇక్కడ కలర్‌ఫుల్ గాలేదు శ్రీకారం. తణుకులో ఈపాటికి ఎందరు ఆడవాళ్ళకి బీటేసేవాడిని. అలాంటిది యిక్కడ యింకా బోణీ కాలేదు. ఏం ఆశ్రయమయ్యా ఇది" అని శ్రీకారం మీద చిరాకుపడ్డాడు ఓంకారం.

"గట్టిగా అరవకయ్యా, అర్ధరాత్రిపూట. ఎవరన్నా వింటే దడుసుకొంటారు. సరే. రేపు వెళ్ళిపోదాం అన్నానుగా" అన్నాడు శ్రీకారం.

"తిన్న తిండంతా అరిగేలా వాకింగ్ చేసాం, యిక పడుకొందామా లేక ఇంకా తిరుగుదామా" అన్నాడు ఓంకారం.

"చాల్లే, ఇక పడుకొందాము. మళ్ళీ ఐదు అయ్యేసరికి ఆ చిదానందస్వామిగాడు లేపేస్తాడు శంఖు ఊది," అన్నాడు పరిశోధనరావు.

పరిశోధనరావు, ఓంకారం, శ్రీకారం ముగ్గురూ వాళ్ళ కుటీరంవైపు బయలుదేరుతుంటే, దూరంగా లైట్లు కనబడి ఓంకారం ఆగిపోయాడు. పరిశోధనరావు కూడ ఆగి "ఏం, ఏదన్నా కలరు కనబడిందా, ఆగావు...." అని అడిగాడు.

"కలరా! ఈ అర్ధరాత్రి. కలరు కాదు, నా బొందా కాదు. దూరంగా ఆ కనిపించే లైట్లేమిటి ఈ రాత్రిపూట" అన్నాడు ఓంకారం.

"అవా, అవి చిదానందస్వామిగారి కుటీరంలో లైట్లు. వారికి ఎన్నో పనులుంటాయి" అన్నాడు భక్తిగా శ్రీకారం.

"అర్ధరాత్రి, కుటీరంలో లైట్లు అంటే, నా డిటెక్టివ్ మనసుకేదో తోస్తోంది" అన్నాడు ఓంకారం.

"నాకు ముందునుంచే ఆ చిదానందంగాడిమీద అనుమానంగా వుంది. పద పోయిచూద్దాం." అన్నాడు ఓంకారంతో పరిశోధనరావు.

"తప్పు బాసు, కళ్ళుపోతాయి బాసు, ఇంద్రియానాం, నయనం ప్రదానం అన్నారు బాసు," అని వారించాడు శ్రీకారం.

"చుప్! అరవకు: అరిస్తే నిజంగానే నేను నీ కళ్ళు పీకేస్తాను" అన్నాడు పరిశోధనరావు.

ముగ్గురూ నిశ్శబ్దంగా చిదానందస్వామి కుటీరంవైపు నడిచారు. లోపలనుంచి ఏవో మాటలు వినబడుతున్నాయి. ముగ్గురు డిటెక్టివ్‌లు చప్పుడు చేయకుండా కిటికీలోంచి వినిపించే మాటలు వినసాగారు.

"నిజం స్వామిగారు. ఆ ఫోను నేను చేయలేదు. మూడు నాలుగుసార్లు ఫోను చేస్తే ఎంగేజ్డు శబ్దం వినబడింది. సరే, వచ్చే ఆదివారం మళ్ళీ లారీలు వస్తాయి, ఆ రోజు చేయవచ్చని మాట్లాడక వచ్చేశాను" అన్నాడు సదాశివం.

చిదానందస్వామి ఆలోచనలోంచి తేరుకొని, "మరి ఫోను ఎవరు చేసినట్టు? ఆ గురుమూర్తిగాడు ఎవరో ఫోను చేసి తనను బ్లాకుమెయిల్ చేస్తున్నారు బాబోయ్ అంటున్నాడు" అన్నాడు.

"మీరు ఫోనుచేసి మూడులక్షలు ఆ గురుమూర్తి దగ్గర పట్టమన్నారు. కాని నేను ఫోను చేయలేదు. కనెక్షను అందలేదు. మరి ఎవరుచేసినట్టు ఫోను, మీరుగాని చేశారా" అన్నాడు సాలోచనగా సదాశివం.

"చంపేస్తాను, సొల్లువాగుడు వాగావంటే. నిన్ను ఫోను చేయమని, నేను ఎలా చేస్తాను? నువ్వు చేసావనుకొన్నాను. నువ్వూ చేయక, నేను చేయక మరి, యెవరు చేసినట్టు!" అన్నాడు చిదానందస్వామి.

"పోన్లెండి, యెవరుచేస్తేనేం వెధవ ఫోను: మనకి మూడులక్షలు వస్తాయిగదా" అన్నాడు సదాశివం మహా

సంబరంగా.

"ఆ వస్తాయి, వస్తాయి. ఆ గురుమూర్తికి ఎవరు ఫోను చేశారో తెలుసుకోకపోతే మూడులక్షలు కాదు. బ్లాకు మెయిల్ నేరానికి మూడేళ్ళు జైలుశిక్ష పడొచ్చు" అన్నాడు చిదానందస్వామి.

"అందుకే వెధవగొడవలు మనకొద్దన్నాను. ఈ స్వామి వేషంలో వచ్చే సంపాదన మనకి సరిపోదా?" అన్నాడు సదాశివం.

"ఆ సరిపోతుంది, ఈ స్వామి వేషం వేసుకొని కూర్చుంటే వచ్చేది సంపాదనకాదు కొబ్బరిచిప్పలు, అరటి పళ్ళు. అందుకే నేను కొత్తరకం సంపాదన ప్రారంభించాను. నా దగ్గరికి వచ్చే భక్తులు తమ కష్టసుఖాలు చెప్పుకొంటారు. అందులో మనకి కావలసిన విషయాలు నోటు చేసుకొని, వాళ్ళని బ్లాకుమెయిల్ చేస్తాము. ఇప్పటికెన్ని కేసులు సక్సెసు కాలేదు. వాళ్ళ దగ్గరనించి నువ్వు ఎంత డబ్బు తేలేదు. మరి ఈ కేసులో మాత్రం మనకి ఎదురు దెబ్బ తగిలింది. సరిగ్గా నువ్వు ఫోనుచేసే సమయానికి, ఎవరో ఫోను చేయటమేమిటి? కొంపతీసి అవతారంగాడు ఫోను చేసాడంటావా?" అన్నాడు చిదానందస్వామి.

"అబ్బే! వాడే వస్తున్నాడు, నేను వాడికి చేసిన ఫోను కాల్‌కి డబ్బు సమకూర్చలేక. ఇక వాడేం చేస్తాడు? కొంప తీపి ఏ పోలీసు ఆఫీసరన్నా మన గురించి తెలుసుకొని ఫోను చేసాడంటారా, అసలే ఆ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ మన గురించి తిరుగుతున్నాడు. నాకు ఈ విషయం అనుమానంగా వుంది" అన్నాడు సదాశివం.

"అలా అయితే మనం చచ్చామన్న మాటే. కాని ఆ ఫోను చేసింది పోలీసు ఆఫీసర్ అయివుండదు. ఎందు

కంటే—ఆ ఫోను చేసినవాడు కూడ డబ్బుకోసం గురుమూర్తిని అడిగాడట. అయినా ఈ శంకర్రావుని పట్టుకొనే దమ్ము లెవరికున్నాయి. గజదొంగగా ఆంధ్రప్రదేశ్‌ని గడగడలాడించి, కొత్త ప్రభుత్వం ధర్మమా అని ఇక గడగడలాడించలేక ఈ చిదానందస్వామి వేషం వేశాను. ఆ ఆ గజదొంగ శంకర్రావే, ఈ చిదానందస్వామి అని ఏ పోలీసాఫీసర్ యిప్పటిదాకా కనుక్కోలేకపోయాడు" అన్నాడు చిదానందస్వామి వేషంలో వున్న శంకర్రావు హుందాగా మీసాలు మెలివేస్తూ.

"చిదానందస్వామి వేషంలో వున్నది గజదొంగ శంకర్రావా!!" ఆశ్చర్యంగా అరిచాడు శ్రీకారం బయటినుంచి వింటూ.

"బాసు మీరు యెంత గట్టిగా అన్నారో! ఈ కుటీరం రీ సౌండ్ యిస్తోంది," అన్నాడు భయంగా సదాశివం.

"నీ బొంద, బయటినుంచి విన్నవారెవరో అరిచారు. వెళ్ళిచూడు. పట్టుకో," అన్నాడు చిదానందస్వామి కంగారుగా. సదాశివం బయటకు పరుగుతీశాడు.

"వెధవ అరుపు! శంకర్రావు, చిదానందస్వామివేషంలో వుంటే మాత్రం అరుపులెందుకు? ఇక్కడి ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌కి చెబితే అతనే వచ్చి పట్టుకొంటాడు గదా. మనకీ పేరుప్రతిష్ఠలు వస్తాయి. ఇప్పుడు గట్టిగా అరిచావు. ఆ సదాశివంగాడు వస్తున్నాడు. ముందు వాడి సంగతి చూడండి...." అన్నాడు పరిశోధనరావు యుద్ధానికి సిద్ధం అవుతూ.

"నేను భక్తిగా పూజించే చిదానందస్వామి యింత దొంగవెధవా అని తెలిసేసరికి అరిచా....నన్ను క్షమించండి....రానివ్వండి ఆ సదాశివంగాడి పనిపడతా" అన్నాడు

శ్రీకారం,

సదాశివం పరుగెత్తుకు కుటీరం బయటికి వచ్చాడు. "ఎవరది, ఎవరది?" అని అరుస్తూ.

ఓంకారం, శ్రీకారం ఒక్క దూకులో సదాశివం ముందుకు వురికి, "మేమేరా, అరిచింది" అని, సదాశివాన్ని మారు మాట్లాడనివ్వక ఎడాపెడు బాదేసారు.

కిక్కురుమనకుండా పడిపోయాడు సదాశివం. పరిశోధన రావు, సదాశివం చొక్కాని చించి పేలికలుచేసి, ఆ పేలి కలతో సదాశివం చేతులు కాళ్ళు కట్టేశాడు.

ఈ లోపల ఈ గొడవకి చిదానందస్వామి బయటికి వచ్చాడు. రావటంతోనే పరిస్థితి అనుకూలంగా లేదని గ్రహించిన చిదానందస్వామి జేబులో నుంచి కత్తి తీసాడు.

వెంటనే పరిశోధనరావు జేబులోంచి రివాల్వర్ తీశాడు. అది దీపావళి పిస్తోలని తెలిసిపోతోంది. అయినా బెదరక, "ఇది రివాల్వర్. దీనిని ఇతరుల ప్రాణాలు తీయటానికి, తమ ప్రాణాలు రక్షించుకోవటానికి వుపయోగిస్తారు. ఇప్పుడు ఇది రెండుపనులు చేయటానికి వుపయోగిస్తుంది. హేండ్సప్!" అన్నాడు పరిశోధనరావు.

చీకట్లో అది దీపావళి పిస్తోలు అని తెలుసుకోలేక చిదానందస్వామి చేతులు పైకెత్తాడు కత్తి కిందపడేసి. వెంటనే చిదానందస్వామి కండువాని చింపి దాంతో చిదానంద స్వామి కాళ్ళు,చేతులు కట్టేశారు. చిదానందస్వామి గింజుకో సాగాడు.

"మీరు చిదానందస్వామిని, సదాశివాన్ని చూస్తూ వుండండి. నేను వెళ్ళి పోలీసులని వెంటబెట్టుకువస్తా!" అని పరిశోధనరావు వెళ్ళిపోయాడు.

"రెండుగంట లయింది బాసు వెళ్ళి. ఇంకా రాలేదు. వీళ్ళకి యెంత సేపు కాపలా వుండాలి మనం" అన్నాడు శ్రీకారం

"వస్తారు. వస్తారు పోలీసులకి తీరుబడి వుండొద్దు" అన్నాడు ఓంకారం.

ఇంతలో వాళ్ళముందు పోలీసుజీపు ఆగింది. అందు లోంచి పరిశోధనరావు దిగాడు. ఇన్‌స్పెక్టర్ సుధాకర్, పోలీసులు వచ్చారు.

ఇన్‌స్పెక్టర్ సుధాకర్ చిదానందస్వామిని, సదాశివాన్ని అరెస్టు చేశాడు.

"ఇన్నాళ్ళు, నువ్వొక దేవుడి అంశానివని, ఎంతమంది నిన్ను పూజించారు వాళ్ళందరికి ఈ విషయం తెలిస్తే యెంత అసహ్యించుకుంటారు" అన్నాడు శ్రీకారం, శంక రావును చూస్తూ.

"ఒరే వీడిని తిడితే కళ్ళు పోతాయి, అని కూడా అన్నావు. వీడిని తిడితే మన కళ్ళు పోవు, వీడి కళ్ళే పోతాయి" అన్నాడు ఓంకారం.

"అయినా మొదట్లో బాగానే వుండేవాడివి కదా. యిప్పుడు యిలా పెడదార్లు పట్టావేం, స్వామీ?" అన్నాడు శ్రీకారం.

"మీరు పొరబడుతున్నారు. వీడు నిజంగా చిదానంద స్వామికాడు. నిజం చిదానందస్వామిని చంపేసి, చిదానంద స్వామిలా చలామణి అవుతున్నాడు" అన్నాడు సుధాకర్.

"ఓరి, నీ దుంపతెగ. నేను యింకా గజదొంగ శంక రావే చిదానందస్వామిలా మారిపోయి భక్తులకి ఉపదేశా

లిస్తూ, చీకట్లో యిలాంటి వ్యాపారాలు చేస్తున్నాడను కొంటున్నాను యిప్పటిదాకా. అయితే అసలు చిదానంద స్వామిని చంపేసావా, పాపాత్ముడా!" అన్నాడు శ్రీకారం.

చిదానందస్వామి వేషంలో వున్న శంకర్రావు తల దించుకొన్నాడు. "మరి గురుమూర్తికి ఫోను చేసిందెవరు?" అన్నాడు ఓంకారం.

"ఇంకెవరు? అవతారంగాడు. ఈ చిదానందస్వామి, గురుమూర్తిని, అవతారాన్ని బ్లాకు మెయిల్ చేశాడు. అవతారం తెలివైనవాడు కాబట్టి, గురుమూర్తిని మళ్ళీ బ్లాకు మెయిలుచేసి డబ్బు గుంజుకొని తన నష్టం పూడ్చుకొందాం అనుకొన్నాడు. అదే ఇంత కథకి నాంది పలికింది" అన్నాడు పరిశోధనరావు హుందాగా.

"మీకు నా కృతజ్ఞతలు. శంకర్రావులాంటి దొరకదను కొన్న గజదొంగని పట్టించినందుకు. ఊఁ నడవండి, స్టేషనుకి" అని శంకర్రావుని, సదాశివాన్ని జీపులో ఎక్కించుకొని, బయలుదేరాడు పోలీసులని తీసుకొని ఇన్‌స్పెక్టర్ సుధాకర్.

"ఓరిని, దేవుడి అవతారం గదా చిదానందస్వామి అనుకొని యింత డబ్బు ఖర్చుచేసుకొని తణుకునుంచి వచ్చాం. గజదొంగ శంకర్రావుని చూట్టానికా" అన్నాడు బాధగా శ్రీకారం.

"పోనీలే ఒక గజదొంగని పోలీసులకి పట్టించాం. అది చాలు ఈ జన్మకి" అన్నాడు ఓంకారం.

"అసలు నా బాధ అదికాదు. మనకి ఒక సామెతవుంది కదా. పోలీసులందు పుణ్య పోలీసులువేరయా అని. ఇదే కేసు మన ఇన్‌స్పెక్టర్ శశికాంత్‌కో, ఎస్సై ముకుంద రావుకో పట్టిస్తే, కనీసం ఒక్కపూట భోజనానికైనా

పిలిచేవారు. ఈ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ మనల్ని భోజనానికి పిలవలేదు అదే నా బాధ'' అన్నాడు అసలు విషయం చెబుతూ పరిశోధనరావు.

"ఆ కొత్తగదా, మరచిపోయి వుండొచ్చు. అయినా ఈ అడవిలో ఎందుకు? మనం తణుకువెళితే ఈ కేసు విషయం చెప్పి ఇన్‌స్పెక్టర్ శశికాంత్ దగ్గర కనీసం టిఫిన్ అయినా కొట్టచ్చు కదా!'' అన్నాడు ఓంకారం.

"అవును. టిఫిన్ అయినా దక్కుతుంది. ఇంకా యిక్కడ యెందుకు? నడవండి. మనం లేక తణుకులో కేసులన్నీ యెంత మూల్గుతున్నాయో'' అని వాళ్ళ కుటీరం వైపు బయలుదేరాడు పరిశోధనరావు.

ఓంకారం, శ్రీకారం, పరిశోధనరావుని అనుసరించారు. □

1983 'వెంకట్ అవార్డు' పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కార్టూను

మోడుముళ్ళు వడు

బొమ్మిడి అచ్చారావు

"హల్లో, ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ స్పీకింగ్! యెవరు కావాలి?"

"ఇన్ స్పెక్టర్ గారూ: ఊరిచివర ఎనిమిదో మైలు రాయి దగ్గర యేదో శవం పడుంది. ఇంకా రక్తం తడి కూడా ఆరలేదు. పోయి చూడండి!"

"హలో, మీ రెవరు?"

"సారీ, చెప్పలేను!" ఫోను పెట్టేశారు అవతల.

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హేట్ తీసి నెత్తిమీద పెట్టుకుని "శివం. రాజూ, గెట్ రెడీ! ఫోటోగ్రాఫర్. ఫింగర్స్ ప్రింట్ ఎక్స్‌పర్ట్‌కి కబురు చెయ్యి రాజూ!" అన్నాడు.

సార్జంట్సు రాజు, శివం అటెన్షన్‌లోకి వచ్చారు.

అరగంట తర్వాత శ్రీనివాస్ తన సిబ్బందితో ఎనిమిదో మైలురాయి దగ్గిర జీప్ దిగాడు.

చుట్టూ జీడిమామిడి తోటలు గుబురుగా పెరిగి నేల మీదికి వంగివున్నాయి. శవం రోడ్ మీదకి కొంత మామిడి తోపులోకి కొంత నిలువుగా పడుంది. ఒంటినిండా కత్తి పోట్లు!

శ్రీనివాస్ చుట్టూ పరీక్షగా చూశాడు. జీడిమామిడి తోపులో అక్కడక్కడ కాలిగుర్తులు యిసుకలో పడు న్నాయి. ఫోటోగ్రాఫర్ వంక సాలోచనగా చూశాడు. అతను వెంటనే తన కార్యక్రమంలో నిమగ్నమైనాడు.

శ్రీనివాస్ శవంముందు గొంతుకూర్చుని ముఖంలోకి పరీక్షగా చూశాడు. శవం వయసు పాతికేళ్ళుండవచ్చు. ఎర్రగా పొడగ్గా వున్నాడు. పాలిష్టర్ చెక్స్ షర్టు, స్నఫ్ కలర్ పాంటు వేసుకున్నాడు.

జేబులు తడిమిచూశాడు. ఒకటి రెండు తెల్ల కాగితాల మీద ఏవో నంబర్లు నోట్ చేయబడి వున్నాయి. ఓ పది రూపాయల కాగితం, అరవై అయిదుపైసల చిల్లర నాణేలు వున్నాయి.

ఓ తెల్లకాగితం మడత విప్పి చూశాడు శ్రీనివాస్.

దానిమీద ఏదో వాహనం నంబర్ నోట్ చేయబడి వుంది. ఎ.పి.వై. 3213. ఆ కాగితంలో మరేం లేదు. రెండో కాగితం స్లిప్‌మీద చిత్రమయిన డిజైన్ వేసి

వుంది.

శ్రీనివాస్ ఆ డిజైనువంక తదేక దీక్షతో చూశాడు. రైల్వేగేటు దూరంగా చిన్న కారు బ్రెయిన్‌ను తాకేటంత సమీపంగా వుంది. రెక్కలు పైకి లేచే గేటు అది!

గేటుకి కుడిపక్కగా 3 × 3=7 అన్న యీక్వేషన్ వేసి వుంది.

ఆ కాగితంలోని ఆ రైలుగేటు బొమ్మ, యీక్వేషన్ శ్రీనివాస్‌లో ఆలోచనలు రేకెత్తించాయి. హతుడు యేదో సూచన ఆ డిజైనులో పొందుపరిచి వుండవచ్చునని పించింది. అది యెంత ఆలోచించినా అతని బుర్రకి తట్ట లేదు.

చుట్టూ ప్రతి అంగుళం జాగ్రత్తగా పరిశీలించి చూశాడు. అనుమానాస్పదమయిన ఆధారాలేమీ కనిపించ లేదు.

గవర్నమెంటు పాథాలజిస్టు తన ప్రిలిమినరీ యిన్వెస్టి గేషను వివరాలు శ్రీనివాస్‌కి చెప్పాడు.

"హతుడు కత్తిపోట్లవల్ల రక్తస్రావం విపరీతంగా జరిగి మరణించాడు. హత్య జరిగి అయిదారు గంటలు కావచ్చు. ఇప్పటికి యింకా రిగర్‌మార్టిస్ యింకా ప్రారంభం కాలేదు. ఇప్పుడు తొమ్మిది కావచ్చింది. అంటే తెల్లవారుఝామున నాలుగు, అయిదు గంటల మధ్య జరిగుండవచ్చు. తక్కిన వివరాలు పోస్టుమార్టమయ్యాక రిపోర్ట్ పంపిస్తాను."

ఈలోపల ఫోటోగ్రాఫర్, వేలిముద్రల నిపుణుడు తమ పనులు పూర్తిచేశారు.

శవాన్ని అంబులెన్సులోకి ఎక్కించటం అయింది.

2

"శవం గుర్తింపబడింది సార్! అది యూనివర్సిటీలో పిహెచ్‌డి చేస్తున్న పోస్టుగ్రాడ్యుయేట్ స్టూడెంట్ వివేక్‌ది. అతను సైన్సు స్టూడెంటు. నిన్న రాత్రినుంచీ అతను కని పించలేదని తల్లి చెప్పింది. తండ్రిలేడు. చెల్లెలు, తల్లి మాత్రమే వున్నారు. చాలా బ్రిలియంట్ స్టూడెంటు. మార్చ్యురీ దగ్గర ఆ తల్లీ కూతుళ్ళ దుఃఖం చూడలేక పోయాం. అతనిమీదే అన్ని ఆశలు పెట్టుకు బతుకు తున్నారు వాళ్ళు!" సార్జెంట్ శివం చెప్పిన విషయాలు శ్రద్ధగా విన్నాడు శ్రీనివాస్.

మరో పది నిమిషాల తర్వాత శ్రీనివాస్ వివేక్ తల్లిని కలిపి ప్రశ్నించాడు.

"ఈ విచార సమయంలో మిమ్మల్ని విసిగించటం నా అభిమతం కాదమ్మ! కాని హంతకుడ్ని ఉరికంబాని కెక్కించ డాని కవసరమైన యిన్ఫర్మేషన్ సేకరించాలి కదా. వివేక్ గురించి తరచు వచ్చే స్నేహితుల చిరునామాలు కొన్ని చెప్పండి. అతనికి వ్యక్తిగతంగా శత్రువు లెవరైనా వుంటే ఆ వివరాలుగూడా చెప్పండి!"

వివేక్ తల్లి కళ్ళు తుడుచుకుని శూన్యంలోకి చూస్తూ "నా బిడ్డ చీమకూ్కడా అపకారం చెయ్యడు బాబూ. వాడ్ని యింత దారుణంగా చంపటానికి ఎవడికి చేతులొచ్చాయో తెలీదు. నిన్న సాయంత్రం ఎవరో ఫ్రెండుని కలిపి థీసిస్ మెటీరియల్ రాసుకుంటానని వెళ్ళాడు. ఆ వెళ్ళిన బిడ్డ తిరిగి రానేలేదు" ఆమె గొంతు గాద్గదికమయింది.

"ఆ ఫ్రెండు యెవరో చెప్పగలరా?"

"ఆ విషయాలన్నీ మా అమ్మాయికి తెలుస్తాయి బాబూ!"

శ్రీనివాస్ యిరవ్యేళ్ళ వివేక్ చెల్లెల్ని ప్రశ్నించాడు.

"అతని పేరు ప్రకాష్ అండి, సంజీవరెడ్డి నగర్ కాల నీలో వుంటాడు. బి టైప్ క్వార్టర్సు 308 వ నంబరు యిల్లు. అన్నయ్యకి బెస్టు ఫ్రెండు" చెప్పిందామె.

"మీకు తెలిసి మీ అన్నయ్యకు విరోధులెవరైనా వున్నా రేమో చెప్పగలరా?"

"అన్నయ్య ఎవరితోనూ తగాదా పెట్టుకోదండి అతనికి విరోధులెవరూ వున్నట్టు నాకు తెలీదు."

"పిహెచ్‌డీ ఏ బ్రాంచ్‌లో చేస్తున్నాడు?"

"మినరాలజీ మీద."

"ఈ హత్య విషయంలో మీకు ఎవరిమీదనైనా అను మానం వుంటే చెప్పండి."

"ఎవరినీ అనుమానించటం లేదండి."

శ్రీనివాస్ వివేక్ అడ్రసు నోట్ చేసుకున్నాడు.

"చూడండి. యీ కారు నంబరు చూసి యెవరిదో చెప్ప గలరా?" శ్రీనివాస్ వివేక్ దుస్తుల్లో దొరికిన నంబర్ చూపించా డామెకు.

ఆమె నంబర్ చూసి తల అడ్డంగా తిప్పింది.

"ఆల్‌రైట్! మీ కేమైనా విషయాలు చెప్పాల్సినవి వున్నాయనిపిస్తే నాకు ఫోన్ చెయ్యండి" అన్నాడు శ్రీని వాస్.

ఆమె తలూపి, "అన్నయ్యని తీసుకుపోవచ్చా?" అన్నది దుఃఖాన్నాపుకునేందుకు ప్రయత్నిస్తూ.

"పోస్టుమార్టం అవుతోంది. ఓ గంటలో అప్పగిస్తాం."

"ఆ కారు యెవరిదో తెలిసింది సార్! నగరంలో చెప్పుకోదగ్గ జువాలీ డీలరు శేఠ్ రతన్‌లాల్‌ది. నిన్న సాయంత్రం నించీ తన కారు కనిపించడం లేదని సైదా

బాద్‌లో రిపోర్టిచ్చాడట. నీలిరంగు షెవర్లెట్!" సార్జంట్ రాజు మెసేజ్ తెచ్చాడు.

"అయితే ఆ కారు దొరికిందా?" అడిగాడు శ్రీనివాస్.

"లేదట."

శ్రీనివాస్ భ్రుకుటి ముడిపడింది. రైల్వేగేటు ముందాగిన కారు మనసులో మెదిలింది. స్లిప్ తీసి చూశాడు. దాని మీద కారు బొమ్మమీద షెవర్లెట్ అని రాసి వుంది.

శ్రీనివాస్ కళ్ళు చికిలించి చూశాడు. అతనికేం అర్థం కాలేదు. కాగితం మడిచి జేబులో పెట్టుకున్నాడు. శివంతో ఏం చెయ్యాల్సిందీ చెప్పి బుల్లెట్ బయటికి తీశాడు.

సంజీవరెడ్డినగర్ వైపు దూసుకుపోయింది బుల్లెట్.

3

"ఇప్పుడే మార్చ్యురీకి వెళ్ళి చూసి వస్తున్నాను సార్! జీవితంలో అతి ముఖ్యమైన స్నేహితుడ్ని పోగొట్టుకున్నాను." ప్రకాశ్ గొంతు వణికింది. అతని కళ్ళు ఎర్రగా వున్నాయి. వివేక్ మరణం అతన్ని బాగా కదిలించిందని గ్రహించాడు శ్రీనివాస్.

"వివేక్‌కి శత్రువు లెవరున్నారు! అతన్ని అంత పొడిచి చంపాల్సిన అవసరం యెవరికుంది?" అడిగాడు శ్రీనివాస్.

"ఓ గంట తర్వాత మిమ్మల్ని కలిసి అన్ని సంగతులు మాట్లాడతాను. ఏమనుకోకండి" అన్నాడు ప్రకాష్ యెక్కడికో ప్రయాణమవుతూ.

శ్రీనివాస్ వస్తున్న కోపాన్ని అణచుకొన్నాడు.

"సారీ! వివేక్‌ని క్రిమేషన్ గ్రౌండ్సుకి తీసుకువెళ్ళాలి! చీకటిపడే లోపుల దహన సంస్కారం చేయాలనుకుంటున్నాం. ఇప్పుడే యింటికి శవాన్ని చేర్చి వచ్చాను. మా

కోలీగ్స్ అందరికీ ఇన్ఫార్మ్ చెయ్యాల్సి వుంది!" అన్నాడు ప్రకాష్.

శ్రీనివాస్ అసంతృప్తిగానే లేచాడు.

రాత్రి బాగా పొద్దుపోయాక ప్రకాష్ శ్రీనివాస్‌ని స్టేషన్‌లో కలుసుకున్నాడు. అన్నమాట ప్రకారం అతనొచ్చినందుకు శ్రీనివాస్ కోపం ఎగిరిపోయింది ప్రస్తుతం కేసుకున్న ఒకే ఆధారం ప్రకాష్ యివ్వబోయే యిన్ఫర్మేషన్.

ఈ లోపల సార్జెంటు రాజు తప్పిపోయిన కారు కూకట్‌పల్లి రోడ్‌న కనుక్కున్నాడు. రతన్‌లాల్ వుండేది చంచల్‌గూడా ప్రాంతం.

సార్జెంటు రాజు స్టీరింగు మీద యింకా కారు డోరు హేండిల్ మొదలైన యితర భాగాలమీద దొరికిన వేలిముద్రలను సేకరించటం మరిచిపోలేదు. కారు క్రైం బ్రాంచ్‌కే సరాసరి తీసుకొచ్చి శ్రీనివాస్‌కి అప్పగించాడు. శ్రీనివాస్ సైదాబాద్ పోలీస్‌కి యిన్ఫర్మేషన్ యిచ్చాడు కారు దొరికినట్టు.

"సారీ సర్, మీకు అవసరమైన యిన్ఫర్మేషన్ యివ్వటంలో జాప్యం చేశాను" అన్నాడు ప్రకాష్ వస్తూనే.

"ఫరవాలేదు. చెప్పండి!"

"వివేక్‌కి తల్లి, చెల్లెలు తప్ప ఎవరూ లేరని మీకీసరికి తెలిసే వుంటుంది "

శ్రీనివాస్ తలూపాడు.

"వివేక్ తండ్రి కాలేజీ ప్రిన్సిపల్‌గా చేస్తూ గుండెజబ్బుతో మరణించారు. ఆయన మిగిల్చిన ఆస్తే వివేక్. వివేక్ చాలా బ్రిలియంట్. యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్. ఈ సంవత్సరం డాక్టరేట్ తీసుకోవలసినవాడు. అనుకోని విధంగా అర్ధాంతరంగా జీవితం చాలించాడు" ప్రకాష్

గొంతు వణికింది. ఓ క్షణం ఆగి మాట్లాడటం కొనసాగించాడు.

"వివేక్‌కి చెప్పుకోదగ్గ స్నేహితు లెవరైనా వుంటే అది నేనే! శత్రువుల విషయాని కొస్తే అతను అన్నిట ఫస్ట్ రావటం యిష్టంలేని వ్యక్తి ఒకడున్నాడు—పేరు మోహన్. ఎమ్మెస్సీ వరకు మా క్లాస్‌మేటు. జూనియర్ లెక్చరర్‌గా చేస్తున్నాడు సిటీలోనే వాడు కూడా డాక్టరేటు చెయ్యాలనుకున్నాడు గాని సెలెక్టు కాలేదు. మరో వ్యక్తి ప్రస్తుతం వివేక్ సబ్జెక్టుమీదే డాక్టరేట్ చేస్తున్న సదాశివం. అతనికి జెలసీ ఎక్కువ. వివేక్ తర్వాత అంతటి బ్రిలియంట్ సదాశివమే! ఒకటి రెండుసార్లు వివేక్‌తో అకారణంగా ఘర్షణకి దిగిన సందర్భా లున్నాయి.

"ఇకపోతే, వివేక్ చెల్లెల్ని భంగపరచాలని ప్రయత్నించి అతని చేతుల్లో చావుదెబ్బలు తిన్న వాళ్ళింటి ఎదుటి సాంబన్‌ని మరో శత్రువుగా చెప్పుకోవచ్చు. నాకు తెలిసి వివేక్‌కి శత్రువులంటూ చెప్పుకోవలసొస్తే వీళ్ళని పేర్కొనవచ్చు" అన్నాడు.

శ్రీనివాస్ ఆ ముగ్గురి పేర్లు చిరునామాలతో బాటు నోట్ చేసుకున్నాడు.

సార్జెంట్సు రాజుని, శివాన్ని పిలిచి అడ్రసులు వాళ్ళ కిచ్చాడు శ్రీనివాస్.

"వీళ్ళు నిన్న ఉదయంనించి యిప్పటిదాకా యెక్కడెక్కడ తిరిగారో, ఏం చేశారో పూర్తి వివరాలు సేకరించండి" అన్నాడు. సెల్యూట్ చేసి వెళ్ళిపోయారు రాజు, శివం.

శ్రీనివాస్ షెవర్లెట్ కారు నంబరు ప్రకాష్‌కి చెప్పి "ఇలాంటి కారు నిదివరలో యెప్పుడైనా చూశారేమో,

గుర్తు తెచ్చుకుని చెప్పండి" అన్నాడు.

ప్రకాష్ నంబర్ చూసి తల అడ్డంగా తిప్పాడు.

"సరే, యింకా ముఖ్యమైన వివరాలేమైనా వుంటే చెప్పండి" అన్నాడు శ్రీనివాస్.

"సాయంకాలాలు వివేక్ ఒంటరిగా కొంత దూరం యీవెనింగ్ వాక్‌కి వెళ్తుంటాడు. పచ్చని పొలాలన్నా, ప్రకృతి దృశ్యాలన్నా చాలా యిష్టం. చిత్రలేఖనంలో కొంతవరకు ప్రవేశ ముంది. సైన్సు, లెక్కలు అంటే ప్రాణం పెడతాడు. డిటెక్టివ్ సాహిత్యం పట్ల అభిమానం హెచ్చు."

"గుడ్! ఇలాగే యింకా అతని గురించిన ప్రత్యేక విషయాలేమన్నా వుంటే చెప్పండి!"

"దట్సాల్! నాకు సెలవిస్తే వెళ్తాను. క్రిమేషన్ గ్రౌండ్సు నించి సరాసరి వచ్చేశాను. సంజీవరెడ్డినగర్ పోవాలి!"

"ఓ.కే. థాంక్యూ! అన్నట్లే పని కాగానే సరాసరి నన్ను వచ్చి కలిశారు!" అభినందనపూర్వకంగా ప్రకాష్‌తో కరచాలనం చేశాడు శ్రీనివాస్.

ప్రకాష్ వెళ్ళిపోయాడు.

శ్రీనివాస్‌కి కేసు తలా తోకా అందటం లేదు. కాసేపు గదిలో పచార్లు చేశాడు. తర్వాత తనలో తనే ఏదో నిర్ణయాని కొచ్చి సీట్లో కూచున్నాడు.

ఫోన్ ఎత్తి ఏదో నంబర్ డయల్ చేశాడు.

అవతల ఫోన్ రింగయింది.

"హల్లో, డిటెక్టివ్ కిరణ్ వున్నాడాండీ!?" అన్నాడు.

"వారింకా ఢిల్లీనుంచి తిరిగి రాలేదండి. రేపు ఏ.పి. కి వస్తున్నట్టు ఫోన్ చేశారు!" అన్నది లాయర్ బిందు—

కిరణ్ భార్య.

"బ్రదర్ రాగానే శ్రీనివాస్ ఫోన్‌చేశాడని చెప్పండి" అంటూ ఫోన్ పెట్టేశాడు.

మర్నాడు రాబోమే ఏ.పి. ఎక్స్‌ప్రెస్ కోసం ఆ క్షణం నించీ యెదురు చూడసాగాడు శ్రీనివాస్.

"ఇదిగో, యీ ఫైలు ఓసారి స్టడీ చేయి. కేసు స్వరూపం పూర్తిగా అర్థమైపోతుంది" అన్నాడు శ్రీనివాస్ డిటెక్టివ్ కిరణ్‌కి ఫైలు అందిస్తూ.

కిరణ్ ఫైల్ ఆమూలాగ్రం చదివి శ్రీనివాస్ ముందుకి జరిపి, "హత్యాయుధం దొరకలేదా" అనడిగాడు.

"లేదు. దాదాపు తొమ్మిదంగుళాల పొడవైన కత్తితో పొడిచి వుండవచ్చునని డాక్టర్ పోస్ట్‌మార్టం రిపోర్టులో రాశాడు కదా? గాయం లోతునుబట్టి ఆ నిర్ణయాని కొచ్చినట్టు రాశాడు"

"చదివాను. ఇసకలో పడ్డ కాలిగుర్తులు ఎవరివో తెలియలేదు కదా!"

"అవి హంతకుడివే అయుంటాయి. అది తెలిస్తే కేసు తేలిపోయినట్టే కదా!"

కిరణ్ సాలోచనగా తలూపి, "వివేక్ శత్రువుల గురించి వివరాలు తెలుసుకున్నావా?" అనడిగాడు.

"వివేక్ ఫ్రెండు ప్రకాష్ ద్వారా ముగ్గురి విషయం తెలిసింది. సార్జంట్స్ శివం, రాజు రాత్రే వివరాలన్నీ సేకరించారు. మోహన్ అనబడే జూనియర్ లెక్చరరు నిన్నంతా కాలేజీలోనే వున్నాడు. రాత్రి పది గంటల వరకు ఓ ట్యుటోరియల్ కాలేజిలో కొన్ని క్లాసులు తీసుకున్నాడు. తర్వాత యింట్లో వున్నట్టు సాక్ష్యాలున్నాయి. అతని ఎలిబీ అనుమా

నించటానికి. వీల్లేకుండా వుంది.

"ఇకపోతే, సదాశివం నిన్న ఊళ్ళో లేడు. గత రెండు రోజులుగా అతను పనిమీద విజయవాడ వెళ్ళాడని తెలిసింది. ఈ రోజు వరకు ఇంకా రాలేదు.

"మూడో శత్రువు సామ్సన్—వివేక్ ఎదురింటి వాడే! నిన్న రాత్రి సెకండ్ షోకి వెళ్ళొచ్చి యింట్లోనే పడుకుని నిద్రపోయానని చెప్తున్నాడు. సినిమా టిక్కెట్టు కూడా మనవాళ్ళు వెరిఫై చేసుకున్నారు. దీన్నిబట్టి ఈ ముగ్గుర్లో ఎవర్ని అనుమానించాలో నిర్ణయించుకోవాల్సి వుంది" అన్నాడు శ్రీనివాస్.

"సదాశివం విజయవాడలో వున్న విషయం కన్ఫర్మ్ చేసుకున్నావా?"

"విజయవాడలో అతనెక్కడుండేదీ అడ్రసు నోట్ చేసుకున్నాను. వైర్‌లెస్‌లో అక్కడి పోలీస్‌కి మెసేజ్ కూడా పంపించాను."

"ఆల్‌రైట్! సామ్సన్ ఎలిబీ మీద కూడా నాకు పూర్తి నమ్మకం లేదు. అది కూడా వెరిఫై చేయించాల్సి వుంది. ఆ జూనియర్ లెక్చరర్ సంగతి కూడా వెంటనే ఓ నిర్ణయానికి రాలేం!" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ తలూపాడు. సార్జంటు శివాన్ని పిలిచి ఏదో చెప్పి పంపించాడు.

"ఆ షెవెర్లెట్ కారు నెవరు దొంగిలించారో కూకట్ పల్లి రోడ్‌న యెవరు వదిలిపోయారో ఆ వివరాలేమైనా తెలిశాయా?"

"లేదు బ్రదర్! పోలీసు దర్యాప్తు చేస్తోంది. ముఖ్యమైన సంగతే మరిచాను, ఇదిగో, యీ బొమ్మ చూడు—దీన్నిబట్టి కేస్ కొంత ముందుకి వెళ్తుందనుకొంటున్నాను"

అంటూ రైల్వేగేటు డిజైన్ వేసిన కాగితం ముక్క కిరణ్ కందించాడు శ్రీనివాస్.

కిరణ్ తదేకదీక్షతో ఆ బొమ్మ వంకే పరిశీలనగా చూశాడు. ఈక్వేషన్ ఒకటికి నాలుగుసార్లు మననం చేసుకున్నాడు.

"మూడు మూళ్ళు తొమ్మిది. కాని ఏడు అని రాశాడు వివేక్. అంటే అది మామూలు గుణకారం కాదు. అందులో ఏదో నిగూఢ రహస్యముంది. షెవర్లెట్ కారు గేటు ముందు ఆగివుంది. దూరంగా ట్రెయిన్ వస్తోంది. ఈక్వేషన్ బొమ్మ వెయ్యకపోయినా అది రైల్వేగేటని తెలుస్తూనే వుంది. అంటే ట్రెయిన్ బొమ్మకి కూడా ఏదో అర్థముండి వుండాలి!

"షెవర్లెట్ కారు రతన్‌లాల్‌దే అయివుంటుంది. నంబరు వేరే ఎందుకు రాశాడో తెలీదు. అదే స్లిప్‌మీద నంబరు నోట్ చేసి వుండాల్సింది. ట్రెయిన్ వస్తున్న సమయంలో గేటు మూసివున్నపుడు గేటు ముందు ఆ షెవర్లెట్ ఆగింది. అది సహజమే! కాని యిందులో ఏదో మెలిక వుంది. అది అర్థమైతే చాలా ముఖ్యమైన క్లూ మనకి దొరికిపోతుంది. హత్యకు మోటివ్ కూడా అర్థమయిపోతుంది" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ తలూపి, "వివేక్ లెక్కల్లోను. సైన్సులోనూ దిట్ట అట. మన బుర్రలు పాడు చేసేశాడు ఆ బొమ్మవేసి! అదీగాక ఆ రైల్వేస్టేషన్ ఎక్కడిదో కూడా అర్థం కావటంలేదు" అన్నాడు.

కిరణ్ బొమ్మలోకి పరిశీలనగా చూసి, "ఇది బేగంపేట్ స్టేషను ప్రక్కనున్న రైల్వేక్రాసింగ్. ఇదిగో క్రాసింగ్‌కి

చేర్చి ఓవర్ బ్రిడ్జి సగం గీసివుంది చూడు. బేగంపేట్‌కి ఓవర్ బ్రిడ్జి కడ్తున్నారు. అది కూడా ఇంకా అసంపూర్తి గానే వున్నట్టు చూపించాడు అదింకా నిర్మాణంలోనే వుంది కదా! కుడిప్రక్క ట్రెయిన్ వస్తున్నట్టు గీశాడు— అంటే సనత్‌నగర్ వైపు నుండి నాంపల్లి వస్తోంది ట్రెయిన్. ఆ లైనులో నడిచే ట్రెయిన్స్ చాలా లిమిటెడ్. దాన్నిబట్టి యీ ట్రెయిన్ ఏదో చెప్పేయొచ్చు. ఈ ట్రెయిన్‌కి కూడా ఏదో సిగ్నిఫికెన్సుందని నా అనుమానం!" అన్నాడు

శ్రీనివాస్ తదేకదీక్షతో బొమ్మవైపి చూపి, "ఎస్ బ్రదర్. ఇది బేగంపేట్ క్రాసింగ్! ఎడమ చెయ్యి వైపు స్టేషన్ కూడా చూపించాడు. క్రాసింగ్ పక్కన స్టేషనున్నది బేగంపేట్‌కే!" అన్నాడు.

కిరణ్ అప్పటికప్పుడే ఏదో నిర్ణయాని కొచ్చినట్టు లేచి "కమాన్ ఇన్‌స్పెక్టర్! మనం బేగంపేట్ పోయివద్దాం" అన్నాడు.

శ్రీనివాస్ లేచి "జీప్ తియ్యనా?" అన్నాడు.

"వద్దు. నా టయోటాలో వెళ్దాం."

కిరణ్ టయోటాను బేగంపేట్ స్టేషను ముందు పార్కు చేశాడు.

"నువ్విక్కడే వుండు. నేను క్రాసింగ్ వరకు నడిచి పోయి చూసి వస్తాను. నువ్వొస్తే అందరి దృష్టి మన మీదనే వుంటుంది" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ కార్లోనే వుండిపోయాడు.

కిరణ్ రైల్వే క్రాసింగ్ దగ్గిర వున్న పాన్ షాపు ముందు నిల్చున్నాడు. హిందూ పేపరు తీసుకుని దాని

మీదుగా రైల్వేగేటు వైపు చూశాడు. గేటు తెరిచే వుంది. ఆ టైంలో ట్రెయిన్స్ ఏమీలేవు. ఇంకో గంట తర్వాత రాయలసీమ ఎక్స్‌ప్రెస్ తిరుపతి వైపు వెళ్తుంది.

కిరణ్ గేటు కుడివైపు దృష్టి సారించి చూశాడు. గేటు పైకి లేచివుంది. పైభాగంలో ఎర్రటి లైటు ఫిక్స్ చేసి వుంది గేటు మూసినపుడు అవి వెలుగుతూ ఆరుతూ గంట కొడుతుంటుంది.

కిరణ్ మనసులో $3 \times 3 = 7$ ఈక్వేషన్ మెదుల్తోంది. గేటు మూసివుండగా షెవర్లెట్ కారు గేటుముందు ఆగి వుండడం, సనత్‌నగర్ వైపు నుంచి ట్రెయిను రావటం, యీక్వేషన్—యీ మూడిటికీ ఏదో కనెక్షన్ వుంది. అదే అందటం లేదు లింక్.

కిరణ్ ఆలోచనల్లో వుండగానే రెడ్‌లైటు గంట విని పించింది. గేటు పడిపోతోంది. దూరంగా సనత్ నగర్ నించి ట్రెయిను వస్తున్న జాడ కనిపించింది.

కిరణ్ వాచీ చూసుకున్నాడు. అయిదు గంటలు కావస్తోంది ఈ సమయంలో ఏ ట్రెయినుందా అని అనుమానిస్తూ గేట్‌మేన్‌ను అడిగాడు.

"రాయల సీమ ఎక్స్‌ప్రెస్ బాగా లేటయింది సాబ్" అన్నాడు గేట్‌మేన్.

ఉదయం ఎనిమిది గంటలకు రావలసిన ట్రెయిను అది. తుఫానుకి లైన్లు చెడిపోయి బాగా లేటుగా నడుస్తున్నాయి ట్రెయిన్సు అన్ని. కొన్ని కేన్సిల్ చేశారు కూడా.

ట్రెయిను గేటుకి పదడుగుల దూరంలో ఆగిపోయింది ఎందుకనో.

కిరణ్ మస్తిష్కం చురుగ్గా పనిచేసింది,

ట్రెయిను ఆగిన చోట ఫెన్సింగ్ లేదు. అంతా ఓపెన్‌గా వుంది. ట్రెయిన్‌లో నించి జనం దిగుతున్నారు. ఫెన్సింగ్‌లేని చోటు నుంచి రోడ్‌మీదికి ఎక్కి వచ్చేస్తున్నారు. ఎక్కువ మంది దగ్గర దగ్గర స్టేషన్ను నించి ప్రయాణించే వాళ్ళు టిక్కెట్లు కొనరు. ఆ బాపతువాళ్ళు చిన్న చిన్న కూరగాయల వ్యాపారస్థులు గొలుసు లాగి ట్రెయిను ఆపి దిగిపోవటం సర్వసాధారణంగా జరిగే తంతే.

కిరణ్ అలాంటి వాళ్ళను కళ్ళతో గమనిస్తున్నాడు. కొందరు బియ్యం బస్తాలు కిందికి తోసి దిగిపోతున్నారు. కిందికి దిగాక బస్తాల్ని రోడ్ పక్కకు లాగేసుకుంటున్నారు. రిక్షాల్లో వేసుకుని వెళ్ళిపోతున్నారు. చవగ్గా బియ్యం దొరికే చోట తెచ్చుకుని హైదరాబాద్‌లో కేజి నాలుగు రూపాయల వరకు అమ్ముకుని లాభాలు ఆర్జిస్తున్నారు బ్లాక్ వర్తలు. వాళ్ళని ఎవరూ పట్టుకోరేం?

ట్రెయిను వంకే తదేకదీక్షతో చూస్తున్న కిరణ్ మెదడులో మెరుపులు మెరిశాయి!

ట్రెయిను ఆగినంత దూరంలో రైలు పట్టాలకి అడ్డంగా వేసిన స్లీపర్లు అతని దృష్టిలో పడ్డాయి. గేటు కుడిపక్క నుంచి ట్రెయిను ఆగినంత వరకు ఏడు స్లీపర్లు ఫిష్ ప్లేట్సుతో బిగించబడి వున్నాయి. ఎనిమిదో స్లీపరు మీదికి ట్రెయిను ఇంజన్ వచ్చేసి వుంది!

కిరణ్ మనసు ఈక్వేషను మెదిలింది. ఈక్వేషన్‌లోని ఏడు అంకె యీ స్లీపరుకి సంకేతం కాదు గదా అనిపించింది.

ట్రెయిను కదిలింది. గేటుదాటి వెళ్ళిపోయింది.

గేట్లు పైకి లేచిపోయాయి.

ట్రాఫిక్ మళ్ళీ అటు ఇటు మామూలుగా జరిగి

పోతోంది. ఓ పది నిమిషాల తర్వాత మళ్ళీ అక్కడి వాతావరణంలో ప్రశాంతత వచ్చేసింది.

శ్రీనివాస్ కారు దిగి కిరణ్ కోసం కళ్ళతో వెతుక్కుంటున్నాడు.

కిరణ్ గేటు దగ్గర ఓ క్షణం నిల్చున్నాడు. జేబునించి మెజరింగ్ టేప్ తీశాడు. కుడిపక్క గేటు నుండి ఏదో స్లీపరు వరకు వున్న దూరాన్ని కొలిచాడు. తొమ్మిది అడుగులుంది.

ఈక్వేషన్ అర్థమయిపోయింది కిరణ్‌కి. తొమ్మిది అడుగులకి అర్థం 3 × 3 అయివుంటుంది. 7 కి అర్థం ఏదో స్లీపరు. అయితే దాని గురించి యెందుకు అలా రాసుకున్నాడు వివేక్?

కిరణ్ దృష్టి ఏదో స్లీపరుమీద పడింది. అక్కడ నేల గుల్లగా తవ్వినట్టు కనిపించింది.

కిరణ్ చుట్టూ మెల్లగా దృష్టి సారించి చూశాడు. అతని గురించి పట్టించుకున్న వాళ్ళు లేరు. ఎవరి హడావిడి వాళ్ళది!

కిరణ్ కోటు జేబునించి పొటవాటి ఇనుప రాడ్ తీసి నేలమీద తవ్వాడు. ఓ అడుగు తవ్వేసరికి లోపల తళుక్కుమని మెరిసింది.

బంగారం బిస్కెట్!

కిరణ్ బిస్కెట్‌ని తీసి జేబులో వేసుకున్నాడు.

సరాసరి గేట్‌మెన్ దగ్గరికి చేరుకున్నాడు.

గేట్‌మేన్ అతని వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"మొన్న అంటే బుధవారం సాయంత్రం ట్రెయిను ఏదయినా యిలాగే గేట్లో ఆగిపోయిందా? గుర్తు చేసుకుని చెప్పు!" అన్నాడు.

గేట్ మేన్ ఓ నిమిషం ఆలోచించి, "అవునండి ఆగింది! సరిగ్గా యీ రోజు ట్రెయిను ఆగిన చోటనే మీనార్ ఎక్స్ ప్రెస్ ఆగింది. బోంబే నించి వస్తోంది. ఆ ట్రెయిను కూడా బాగా లేటు. చీకటి పడిపోయింది" అన్నాడు.

"అప్పుడు టైం ఎంతయింది?"

"రాత్రి ఏడవుతుందండి!"

ఏడుకి అర్థం టైం కూడా కావచ్చు!

"గేటు వేశాక కూడా ట్రెయిను ఎందుకు ఆగినట్టు?" అడిగాడు కిరణ్.

"ఏముంది సాబ్, మీరు చూస్తున్నారుగా చిల్లర వ్యాపారం చేసుకునే పోరగాళ్ళు జర సేపు బండా పేస్తా వుంటారు" అన్నాడు గేట్ మెన్

"మీనార్ ఎక్స్ప్రెస్ నుంచి ఏమైనా బస్తాలు దింపారా ఆ రోజు?"

గేట్ మేన్ ఓ క్షణం ఆలోచించి. "సాధారణంగా రోజూ దింపుతానేవుంటారు సాబ్! ఆ రోజు కూడా ఏవో బియ్యం బస్తాలు, కొన్ని చెక్క పెట్టెలు దింపినట్టు గుర్తుండి!" అన్నాడు.

"షెవర్లెట్ కారు ఏదయినా ట్రెయిన్‌కి దగ్గర్లో, అంటే అది ఆగిన చోటుకి దగ్గరగా ఆగివుందా?"

"ఆగటమేమిటి సాబ్, ఆ చెక్క పెట్టెలు ఆ కారు డిక్కీలో వేసుకోవటం నాకు కనిపించింది. ఇంతలో ట్రెయిను కదిలిపోయింది. కారు నా దృష్టినించి జర తప్పి పోయింది."

"వెరీగుడ్! ఆ చెక్క పెట్టెల్లో యేముందో చెప్ప గలవా?"

"ఆపిల్ పళ్ళుంటాయి బాబూ!"

కిరణ్ సాలోచనగా తలూపాడు. ట్రెయిను నుంచి చెక్కపెట్టెల్లో ఆపిలుపళ్ళ మధ్య బంగారు బిస్కెట్లు దాచి పెట్టారు. పైకి మాత్రం ఆపిల్ పెట్టెలు. లోపల బంగారం. షెవర్లెట్ కార్లోకి బంగారం ట్రాన్స్ఫరయి పోయిందన్నమాట!

కిరణ్ గేట్‌మన్‌కి ధన్యవాదాలు చెప్పి శ్రీనివాస్‌ని కలిశాడు.

"ఇంకా రాకపోవటం చూసి నేనే బయల్దేరాను. ఇంతలో నువ్వు వస్తున్నావు" అన్నాడు శ్రీనివాస్.

"షెవర్లెట్ మిస్సయినట్టు శేఠ్ రతన్‌లాల్ యెప్పుడు రిపోర్టిచ్చాడు?" అడిగాడు కిరణ్.

"బుధవారం సాయంత్రం ఆరున్నర ప్రాంతాల."

కిరణ్ తలూపాడు. రతన్‌లాల్ కారు మిస్సయిన అర గంటకు యిక్కడ స్మగ్లింగ్ గూడ్సు అందులో రవాణా అయ్యాయన్న మాట!

అయితే రతన్‌లాల్ ....?

"శ్రీనివాస్, రతన్‌లాల్ యింటిమీద దాడిచెయ్యి. నీకు కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెలియవచ్చు!" అన్నాడు కిరణ్.

"రతన్‌లాల్‌కి యీ హత్యతో సంబంధముందంటావా?" శ్రీనివాస్ కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి!

కిరణ్ మందహాసం చేసి, "కేసు పూర్తయిందని అనుకోవటం లేదు నేను!" అన్నాడు.

6

"రతన్‌లాల్ యింట్లో నీ దగ్గర దొరికిన బిస్కెట్సు వంటివి దొరికాయి. స్మగ్లింగ్ నేరానికి అతన్ని అరెస్టు చేశాం! అయితే వివేక్‌ని హత్య చేసింది తానుగాని, తన

మనుషులుగాని కాదని రతన్‌లాల్ ఖచ్చితంగా చెప్తున్నాడు! అతను చంపాడనటానికి ఆధారాలు కూడా లేవు" అన్నాడు శ్రీనివాస్.

స్టేషన్‌లో శ్రీనివాస్, కిరణ్ యెదురెదురుగా కూచున్నారు.

కిరణ్ తలూపి, "నీకు హత్య జరిగిన స్పాట్‌లో ఆధారాలేం దొరకలేదు కదూ?" అన్నాడు.

"ఉహూఁ! యిసుకలో దొరికిన కాలిగుర్తులు ఫోటోలు తీయించాను. అంతకు మించి మరేం దొరకలేదు!"

"అనుమానితులు ముగ్గురి ఎలిబీలను బాగా పరిశీలించావు కదూ!"

"ఆఁ! ఎవర్నీ అనుమానించటానికి వీల్లేకుండా అందరికి సరైన ఎలిబీలున్నాయి."

"ఈ అనుమానితుల గురించి చెప్పిన మనిషి పేరు ఏమిటన్నావు?"

"ప్రకాష్. వివేక్‌కి బెస్టు ఫ్రండు!"

"ఓసారి అతన్ని కల్సుకుందాం పద!"

టయోటా సంజీవరెడ్డినగర్ వైపు పరుగెత్తింది.

టయోటా ప్రకాష్ యింటిముందాగుతుండగానే లోపల్నుంచి ఓ అమ్మాయి ఆగివున్న రిక్షా యెక్కింది.

శ్రీనివాస్ ఆ అమ్మాయిని గుర్తుపట్టాడు.

"ఆమె వివేక్ చెల్లెలు" అన్నాడు కిరణ్‌తో.

కిరణ్ భ్రుకుటి ముడిపడింది.

ప్రకాష్ గుమ్మంవరకు వచ్చినవాడు వాళ్ళిద్దర్నీ చూడగానే చటుక్కున లోపలి గదిలోకి తప్పుకున్నాడు.

శ్రీనివాస్ రెండుసార్లు పిలిచాక బయటి హాల్లోకి వచ్చాడు.

కిరణ్ యీ లోపల హాలుకి ఓ పక్కగా వున్న షూ స్టేండు చూపి, తల పంకించాడు.

"హంతకుడెవరో తెల్సిందాండీ?" అన్నాడు ప్రకాష్ ఆందోళన వ్యక్తపరుస్తూ.

"మీట్ మిస్టర్ కిరణ్, డిటెక్టివ్" అన్నాడు శ్రీనివాస్ పరిచయం చేస్తూ "ఈయన ప్రకాష్ వివేక్ బెస్ట్ ఫ్రండు." అన్నాడు.

మళ్ళీ ప్రకాష్ తిరిగి అదే ప్రశ్న వెయ్యగానే శ్రీనివాస్ "ఆ, ఆ!! ఆ ప్రయత్నంలోనే వున్నామండి. ఇంకా పూర్తి వివరాలు అందలేదు!" అన్నాడు.

"మంచినీళ్ళు తెప్పిస్తారా?" అన్నాడు ప్రకాష్ వంక చూపి.

"ష్యూర్, యిప్పుడే పంపిస్తాను" అంటూ ప్రకాష్‌లేచి లోపలి గదిలోకి వెళ్ళాడు.

కిరణ్ జోళ్ళ స్టాండు దగ్గరికి ఒక్క అంగలో వెళ్ళి ప్రకాష్ షూ పరీక్షగా చూసి, మళ్ళీ యథాస్థానంలో పెట్టేశాడు. ఆ కాస్త సేపట్లోనే మెజరింగ్ టేప్‌తో దాని పొడవు కొల్చి నోట్ చేసుకున్నాడు.

శ్రీనివాస్ ఆశ్చర్యంగా చూశాడు కిరణ్ వంక.

ప్రకాష్ పనిమనిషితో మంచినీళ్ళు, కూల్‌డ్రింక్సు పట్టించుకొచ్చాడు.

"వివేక్‌తో మీ పరిచయం చాన్నాళ్ళుగా వుందనుకుంటాను!?" అన్నాడు కిరణ్.

"అవునండి. ఓ మంచి స్నేహితుడ్ని పోగొట్టుకున్నాను."

కిరణ్ సాభిప్రాయంగా చూశాడు శ్రీనివాస్ వంక.

"వివేక్ హత్య చేయబడ్డ విషయం మీకెవరు చెప్పా

రండీ?" కిరణ్ అడిగాడు.

"మా కొలీగ్స్ ఎవరో చెప్పారు, వివేక్‌ని యెవరో హత్య చేశారని! వెంటనే మార్చ్యురీకి వెళ్ళాను."

కిరణ్ ఆతని మాటల్లోని తడబాటు కనిపెట్టాడు.

"ఆల్‌రైట్! మేం వస్తాం" కిరణ్ లేచాడు.

శ్రీనివాస్ దారిలో అడిగాడు "ఇలా ఎక్కడికి?" అని.

"బుధవారం ప్రకాష్ యెక్కడెక్కడ తిరిగాడో వివరాలు సేకరించమను మీ సార్జంట్స్‌తో! నేనీ లోపల ఓసారి వివేక్ యింటికి వెళ్ళొస్తాను. సామ్సన్‌తో మాట్లాడే పని గూడా వుంది" అన్నాడు కిరణ్.

7

"ప్రకాష్ తన నేరం ఒప్పుకున్నాడు. కేవలం యూనివర్శిటీలో తనకన్న వివేక్‌కి డిస్టింక్షన్ రావటం చూడలేక జెలసీతోనే అతన్ని చంపేశానని ఒప్పుకున్నాడు ప్రకాష్‌ని అడ్డం తొలగించుకుంటే అతని చెల్లెల్ని వశపరచుకోవటం తేలికని భావించాడట! తనకి ముందే పెళ్ళి జరిగిపోవటం వల్ల వివేక్ చెల్లెల్ని తన స్వంతం చేసుకోవటానికి వివేక్ ఒప్పుకోడని, శాశ్వతంగా అడ్డు తొలగించుకుంటే అటు డాక్టరేట్‌లో డిస్టింక్షను, యిటు వివేక్ చెల్లెలు దక్కుతారని ప్లాన్‌చేసి, వాహ్యాళికి బేగంపేట్ మీదుగా ఊరి చివరకు వెళ్ళిన వివేక్‌ని చంపేశాడట!" అన్నాడు శ్రీనివాస్ కిరణ్‌తో.

కిరణ్ చిన్నగా నవ్వి, "నా అనుమానం మొదట్లో ప్రకాష్ మీదికి పోలేదు. జీడిమామిడి తోపు యిసుకలోని పాదం గుర్తు—షూ గుర్తు అది! ఈ మధ్యనే వస్తున్న అంబాసిడర్ షూ సోల్‌మీదుండే ఓ ప్రత్యేకమైన డిజైన్

యిసకలో ముద్రపడుంది. ప్రకాష్ షూ, జోళ్ళస్టాండులో చూశాక మొదటిసారిగా అనుమానం అతనిమీద పడింది, కొలతలుగూడా సరిపోయాయి.

"యూనివర్శిటీలో వివేక్‌కి ప్రత్యక్షంగా వృత్తి విరోధి అని తేలింది. డిస్టింక్షన్ కోసం ప్రకాష్ తాపత్రయ పడ్తున్నట్టు ప్రొఫెసర్ చెప్పాడుకదా! ఈ కారణాలవల్ల హత్య అతడే చేశాడని నిర్ధారించాను. ఇకపోతే, వివేక్ జేబులో దొరికన డిజైన్ మనల్ని కాస్త పక్కదారి పట్టించటం జరిగింది. వివేక్ మంచి దేశభక్తుడు గూడా! దొంగల్ని పట్టిద్దామనుకొన్నాడు. కాని యింతలోనే హత్య చేయబడ్డాడు" అన్నాడు. □

1983 'వెంకట్ అవార్డు' పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కార్టూను



వంపువర్షం

విద్వాన్ శీలాదేవి.

"జయరాం!"

"సార్?"

"ఈ వర్షం యిప్పుడప్పుడే వెలిసేట్టు లేదు. ఇంత వర్షంలో కష్ట ర్లుగూడా రారు. గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునేకంటే, నిన్న వచ్చిన సరుకులు సరిగ్గా వున్నాయో,

లేదో చూసుకోడం మంచిది. అలా స్టూల్‌మీద కూర్చో. నేను లోపలి కెళ్తాను" అన్నారు కిషన్‌రావుగారు.

"అలాగేనండి!" అంటూ కౌంటర్ దగ్గరున్న స్టూల్ మీద చతికిలబడ్డాను.

ఆయన స్టోరు గదిలో కెళ్ళిపోయారు.

రోడ్డుమీద వచ్చేపోయే జనాన్ని చూస్తూ కూర్చున్నాను ఒంటరిగా. బైట కుండపోతగా కురుస్తోంది వర్షం! బజార్లో జనసంచారం పూర్తిగా మృగ్యమైంది. అప్పుడప్పుడూ అత్యవసరంగా బైటికి వచ్చిన వాళ్ళు మాత్రమే గొడుగులు పట్టుకునో, వాటర్ ప్రూఫులు తొడుక్కునో, కాలినడకనో, సైకిల్‌మీదో వస్తూ పోతున్నారు రోడ్డుమీద.

ప్రకృతి పగబట్టినట్టు ఈ ఏడు చాలా విపరీతంగానే వున్నాయి వర్షాలు. ప్రతిరోజూ అటు రేడియోలోనూ, ఇటు పత్రికల్లోనూ వివిధ ప్రదేశాల్లో భారీ వర్షాల వల్ల సంభవిస్తున్న బీభత్స వార్తలే వినవస్తున్నాయి.

ఎక్కడ వేసిన పంటలు అక్కడే నేలమట్టమయ్యాయిట. ఆ పంటల సంగతెలా వున్నా, అక్రమ వ్యాపారులు ఈ దైన్య స్థితి సాకుతో తమ పంటమాత్రం నిరాటంకంగా పండించుకుంటారు, తిండిగింజల ధరలు పెంచి.

ఓవైపు సామాన్య మానవుడు ప్రకృతి కరాళ నృత్యానికి నడ్డి విరిగి నేలకరిస్తే, మరోవైపు సాటి మానవుడే ఆ మూలుగుతున్న నక్కపై తాటికాయ వేసి తన పబ్బం గడుపుకుంటాడు.

కలికాలం మరి!

నా ఆలోచనా స్రవంతిని తెంచి వేస్తూ కౌంటర్‌మీది టెలిఫోన్ గణగణ మోగింది. రిసీవర్ ఎత్తి, "హలో!" అన్నాను.

"నూతన్ మెడికల్ షాపేనా?" వినిపించింది అవతలి నించి.

"ఔనండి?"

"కిషన్‌రావ్ వున్నారా?"

"ఉన్నారండి. లోపల స్టోరు గదిలో వున్నారు."

"నేను హజారీమల్‌గారి మనవణ్ణి మాట్లాడుతున్నాను."

"చందూలాల్‌గారా! చెప్పండిసార్...." అన్నాను గౌరవంగా.

"మీ షాపులో పిర్టోలిన్ బాటిల్స్ వున్నాయా స్టాకులో?"

"ఉన్నాయి సార్!"

"వెంటనే ఓ బాటిల్ పంపించండి మా ఇంటికి. తాతయ్య పరిస్థితి చాలా విషమదశలో వుంది. వాతావరణం బాగులేక ఆయన జబ్బు బాగా తిరగబెట్టింది. చాలా ఆయాస పడుతున్నారు. అరక్షణం గూడా వృధా చెయ్యవద్దు. ఎలాగైనా సరే, మందుసీసా పంపించండి."

నేను జవాబిచ్చేలోగా, మా సంభాషణ విని కాబోలు, స్టోరు గదిలోంచి కిషన్‌రావుగారు ఆదరాబాదరా వచ్చి, "ఎవరు?" అడిగారు నన్ను.

చెప్పి, రిసీవర్ అందించాను.

"హలో, కిషన్రావ్ స్పీకింగ్....ఆఁ, నమస్తేసాబ్... అలాగే....ఇప్పుడే, వెంటనే పంపుతున్నాను జయరాంతో" అంటూ రిసీవర్ దించి, హడావుడిగా మందులు పేర్చివున్న అద్దాల బీరువాలని సమీపించాడు.

ఓ బీరువా తెరిచి, పై వరసలోంచి బాటిల్ డబ్బా తీసి, "జయరాం! వెంటనే దీన్ని హజారీమల్ గారింట్లో యిచ్చిరా!" అన్నారు.

బైట కుండపోతగా కురుస్తున్న వర్షం వైపు చూశాను.

"వర్షం గురించి ఆలోచించక! అవతల ముసలాడు చావు బతుకుల్లో వున్నాడట. పైగా. వాళ్ళు మన పాత కష్టమర్లే. సైకిల్‌మీద వెంటనే బైలుదేరు. ఊఁ!" అన్నా రాయన బాటిల్ నావైపు చాపుతూ.

మరేమీ ఆలోచించకుండా దాన్నందుకుని, బైటికి నడిచాను. మెట్లదగ్గర ఆపివున్న సైకిల్ ఎక్కి బైలుదేరాను. నేలంతా బురద బురద. నెత్తిపై గులకరాళ్ళు గుమ్మరిస్తున్నట్టు వర్షధార.

అవేమీ లెక్క చెయ్యకుండా ఓ చేత్తో బాటిల్ అదిమిపట్టి, బురద నేల దాటాక తారురోడ్డుమీద కెక్కించాను సైకిల్‌ని. వర్షంలో రోడ్డుగూడా సరిగ్గా కనిపించడం లేదు. ఐనా, పట్టుదలతో బలంకొద్దీ పెడల్ తొక్కుతూ ముందుకు సాగాను వేగంగా.

కిషన్‌రావుగారి హడావుడికి అర్థం లేకపోలేదు. హజారీమల్ ద్వారా మా షాపుకు ప్రతినెలా మందుల బిల్లు రూపంలో కొన్ని వందలు ముడుతూ వుంటాయి. ఆ ఊళ్ళో పేరుమోసిన ధనవంతుడు హజారీమల్.

డెభ్భై ఏళ్ళు దాటిన మార్వాడి వృద్ధుడు ఖరీదైన రోగాలన్నీ ఖరీదైన మనుషులకే వస్తాయి గనక, ఈ వృద్ధాప్యంలో హజారీమల్ అనేక రోగాలతో బాధపడుతున్నాడు.

ఐనా, ముసలాడిది మొండి ప్రాణమే అనాలి. మూడేళ్ళనించీ మంచానపడ్డా ఇంకా గుటుక్కుమనలేదు, మా మందుల పుణ్యమా అని. ఐతే, ఆ మందులవల్ల అతని రోగాలింకా నయం కాలేదంటే అది వేరే సంగతి!

అతని బాగోగులు చూసుకోడానికి ఒకే ఒక్క మనవడూ, ఆ మనవడి తల్లీ తప్ప మరెవ్వరూ లేరతనికి. పాత

కాలపు మార్వాడీలంటే ధనాన్నే దైవంగా ఎంచి, పిసినారి తనాన్ని పెంచి, సవాలక్ష వ్యాపారాలు చేస్తూ ధనరాసులు పోగుజేసుకుంటే, ఈ నాటి వారి వారసులైన యువ మార్వాడీ కుర్రాళ్ళు కాలానికనుగుణంగా విలాసాలు మరిగి, విచ్చలవిడిగా ఆ ధనరాసుల్ని కరగదీస్తూ కులాసాలు చేసుకుంటున్నారు.

స్వచ్ఛమైన శాకాహార జాతిలో పుట్టినా, మాంసానికీ, మద్యానికీ, మగువకూ స్వేచ్ఛగా దాసులైన మార్వాడీ కుర్రాళ్ళ నెందరినో నేనెరుగుదును. ఆ కోవకే చెందుతాడు హజరీమల్ మనవడు చందూలాల్!

అంతే కాదు, పేకాటలోనూ అతనికి మంచి హస్తవాసి వున్నట్టు వినికిడి. మనవడి నిర్వాకాలు హజారీమల్ కూడా తెలుసేమో, అందుకే తాను బ్రతికుండగా తన పూర్వీకుల సంపాదనను మనవడు తోచినట్టు తగలెయ్యకుండా తగిన కట్టుబాట్లు చేసి, ఆస్తిపాస్తులన్నీ తన గుప్పిట్లోనే పెట్టుకున్నాడట.

ముసలాడు గుటుక్కుమన్నాకే అతని యావదాస్తీ చందూలాల్‌కు చెందుతుందట. అలా అని అందరూ అనుకుంటారు. లోగుట్టు పెరుమాళ్ళకెరుక మరి.

ఎడాపెడా మొహాన కొడుతున్న వర్షపు చినుకుల్ని చీల్చుకుంటూ సైకిల్ తొక్కుతున్నాను. ఆ కొద్ది దూరంలో మార్వాడీ బజార్‌వైపు తిరిగే రోడ్డు మలుపు కానవస్తోంది. ఆ మలుపు తిరిగి, కొద్ది దూరం వెళితే హజారీమల్ యిల్లు వస్తుంది.

నిలువునా తడిసి ముద్దయిపోయానప్పటికే, ముసలాడి మీది జాలికొద్దీ, నా యజమాని మీది భక్తికొద్దీ చలికి గజ

గజ వణుకుతూ గూడా అధైర్యపడకుండా ముందుకు సాగుతున్నాను.

2

అరగంట తరవాత, ఎక్కడా ఆగకుండా తిరిగి షాపు జేరాను.

కౌంటర్ కార్నర్‌వద్ద నిల్చుని, ఫోన్లో యెవరితోనో గట్టిగా మాట్లాడుతున్నారు కిషన్‌రావు. ఆయన మొహంలో యెందుకో భయాందోళనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నన్ను చూడగానే ఆయన కళ్ళు విప్పారాయి. మరుక్షణం కౌంటర్ డెస్కుమీద పెట్టి వున్న ఓ బాటిల్ డబ్బావైపు సైగజేసి, "జయరాం! వెంటనే ఆ మందుసీసా తీసికెళ్ళి హజారీమల్ గారింట్లో ఇచ్చిరా! ఊఁ, త్వరగా వెళ్ళు" అన్నారు ఆరాటం ఉట్టిపడే స్వరంతో.

"సార్.... నేను...." నా మాట పూర్తి కాకముందే అరిచారాయన.

"నా భాష అర్థం కాలేదా నీకు? అరక్షణంగూడా వృధా చెయ్యకుండా ఆ బాటిల్ని హజారీమల్ యింటికి తీసికెళ్ళు. ఇంకా చూస్తూ నిల్చున్నావేం? త్వరగా వెళ్ళమంటుంటే!" అంటూ ఫోన్ రిసీవర్‌వైపు తిరిగి,

"హలో....హలో....అపరేటర్...ఎంత సేపైందయ్యా నెంబరడిగి....ఈ యుగాంతం వరకూ ఇవ్వదలచుకోలేదా ఏం?" అన్నారు పట్టరాని చిరాకుతో.

నేను మరేమీ ఆలోచించలేదు. చటుక్కున కౌంటర్ మీది బాటిల్ డబ్బా అందుకుని వెనుదిరిగాను.

"జయరాం!" పిల్చారాయన.

"సార్?"

"ఇంతకు ముందు నువ్వు తీసికెళ్ళిన మందును హజారీ

షల్‌గారికి తాగించవద్దని చందూలాల్‌తో చెప్పి, ఆ బాటిల్ని వెనక్కి తీసుకురా!"

"ఆ మంచి సీసా...."

"మాటలతో కాలయాపన చెయ్యక! త్వరగా వెళ్ళు!" అరిచారాయన.

ఎన్నడూ లేనిది ప్రళయం ముంచుకొచ్చినట్టు ఈరోజాయన యెందుకలా ఖంగారు పడుతున్నారో అర్థం కాలేదు నాకు. ఈ స్థితిలో నేను చెప్పదలచుకున్నది గనక చెబితే ఆయన ఆగ్రహాన్ని అదుముకోలేక పిచ్చివాడే కావచ్చు.

మళ్ళీ మామూలు స్థితికి వచ్చాకనే నిదానంగా చెప్పడం మంచిది. అనుకుంటూ తిరిగి సైకిల్ యెక్కి శరవేగంతో ముందుకు పోనిచ్చాను. వర్షం ఇంకా అలాగే కురుస్తోంది. నిండా మునిగినవాడికి చలేమిటని అదేమీ లెక్క చెయ్యకుండా సైకిల్ పెడల్‌పై పిక్కబలం చూపసాగాను.

మార్వాడీ బజార్లోకి తిరిగే రోడ్డు మలుపు ఆమడదూరం వుందనగా, రోడ్డు పక్కనే ఉన్న మరో మందుల దుకాణంలో పనిచేసే నౌఖరు కుర్రాడు నా కెదురుగా వస్తూ కనిపించాడు. నన్ను చూడగానే వాడి పెదాలపై యెగతాళి మిళితమైన నవ్వు విచ్చుకుంది.

ఆ ధ్యాసలో వాడు తన ముందున్న స్పీడ్‌బ్రేకర్ని గమనించలేదు. వాడి సైకిల్ ముందుచక్రం ఆ స్పీడ్ బ్రేకర్ మీద పడగానే బ్యాలెన్స్ తప్పి, అడ్డంగా జారింది.

రెప్పపాటులో వాడు సైకిల్‌తో సహా దభీమంటూ నేల కరిచాడు.

నవ్వి—"ఈ వర్షంలో సైకిల్‌ను సరిగ్గా తొక్కడం నీ తరం కాదుకదా, మరెవరితరం కాదురా సన్నాసీ! ఓ కారు కొనుక్కో!" అన్నాను వాడికి వినిపించేలా గట్టిగా.

దానికి వాడూ ఏదో జవాబిచ్చాడు గానీ, వర్షపు హోరులో సరిగ్గా వినిపించలేదు నాకు.

ఎట్టకేలకు మార్వాడీ బజార్లో ప్రవేశించి, హజారీమల్ ఇంటి ముందు ఆపాను సైకిల్. అప్పటికే నాతోబాటు చేతిలో వున్న ఆ మందు బాటిల్ డబ్బాగూడా బాగా నాని పోయింది వర్షానికి.

మూసి వున్న తలుపు బాదాను గట్టిగా.

రెండు నిముషాల తరవాత తెరుచుకుంది.

హజారీమల్ మనవడు చందూలాల్ నన్ను చూడగానే గుడ్లెర్రజేశాడు. "ఇప్పుడా రావడం ఫోన్‌చేసి యెంత సేపైంది? కిషన్రావ్‌తో చెబుతానుండు!"

నాలాగే పద్దెనిమిదీ, పందొమ్మిదేళ్ళుంటా యతనికి. ఐతే, నాకన్నా పొడుగ్గా, తెల్లగా, ఆరోగ్యంగా వుంటాడు. పాతకాలపు మార్వాడీల్లా గ్లాస్కో పంచె తెల్ల చొక్కా, నుదుటిపై ఎర్రని బొట్టు చారా, తలపై పిలకజుట్టుకు బదులు, బెల్‌బాటం పాంటూ, డిస్కో షర్టూ, హిప్పీ జులపాలతో కనిపిస్తాడు.

"బైట భారీ వర్షం పడుతోంది. సైకిల్ సరిగ్గా తొక్కలేక పోయాను" నసుగుతూ అందించా నతనికి బాటిల్ డబ్బా.

"అదంతా నాకు తెలీదు!" అంటూ విసురుగా తలుపు మూశాడతను.

నేను వెంటనే వెనక్కి తగ్గకుంటే, ఆ విసురుకు నా ముక్కు బద్దలయ్యేదే! వర్షంలో తడుస్తూ నిలబడ్డ నన్ను మర్యాదకోసమైనా ఇంట్లోకి రమ్మనకుండా, అలా ప్రవర్తించాడంటే. అందులో అతని తప్పేం లేదు.

నాబోటి బడుగుప్రాణుల పట్ల అటువంటి గొప్పవాళ్ళకు అలా ప్రవర్తించే హక్కుంది మరి। వెనుదిరిగాను నిట్టూరుస్తూ.

★

చచ్చీ చెడీ తిరిగి షాపు జేరేసరికి బాగా దప్పిపోయినట్టు తోచింది. లోపల యింకా ఆందోళనావస్థలో కాలుగాలిన పిల్లిలా పచార్లు జేస్తున్నారు కిషన్‌రావుగారు. మెట్ల దగ్గిర సైకిల్‌కి స్టాండువేసి. లోనికి నడిచి, అంతవరకూ నా మనసులో ముల్లులా గుచ్చుకుంటున్న విషయాన్ని ఆయనతో చెప్పడానికి నోరు తెరిచాను.

నా నోట్లోంచి మాట బైటకు రాకముందే ఆయన చిరాకుగా, "ఇక నీ పని చూసుకో" అంటూ ఆయన తిరిగి పచార్లలో మునిగిపోయారు.

నేను చెప్పదలచుకున్న విషయాన్ని వినడానికి ఆయన మూడ్ బావుండటం చాలా అవసరం। లేకుంటే నా దుంప తెగే ప్రమాదముంది.

ఆయనింతగా యెందుకు ఆందోళన పడుతున్నారో ఓపట్టాన అర్థంకావడంలేదు. కనీసం తాను తెమ్మన్న మందు సీసా వాపసు తెచ్చావా అని కూడా అడక్కపోవడం చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది నాకు.

అవన్నీ నా కెందుకులెమ్మని అవసరం లేకున్నా మౌనంగా ఓ తుండుగుడ్డతో బీరువాల అద్దాలు తుడవసాగాను. ఆయన వాలకం చూస్తోంటే ముంచుకురాబోతున్న యేదో తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కోడానికి సిద్ధపడుతున్నట్టే అనిపిస్తోంది. ఏమిటా ప్రమాదం?

సుమారు నాలుగ్గంటల ప్రాంతంలో ఓ జీపు వచ్చి షాపు ముందాగింది. అప్పటికి వర్షం కాస్త పల్చబడి, తుంపరగా

పడుతోంది. ఆ జీపు విండ్‌స్క్రీన్ కింద భాగాన తెల్ల పెయింట్‌తో రాసివున్న పెద్దపెద్ద అక్షరాలు చూడగానే నా కళ్ళు పెద్దవయ్యాయి.

పోలీస్!

బహుశా ఏ మందులో మాకులో కొనడానికి వచ్చినట్టు న్నారు. కిషన్‌రావుగారు కొద్ది నిమిషాల క్రితమే పచార్లతో అలసిపోయి. కాళ్ళకు కాస్త విశ్రాంతి యివ్వడానికి లోపలి గదిలో కెళ్ళారు.

ఆ జీపులోంచి ముందు ఓ ఇన్‌స్పెక్టర్ దిగాడు. అతని వెనకే ఓ సార్జంట్, ఇద్దరు కానిస్టేబుళ్ళు దిగారు. అంత వరకూ బాగానే వుంది. ఐతే, ఆ తరవాత దిగిన యువకుణ్ణి చూపి నా కళ్ళు మళ్ళీ పెద్దవయ్యాయి ఆశ్చర్యంతో!

అతనెవరో కాదు.

చందూలాల్!

హజరీమల్ మనవడు!!

అందరూ గబగబ మెట్లెక్కి షాపులోకి దూరారు.

"కిషన్రావ్ ఎక్కడ?" ఇన్‌స్పెక్టర్ కంఠం కంచులా మోగింది.

"లోపలున్నారు. పిలుస్తానుండండి" అంటూ వెనుదిరగ బోయాను.

సరిగ్గా అదే సమయంలో ఆయనే హడావుడిగా ఇవత లికి వచ్చి, పోలీసుల్ని చూసి కొయ్యబారిపోయారు. మొత్తానికేదో తీవ్రవిషయమే అయుండా లనిపించింది నాకు.

చందూలాల్ వేలితో విసురుగా ఆయన్ని చూపుతూ, "ఇన్‌స్పెక్టర్‌గారూ! ఇతనే....ఇతనే మా తాతయ్య మర ణానికి కారకుడు!" అన్నాడు.

నివ్వెరబోతూ కిషన్‌రావుగారి వైపు చూశాను. ఆ ఆరో

పణ విన్నాక ఆయన కాళ్ళు వణికి, సరిగ్గా నిల్చోలేక కౌంటర్ డెస్కును పట్టుకున్నాడు. ఆ వెంటనే ఆయన మొహం పాలిపోయింది తేలిగ్గా! ఒక మనిషి మొహం అంత త్వరగా తెల్లబడటం అదివరకు నేనెప్పుడూ చూళ్ళేదు. ఊపిరి కూడా ఇప్పుడాగుతుందో, అప్పుడాగుతుందో అన్నట్టు పీలుస్తున్నారు ఉబ్బసం రోగిలా!

మొదటినించీ ఆయనపట్ల చాలా గౌరవం వుంది. మంచి మనిషి. దయామయుడు. ఎన్నోసార్లు నాకు సహాయం చేసాడు. అందుకే, జీతం సరిపోకున్నా ఆయన మీది భక్తి కొద్దీ గత నాలుగేళ్ళుగా ఆ షాపు వదలకుండా పని జేస్తున్నాను.

అటువంటి వుత్తముడి నెత్తిన అలాంటి అమానుష నేరం మోపినందుకు ఆ నీచుడి మొహాన్ని పిడిగుద్దులతో పచ్చడి చెయ్యాలన్నంత కోపం వచ్చింది నాకు. ఐనా తమాయించుకుని. వారి మాటలు వింటూ నిల్చున్నాను.

ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావుగారి వైపు చూస్తూ, "మధ్యాహ్నం పన్నెండు గంటల ప్రాంతంలో ఈ చందూలాల్ నీకు ఫోను జేశాడా?" అడిగాడు.

"ఔను!" నూతిలోంచి పలికినట్టు వినిపించింది ఆయన కంఠం.

"ఎందుకు చేశాడు?"

"తన తాత పరిస్థితి బాగులేదనీ, వెంటనే ఓ పిర్టోలిన్ మందు సీసా పంపమనీ చెప్పారు!"

"ఆ మందుకు ఇంతకుముందు కూడా వీరు తీసుకెళ్ళేవారా? లేక ఇదే మొదటి సారా?"

"ఇంతకు ముందు అనేకసార్లు తీసికెళ్ళారు."

"ఇతను ఫోన్ చెయ్యగానే నువ్వా మందు పంపావా?"

కిషన్‌రావుగారు జవాబిచ్చే లోపలే చందూలాల్ అందుకున్నాడు. "ఆ మందు పంపలేదు! దానికిబదులు పెర్తోలిన్ సీసా పంపాడు. అది మా తాత జబ్బుకూ, శరీరానికీ ఏ మాత్రం సరిపోదని తెలిసీ, ఆయన్ని చంపాలనే వుద్దేశంతో...."

ఆ మాటవినగానే ఆశ్చర్యంతో నా కళ్ళు పెద్దవయ్యాయి.

తలూపారు కిషన్‌రావు. "పెర్తోలిన్ బాటిల్ పంపిన మాట నిజమే! ఐతే, మీ తాతయ్యను చంపాలనే ఉద్దేశంతో మాత్రం కాదు! తొందర్లో నావల్ల పొరపాటు జరిగిపోయింది.

ఎప్పుడైతే మీరు ఫోన్లో మీ తాతయ్య పరిస్థితి గురించి ఖంగారు వ్యక్తం చేశారో, అది విని, నేను ఆందోళన పడ్డాను. ఆ హడావుడిలో నా కాలూ, చెయ్యీ ఆడలేదు. మందుల బీరువాలోంచి పిర్టోలిన్ బాటిల్ డబ్బా తియ్యడానికి బదులు, దాని చేరువలోనే వున్న పెర్తోలిన్ బాటిల్ డబ్బాతీసి, వెంటనే మీ ఇంట్లో యిచ్చి రమ్మని నౌఖర్ని పంపించాను.

ఆ మందుల పేర్లూ, లేబిళ్ళూ, పేకింగ్గూ దాదాపు ఒకే విధంగా, ఒకే రంగుల్లో వుంటాయి గనక తొందర్లో పొరపాటు జరిగిపోయింది. చూడండి, మీకే తెలుస్తుంది" అంటూ బీరువాలోంచి ఆ రెండు రకాల బాటిల్ డబ్బాలు తీసి వారి ముందుంచారు.

ఇన్‌స్పెక్టర్ కాసేపు వాటిని పరిశీలించి, "పొరపాటో, గ్రహపాటో! నువ్వు పంపిన మందు తాగడంవల్లే హజారీమల్‌గారు అంతిమ శ్వాస వదిలారు. ఆ మందులో అయొడిన్ వుంటుంది. అంతేకాదు, దాని శాతం కూడా ఎక్కువే వుంటుంది.

హజారీమల్‌గారి జబ్బుకు చెయ్యవలసిన వైద్యంలో అసలు అయొడిన్ లేని మందుల్నే వాడటం జరుగుతోందిట. అయొడిన్ మిశ్రమై వున్న ఏ మందు సేవించినా, ఆయన నాడీమండలం దెబ్బతిని, మరణం సంభవిస్తుంది.

నీ నిర్లక్ష్యం వల్లే ఆయన మరణించారు. మందుల షాపుల వారికి లైసెన్సులు ఇచ్చేముందు వైద్యంలో వారికి కంపౌండర్ స్థాయి పరిజ్ఞానం వున్నట్టు సర్టిఫై జరిగాకే లైసెన్సులు మంజూరు చేస్తుంది ప్రభుత్వం!

ఏ రోగికి ఏ మందునివ్వాలో, ఏవి ఇవ్వకూడదో తెలిసి కూడా నువ్వు నిర్లక్ష్యం చేశావు. పైగా ఆయన నీ పాత కస్టమర్. ఆయన నిరంతరం ఏ మందులు వాడతారో నీకు బాగా తెలుసు.

చట్ట ప్రకారం నీ మీద క్రిమినల్ కేసు బుక్ చెయ్యక తప్పదు ఇకముందు ఇలాంటి దుర్ఘటనలు జరక్కుండా నీ లైసెన్సు రద్దు చేయించక తప్పదు. చేసిన తప్పుకు కొన్నేళ్ళు జైలుకు పంపక తప్పదు'' అన్నాడు కటువుగా.

కిషన్‌రావుగారు మొహం పీక్కుపోయింది. "ఎప్పుడైతే హడావుడిలో నేనా బాటిల్ని నౌఖరుచేత పంపించానో ఆ తరవాత అనుకోకుండా నా దృష్టి అల్మైరాలో వరసగా పేర్చివున్న పెర్తోలిన్. పెర్టోలిన్‌బాటిల్స్ డబ్బాలమీద పడింది.

పెర్తోలిన్ వరసలో ఖాళీగా వున్న ప్లేస్ చూడగానే జరిగిన పొరపాటు తెలిసివచ్చింది నాకు. ఆలోగా సైకిలుమీద వెళ్ళిన జయరాం ఆ బాటిల్ని హజారీమల్ గారింట్లో ఇచ్చివుంటాడనీ, అది ఆయనచేత తాగించక ముందే ఫోన్‌జేసి చెప్పాలనీ వెంటనే ఎక్స్ఛేంజి ఆపరేటర్ని వారి ఇంటి నెంబర్ ఇవ్వమని అడిగాను.

అదే సమయంలో జయరాం తిరిగి వచ్చాడు. వెంటనే అతనిచేత పిర్టోలిన్ మందు సీసా పంపుతూ, అంతకు ముందు తీసికెళ్ళిన మందును హజారీమల్‌గారికి తాగించ వద్దని వారి ఇంట్లో చెప్పమనీ, దాన్ని వెనక్కి తీసుకు రమ్మని చెప్పి పంపాను.

ఆ తరవాత ఎక్స్ఛేంజి నించి ఆ ఇంటి నెంబర్ దొరి కింది నాకు. అవతల చందూలాల్‌గారే ఎత్తారు రిసీవర్. చెప్పానాయనకు జరిగిన పొరపాటు. ఐతే, నిమిషం క్రితమే తను హజారీమల్‌గారికి మందు తాగించాననీ, ఇప్పుడేం చెయ్యాలనీ ఖంగారు వ్యక్తం చేశాడు.

భయంతో నా నవనాడులన్నీ కృంగిపోయాయి. తక్షణం డాక్టర్ని పిలిపించి, ఆయన్ని కాపాడమని చెప్పి రిసీవర్ పెట్టేశాను'' అన్నారు నిర్జీవంగా.

''నువ్వు చెప్పినట్టే డాక్టర్‌కు ఫోను జేశాను. ఐతే, అప్పటికే తాతయ్య చెప్పలేని బాధ అనుభవించి కన్ను మూశాడు. నీ మీది నమ్మకంతో హడావుడిలో నేనూ ఆ బాటిల్ని అంత పరీక్షగా చూడలేదు. ముందే బాగా నీర సించి వున్న ఆయన శరీరం ఆ తప్పుడు మందుకు తట్టుకో లేకపోయింది. ఆయన లాగే నువ్వూ యిప్పుడు నరక యాతన అనుభవించక తప్పదు'' అన్నాడు చందూలాల్ పళ్ళు నూరుతూ.

''సార్జంట్! అరెస్ట్ హిమ్!'' అన్నాడు ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావ్‌గార్ని చూపుతూ.

సార్జంట్ నడుంమీది బెల్టుకు వేలాడుతున్న బేడీలు తీపి అడుగు ముందుకు వేశాడు.

''ఆగండి!'' అన్నాను హఠాత్తుగా.

అంతవరకూ కిషన్‌రావుగారికి చెప్పాలనుకుంటూ,

ఆయన మూడ్ బాగులేక చెప్పకుండా మనసులో దాచుకున్న విషయాన్ని ఇక చెప్పక తప్పదు. అది చెప్పకుండా ఒక్క-క్షణం కూడా నేను ఆలస్యం చేశానంటే అసలు హంతకుడు తప్పించుకుని, కిషన్‌రావు వంటి నిర్దోషిమీద హత్యాభియోగం నిలబడుతుంది!

నా కంఠం విని, అందరూ నా వైపు చూశారు ఆశ్చర్యంగా!

"పానకంలో పుడకలా నువ్వేమిటి మధ్యలో?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కళ్ళెర్ర జేస్తూ.

చెప్పసాగాను....సుమారు పది నిమిషాలు పట్టింది నా మాట పూర్తి కావటానికి. అది విన్న మరుక్షణం అంత వరకూ నీరసంగా, కళావిహీనంగా వున్న కిషన్‌రావుగారి మొహంలో మళ్ళీ జీవకళ తొణికిసలాడింది.

ఒక్క-వుదుటున నన్ను సమీపించి, అమాంతం వాటేసుకున్నారు. "జయా! జయా! నిజంగా నువ్వు నా పాలిటి జయరాముడివేరా! జైలు కటకటాల నించీ, ఆజన్మాంతం మాయని అపవాదునించీ నన్ను కాపాడావురా!" అన్నారు భావోద్వేగంతో.

"మంచి మనసుగలవారి నెప్పుడూ భగవంతుడన్యాయం చెయ్యడు సార్! మిమ్మల్ని నేను కాదు, మీ మంచితనమే కాపాడింది" అన్నాను నమ్రతగా.

ఇన్‌స్పెక్టర్, సార్జంట్ క్షణంపాటు ఒకర్నొకరు చూసుకున్నారు. తరవాత కళ్ళు తిప్పి చందూలాల్ వైపు చూడసాగారు తదేకంగా.

ఆ సంగతేమిటా అని మీరంతా ఆశ్చర్యపోతున్నారు కదూ?

కిషన్‌రావుగారు మొదటిసారి హజారీమల్ ఇంట్లో ఇచ్చి

రమ్మని నాకిచ్చి పంపిన పెర్తోలిన్. అంటే హజారీమల్ కవసరం లేని మందుసీసాను సైకిలుమీద తీసికెళ్తూ, ఆ కుండపోత వర్షంలో మార్వాడీ బజార్ రోడ్డు మలుపు తిరుగుతుండగా ఓ జీపు ఎదురైంది నాకు.

దాన్ని తప్పించుకోడానికి సైకిల్ని తారురోడ్డు మీంచి పక్కకు దింపాను. ఆ దింపడంలో ముందు టైర్ జారి. సైకిలుతోసహా అమాంతం కిందపడ్డాను. దాంతో రెండు చేతులూ రోడ్డుకు గుద్దుకుని, ఆ బాటిల్ కాస్తా పగిలిపోయింది.

దాంతో, హజారీమల్ ఇంటికెళ్ళకుండా అక్కణ్ణించే వెనుదిరిగి, షాపు కొచ్చేశాను. ఆ సంఘటన గురించి కిషన్‌రావుగారికి చెబుదామని ఎంత ప్రయత్నించినా ఆయన చెప్పనివ్వకుండా మరో బాటిలు తీసికెళ్ళి హజారీమల్ ఇంట్లో ఇచ్చిరమ్మని తొందరపెట్టారు.

నా చేతిలో పగిలిపోయిన ఆ తప్పుడు మందు తాగకుండానే హజారీమల్ ఎలా చచ్చాడు? దీన్నిబట్టి ఈ నాటకమంతా ఆయన మనవడిదేనని అర్థం కావడంలేదూ? విలాసాలు మరిగిన చందూలాల్ తాత మరణం కోసం ఎంతో కాలం నించి ఎదురు చూస్తున్నాడు. ఐనా, ఆ మొండిప్రాణి చావడంలేదు.

ఇక లాభం లేదని. తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నాడు చందూలాల్.

ఎప్పుడైతే కిషన్‌రావు అతనికి ఫోనుచేసి, తాను పొరపాటున పెర్తోలిన్ బాటిలు పంపాననీ, దాన్ని తాతయ్యకు తాగించవద్దనీ చెప్పారో, అదే మంచి అదనుగా ఎంచి, వెంటనే మరో షాపు నుంచి పెర్తోలిన్ మందును తెప్పించి తాతకు తాగించాడు.

ఐతే, విధివశాత్తూ అతని పథకం తారుమారైపోయింది!

ఇన్‌స్పెక్టర్ నా వైపు చూసి, "నువ్వు చెప్పేది నిజమే నని నమ్మడానికి ఏమిటి ఋజువు?" అడిగాడు.

"పదండి. ఆ సీసా పగిలిన చోటు చూపిస్తాను మీకు. దాని ముక్కలు ఇంకా అక్కడే వుండి వుంటాయి" అన్నాను ఆత్మవిశ్వాసంతో.

నన్నూ కిషన్‌రావుగార్నీ, చందూలాల్‌ని జీపులో ఎక్కించుకుని బైలుదేరారు వాళ్ళు.

రోడ్డు మలుపులో జీపు ఆపించి చూపాను.

రోడ్డు పక్కన సైకిలు టైర్ జారిన గుర్తూ, దాని పక్కనే మందు సీసా ముక్కలూ, వర్షంలో నానిన దాని అట్టపెట్టే ఇంకా అలాగే పడున్నాయక్కడ.

కానిస్టేబుళ్ళతో ఆ ముక్కల్ని సేకరించి, మమ్మల్ని షాపు దగ్గర దింపి, చందూలాల్ చేతులకు బేడీలు వేసి, తీసుకుపోయాడు ఇన్‌స్పెక్టర్. □

బోర్డు నిజమవౌతుందా?



సిగరెట్ లైటర్

ప్రతాప రవిశంకర్

శ్యామలరావు వట్టి అనుమానం మనిషి. అతడికి యెప్పుడయినా ఏదయిదా అనుమానం వచ్చిందంటే దాన్ని తీర్చుకునే వరకు అతడు నిద్రపోడు.

అందుకనే అతడు బెడ్ మీద పడుకున్నవాడల్లా మళ్ళీ లేచి కూర్చున్నాడు. భార్య సుమతిని కూడా నిద్ర లేపుదామనే అనుకున్నాడు. కాని ఆమె గాఢనిద్రలో వుండటం

వల్ల డిస్టర్బ్ చెయ్యదల్చుకోలేదు.

మంచి నిద్రలో లేపితే సుమతి విసుక్కుంటుంది.

చెవులు రిక్కించాడు శ్యామలరావు.

మళ్ళీ ఎవరో గేటు తెరిచిన చప్పుడు అయ్యింది.

విల్చున్నాడు అతను.

పది నిముషాల క్రితం శ్యామలరావుకు వున్నట్టుండి హఠాత్తుగా మెలకువ వచ్చింది. ఎవరో గేటును తెరిచిన చప్పుడు కిర్రుమని వినిపించింది. అప్పుడే అతను నిద్రలేచి బెడ్ మీద కూర్చుని కొంచెం సేపటి వరకూ ఎటువంటి శబ్దమూ వినిపించకపోవడంతో మళ్ళీ పడుకున్నాడు.

కాని—మరోసారి గేటును ఎవరో తెరిచిన చప్పుడు అతడికి వినిపించింది.

విల్చుని టేబులుమీద గడియారాన్ని చూశాడు.

ఒంటిగంట కావస్తోంది.

తలుపులు తెరుచుకుని బయటకు వచ్చాడు. మసక చీకటిగా వున్నది.

ఇంటి దగ్గర్నుంచి గేటు వరకూ అటూ ఇటూ వున్న పూల మొక్కలు రివ్వున వీస్తున్న చల్లని గాలికి తలలు వూపుతున్నాయి.

శ్యామలరావు దృష్టి గేటుమీద పడింది. అది సగం వరకు తెరచివున్నది. అతడు ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

సందేహంలేదు. ఎవరో గేటు తెరిచి తన కాంపౌండ్‌లో ప్రవేశించారు?

ఎవరు?

దొంగా?!

శ్యామలరావు కొంచెం ధైర్యస్థుడే. అందుకే వరం

డాలో నించి కిందికి వెళ్ళాడు. చిన్నగా నడిచి గేటువరకూ వెళ్ళాడు.

గేటు దాటి బయటకు వచ్చాడు.

నిర్మానుష్యంగా వుంది రోడ్డు. దూరంగా వీధిదీపం గుడ్డిగా వెలుగుతోంది.

రెండు నిముషాలు అక్కడే నించుని లోపలకు వచ్చి గేటు మూసి వెనక్కి తిరిగాడు.

అప్పుడే షాక్ కొట్టినట్టు వులిక్కిపడ్డాడు. అతని ఒళ్లు జలదరించింది.

పూల మొక్కల మధ్య నించి రెండు కాళ్ళు బయటకు కనిపడుతున్నాయి. క్షణం తర్వాత అతను అక్కడికి నడిచాడు.

దూరం నించి పడుతున్న దీపం వెలుగులో శ్యామల రావుకు ఆ పూలమొక్కల మధ్య వెల్లకింతలా పడివున్న ఓ మనిషి శవం కనిపించింది.

గుండెల్లో పిడివరకు దిగివున్నది కత్తి నెత్తురు ఇంకా అతడి గుండెల్లో నించి బయటకు కారుతోంది. తెల్లని బట్టలు వేసుకున్నాడు అతను. ముప్పయి అయిదేళ్ళ వయసు వుండొచ్చు. పాదాలకు నల్లని బూట్లు వున్నాయి.

కొంచెంసేపు శ్యామలరావుకు ఒళ్ళు చల్లబడినట్లు అనిపించింది. అతను యెప్పుడూ హత్య చెయ్యబడిన మనిషిని చూడలేదు. అలాంటిది ఇప్పుడు ఓ మనిషి తన ఇంటి కాంపౌండ్‌లోనే హత్య చెయ్యబడ్డాడు.

ఈ విషయం పోలీసులకు తెలిపిందంటే?

అతడి గుండె దడదడా కొట్టుకున్నది.

ఆ తర్వాత అతను నిమిషం కూడా ఆలస్యం చెయ్యలేదు.

గబగబా యింట్లోకి వెళ్ళి భార్య సుమతిని నిద్ర లేపాడు:

ఆమె విసుక్కుంటూ "ఇప్పుడేం కొంప మునిగింది. బంగారంలాంటి నిద్ర చెడగొట్టారు" అన్నది.

"నిజంగానే కొంప మునిగింది" అంటూ శ్యామలరావు తోటలో శవం గురించి ఆమెకు చిన్నగా చెప్పాడు.

ఆ వార్త వినగానే అదిరిపడింది. ఆమె శరీరం చిన్నగా వణికింది! కళ్ళు భయంతో పెద్దవైనాయి.

"ఇప్పుడు భయపడి ప్రయోజనంలేదు. ముందు మనం ఆ శవాన్ని మన ఇంటిముందునించి తీసి బయట పారెయ్యాలి. లేకపోతే మనిద్దరం జైల్లో చదరంగం ఆడుకోవలసి వుంటుంది" అన్నాడతను.

"నాకు భయంగా వుంది" అన్నది సుమతి.

"నాకూ్కడా భయంగానే వుంది....ఐనా తప్పదు.... ముందు బయటకు నడు...." అని భార్యను తొందర చేశాడు.

ఇద్దరూ తలుపులు మూసి శవం దగ్గరకు వచ్చారు. శవాన్ని చూడటంతోనే కెవ్వున అరవబోయింది సుమతి.

గబుక్కున శ్యామలరావు ఆమె నోరు మూసి "అరవకు....మనకే ప్రమాదం...." అని హెచ్చరించాడు.

ఆమె నోరు మూసుకున్నది.

గేటుతెరిచి వుంచాడు అతను. తర్వాత ఆ శవాన్ని రెండువైపులా పట్టుకున్నారు.

సుమతి కాళ్ళవైపు పట్టుకున్నది. అతను తలవైపు పట్టుకున్నాడు.

చిన్నగా బయటకు తీసుకువచ్చారు శవాన్ని....అక్కడికి దగ్గర్లోనే ఓ మున్సిపాలిటీ చెత్తకుండీ వున్నది.

శవాన్ని ఆ కుండీ పక్కనే పడేసి గబ గబా వచ్చే శారు....

సుమతి ఆయాసపడిపోయింది అంత బరువును మోసి నందుకు.

దొడ్లో ఒక మూల గునపంతో తవ్వి ఆ మట్టిని తీసుకు వచ్చి శవం పడివున్న ప్రదేశంలో నెత్తురుమీద పోశారు ఇద్దరూ.

శవాన్ని తీసుకువెళుతున్నప్పుడు దారి పొడుగునా పడిన నెత్తురుబొట్లను చెరిపివేశాడు శ్యామలరావు.

అంతా సవ్యంగా జరిగిందని అనుకున్న తర్వాత గట్టిగా గాలి పీల్చుకున్నారు దంపతులు.

తలుపులు మూసి ఇద్దరూ పడుకోలేదు. బెడ్ మీద కూర్చున్నారు.

"ఇంతకీ ఆ శవం యెవరిదై వుంటుంది" అన్నాడు శ్యామలరావు.

"అతడిని చూస్తుంటే దొంగలా అనిపించటంలేదు. అయినా దొంగను హత్యచెయ్యవలసిన అవసరం ఎవరికి వుంటుంది?" అన్నది సుమతి.

"ఏమో! మన ప్రాణానికి వచ్చింది. వాళ్ళెవరో అతడిని మన ఇంటిముందు హత్యచేశారు. ఈ హత్యలో మనల్ని యిరికించాలని యెవరూ అనుకోలేదు కదా" అనుమానం వెలిబుచ్చాడు.

ఆమె వులిక్కిపడి "మీ కెవరైనా అంతటి శత్రువులు వున్నారా?" అన్నది.

"లేరు....అదే నా ధైర్యం."

"ఇక ఆ విషయం గురించి మరచిపొండి. నాకు ఇప్ప టికీ గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నట్టే వున్నది" అంది

సుమతి గుండెలమీద చెయ్యి వేసుకుని.

"రేపు వుదయం పోలీసులు వచ్చి మనల్ని ఏవయినా ప్రశ్నలు అడగొచ్చు. అసలు మనకేమీ తెలియదని చెప్పాలి. జాగ్రత్తగా నటించు. పోలీసులకు ఏ మాత్రం అనుమానం వచ్చినా మనల్ని వదలిపెట్టరు" అని భార్యకు ఎలా మాట్లాడ వలసిందీ చెప్పాడు.

సరేనన్నది సుమతి.

మూడు గంటలు కావస్తున్నదు యిద్దరూ పడుకొన్నారు.

2

"ఈ సిగరెట్ లైటర్ మీదే కదూ?" ఇన్‌స్పెక్టర్ మహేంద్ర అడిగాడు.

కర్చీఫ్‌లోనించి బయటకు కనిపిస్తున్న ఎరుపు రంగు సిగరెట్ లైటర్‌ని చూడగానే శ్యామలరావు మొహం పాలి పోయింది.

అతడి కాళ్ళు చేతులు వణికాయి.

"చెప్పండి....మీదే కదూ?"

"నాది కాదు...." అన్నాడు వెంటనే.

మహేంద్ర నవ్వి "మీది కాదన్నంత మాత్రాన మిమ్మల్ని వదిలిపెట్టను. కుండీ పక్కనేవున్న శవం దగ్గర దొరికింది ఇది. ఈ లైటర్ మీదేనని అక్కడ పోగయిన మనుషుల్లో యెవరో చెప్పారు. అందుకే యిక్కడికి వచ్చాను....నిజం చెప్పండి....ఇది మీదే కదూ" అన్నాడు మళ్ళీ.

"నిజంగానే నాదికాదు...." అన్నాడు శ్యామలరావు.

"ఐతే మీ లైటర్ చూపించండి."

శ్యామలరావు తన గదిలోకి వెళ్ళి అలమార్లోనించి ఓ ఎరుపురంగు సిగరెట్ లైటర్ తీసుకువచ్చి ఇన్‌స్పెక్టర్‌కి

ఇచ్చాడు.

ఇదంతా చూస్తున్న సుమతి భయంతో బిగుసుకు పోయింది

"నేను అమాయకుడిని కాదు....అసాధ్యుడిని. ఈ లైటర్‌మీద వేలిముద్రలు వున్నాయి. వాటిని మా వేలిముద్రల నిపుణుడు తీసుకున్నాడు. మీ వేలిముద్రలు కూడా తీసుకుంటాను. రెండూ పోల్చిచూస్తే శవం దగ్గర దొరికిన లైటర్ మీదో కాదో సులభంగా తెలిపోతుంది...." అన్నాడు.

'ఇక దొరికిపోయినట్లే' అనుకున్నాడు శ్యామలరావు.

అప్పటికప్పుడే ఇన్‌స్పెక్టర్ వేలిముద్రల నిపుణుడిని పిలిపించి శ్యామలరావు వేలిముద్రలను తీసుకోమని చెప్పాడు.

ఆ తర్వాత మహేంద్ర శ్యామలరావును—సుమతిని కొన్ని ప్రశ్నలు అడిగాడు. అన్నింటికీ తనకేమీ తెలియదని చెప్పింది సుమతి.

ఆమె కంగారు ఇన్‌స్పెక్టర్‌లో అనుమానాన్ని కలిగించింది. అయినా అతను బయటపడకుండా "ఒక గంటలో నేను తిరిగివస్తాను. అప్పటివరకూ మీ రిద్దరూ ఎక్కడికీ కదలకూడదు" అని ఓ కానిస్టేబుల్‌ని ఆ ఇంటిదగ్గర కాపలా వుంచి వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టర్.

అతను వెళ్ళగానే "మనిద్దరం జైల్లో చదరంగం ఆడుకోక తప్పదు" అన్నాడు శ్యామలరావు.

"తప్పదంటారా?" అన్నది సుమతి కన్నీళ్ళతో.

"అవును. ఆ లైటర్‌మీద నా వేలిముద్రలు వుంటాయి. అంతేకాదు ఆ శవం మెడమీద కూడా నా వేలిముద్రలు వుంటాయి. వాటి ఆధారంగా ఆ హత్యను మనమే చేశామని పోలీసులు నిర్ణయిస్తారు" అన్నాడు.

"ఇంతకీ మీ సిగరెట్ లైటర్ అక్కడ పడిపోవటం మీరు చూడలేదా?"

"అదే నాకూ ఆశ్చర్యంగా వున్నది. శవాన్ని మనం మోసుకుపోయేటప్పుడు నా జేబులో సిగరెట్ లైటర్ వున్న గుర్తులేదు. కాని నా లైటర్ శవందగ్గర దొరికింది. పైగా ఆ లైటర్ నాదేనని ఆ గుంపులో ఎవరో ఇన్స్పెక్టర్‌కి చెప్పారుట. ఇన్స్పెక్టర్ నిజంగానే అసాధ్యుడు. మీ తమ్ముడికని తెప్పించిన ఆ రెండో లైటర్ చూపించినా నన్ను వదలిపెట్టలేదు."

"బాగా గుర్తుచేసుకోండి. ఆ సిగరెట్ లైటర్ శవాన్ని మోసుకెళ్ళినప్పుడు మీ జేబులో లేకపోతే అక్కడికి ఎలా వచ్చింది? ఆ లైటర్ మీదేనని అంత ఖచ్చితంగా ఇన్స్పెక్టర్‌తో ఎవరు చెప్పగలిగారు? ఆ సిగరెట్ లైటర్‌మీదే మనం ఈ ప్రమాదంనించి బయటపడటం ఆధారపడివుంది" అన్నది సుమతి.

పదినిముషాలు ఆలోచించిన తర్వాత శ్యామలరావు సంతోషంగా "అవును గుర్తుకు వచ్చింది. అవును. అలాగే జరిగివుంటుంది. థాంక్స్ సుమతీ" అన్నాడు.

3

పోలీసు స్టేషన్లో—

హత్య చెయ్యబడిన మనిషి పేరు సతీష్ అని తెలిసింది. అతనో ఫోటోగ్రాఫర్.

సిగరెట్ లైటర్‌మీది వేలిముద్రలు శ్యామలరావు వేలిముద్రలతో సరిపోయాయి. అంతేకాదు శవం మెడమీద వేలిముద్రలు కూడా శ్యామలరావువే నని తెలిసిపోయింది ఇన్స్పెక్టర్‌కి. అయితే శవం గుండెల్లో దిగబడిన కత్తిపిడి మీది వేలిముద్రలు శ్యామలరావువి కావు. మరో మనిషివి.

ఈ విషయం దగ్గరే ఇన్‌స్పెక్టర్ మహేంద్ర కొంచెం తికమకపడ్డాడు. ఏమయినా ఈ హత్యతో శ్యామలరావుకు తప్పకుండా సంబంధం వున్నది కాబట్టి అతడిని పట్టుకుని బెదిరిస్తే అన్ని విషయాలూ బయటపడుతాయని అతని కోసం వెళ్ళటానికి స్టేషన్‌లోంచి బయటికొచ్చాడు.

అతను బయటకు వస్తున్నప్పుడే రెండు రిక్షాల్లోనించి దిగుతున్న శ్యామలరావు అతడి భార్య సుమతి—వాళ్ళకు కాపలాగా వుంచిన కానిస్టేబులు కనిపించారు.

శ్యామలరావు లోపలకు వస్తూనే ఇన్‌స్పెక్టర్‌తో తోటలో పడివున్న ఆ శవం గురించి—దాన్ని తను—సుమతి తీసుకువెళ్ళి కుండీ పక్కనే పడెయ్యటం గురించి చెప్పి ఆ లైటర్‌ని తను యెక్కడ మరిచిపోయిందీ—అది ఆ కుండీ దగ్గరకు—శవం పక్కకు ఎలా వచ్చివుంటుంది చెప్పేశాడు.

అతను అంతా నిజమే చెప్పాడనే నమ్మకం కుదరగానే ఇన్‌స్పెక్టర్ మహేంద్ర క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా హత్య చెయ్యబడిన సతీష్ గదికి ఇద్దరు కానిస్టేబుల్స్‌తో వెళ్ళాడు

తాళాన్ని బద్దలుకొట్టి అతను ఆ గదినంతా సోదా చేసిన తర్వాత అతడికి బీరువాలో వున్న రహస్య అరలో కొన్ని అసభ్యకరమైన ఫోటోలు—వాటి నెగెటివ్‌లు కూడా దొరికాయి.

అతడి మొహం వికసించింది.

"పదండి....హంతకుడిని అరెస్టు చెయ్యాలి" అన్నాడు ఆ గదిలోంచి బయటకు వస్తూ—

శ్యామలరావు ఇంటి ఎదురుగా వుండే శివరాజును ఇన్‌స్పెక్టర్ మహేంద్ర అరెస్టు చేశాడు. కత్తిపిడిమీది వేలి

ముద్రలు అతడి వేలిముద్రలతో సరిపోయాయి. అతడు తన నేరాన్ని అంగీకరించాడు.

"అవును. నేను—మరో యువతి శృంగారంలో వున్నప్పుడు సతీష్ రహస్యంగా ఫోటోలు తీశాడు. వాటి ఆధారంగా నన్ను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజుతున్నాడు. అతడిని శాశ్వతంగా వదిలించుకుందామని ప్లానువేసి డబ్బు కోసం అతడిని మా యింటి ఎదురుగా వుండే శ్యామలరావు తోటలోకి రమ్మన్నాను. అతను అలాగే వచ్చాడు. నమ్మకంగా అతడి గుండెల్లో కత్తి గుచ్చి హత్య చేశాను. హత్యానేరం శ్యామలరావుమీదికి వెళుతుందనుకున్నాను. తర్వాత శ్యామలరావు—అతడి భార్య—శవాన్ని చెత్త కుండీ పక్కనే పడెయ్యటం చూశాను.

ఆ రోజు మధ్యాహ్నం శ్యామలరావు మా యింటికి వచ్చినప్పుడు తన సిగరెట్ లైటర్ మరచిపోయి వెళ్ళిపోయాడు దాని విషయం గుర్తుకు వచ్చి జాగ్రత్తగా తీసుకువెళ్ళి శవం పక్కనే వదిలి వచ్చేశాను. ఆ లైటర్ శ్యామలరావుదని ఉదయం ఇన్‌స్పెక్టర్‌కి నేనే చెప్పాను. తప్పకుండా ఈ నేరం అతడిమీదకే పోతుందనుకున్నాను. కాని నేను తప్పించుకోలేక పోయాను" అన్నాడు విచారంగా—

"నేరస్తుడు యెప్పుడూ తప్పించుకోలేడు. సిగరెట్ లైటర్‌ని ఆ రోజు మధ్యాహ్నం మీ ఇంట్లో మరచిపోయానని శ్యామలరావు నాతో చెప్పాడు. అప్పుడు నా అనుమానం నీ మీదకు మళ్ళింది. సతీష్ గదిలో నీ శృంగార ఫోటోలు నీ నేరాన్ని మరింత బలపరిచాయి. శ్యామలరావు అదృష్టవంతుడు. అతడి సిగరెట్ లైటర్ అతడిని కాపాడింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ నవ్వుతూ. □

సమ్మోహన

బి. రాజేశ్వరి

వాసు, శేషు చాల సేపట్నుంచి అక్కడ కాచుకుని వున్నారు. శేషుకి సహనం నశించిపోతోంది. అయినా వాసు గురించి నోరు మెదపకుండా అలాగే కూచుని చూస్తున్నాడు

"వస్తాడంటావా?" అన్నాడు మెల్లిగా శేషు.

"వచ్చితీర్తాడు. లోపలికి వెళ్ళినవాడు బయటికి తిరిగి రాకేం చేస్తాడు?" అన్నాడు వాసు.

"అట్నుంచి మరో దారికూడా వుంటుంది కదా! అలా వెళ్ళిపోయాడేమో!"

"నో, నో! దొడ్డిదారిన పోయే అవకాశాలు తక్కువ. మనం ఫాలో అవుతున్న విషయం అతనికి తెలీదు."

"పోనీ, నేను వెనకవైపు ద్వారం దగ్గర కాచుకుని వుండనా?"

"వద్దు. అలా అయితే మనిద్దరి దారీ వేరయిపోతుంది. ఆ వ్యక్తి యీ పక్క నుంచి వచ్చేస్తే నీకు తెలియదు?"

శేషు పాన్‌షాప్ ముందున్న బెంచీమీద అసహనంగా కదిలాడు. వాసు పట్టువదలని విక్రమార్కుడిలాగా పేపరు మీదుగా హోటల్ ద్వారంవైపు దీక్షగా అలా చూస్తూనే వున్నాడు.

అంతకి పదినిమిషాల క్రితం డిటెక్టివ్ లిద్దరు ఓముప్ఫయ్యేళ్ళ వ్యక్తిని వెంటాడుతూ వచ్చారు. అతను సరాసరి బృందావన్ హోటల్‌కొచ్చి లోపలికి దూరిపోయాడు. వాసు, శేషు అతని దృష్టిలో పడిపోయే ప్రమాద ముందని హోటలు కెదురుగా వున్న పాన్‌షాపు దగ్గిర ఆగిపోయారు. సీరియస్‌గా రెండు న్యూస్‌పేపర్లు కొనేసి, వాటిని మొహాల కడ్డం పెట్టుకుని హోటలు ద్వారంవైపే కళ్ళప్పగించి చూస్తూన్నారు—ఆ వ్యక్తి బయటికి రావటం గురించి.

అసలు ఆ వ్యక్తిపట్ల డిటెక్టివ్‌లకి అంత శ్రద్ధాసక్తులు ఎందుకు పుట్టుకొచ్చాయో తెలుసుకోవాలంటే రెండురోజులు వెనక్కివెళ్ళి చూడాలి!

2

"నా పేరు గోవర్ధనం! మీ సహాయం కావలసి వచ్చాను" అన్నాడావ్యక్తి "వాసవీక్లాత్ షోరూం ప్రొప్రయిటర్ నేనే!"

వాసు తలూపి, "చెప్పండి" అన్నాడు.

శేషు నోట్ బుక్, పెన్ను సిద్ధం చేసుకున్నాడు.

"నాకు ఒక్కగా నొక్క కొడుకు. పేరు సుధాకర్. వా డీ మధ్య ప్రేమలో చిక్కుకున్నాడు. వాడు ప్రేమించిన పిల్ల నిష్టదరిద్రురాలు. పైగా మా కులం గోత్రం కాదు! మా వాడు దాన్ని తప్ప వేరెవర్నీ చేసుకోనని భీష్మించు కూర్చున్నాడు...." గోవర్ధనం ఓ క్షణం ఆగాడు.

శేషు ఆయనవంకే దీక్షగా చూస్తున్నాడు. ఆయనకు ఏభై అయిదేళ్ళుండవచ్చు. పచ్చని పసిమి. తెల్లటి మల్లెపువ్వులాంటి లాల్చి, పెద్దాపురం సిల్కు పంచె కట్టుకున్నాడు. మెళ్ళో పులిగోరు పతకం. రెండు చేతులకు నాలుగేసి ఉంగరా లున్నాయి. వయసుతో అనుభవం పోటీ పడుతున్నట్టు చురుగ్గా చూసే కళ్ళు, ఆ కళ్ళకింద ఎన్నో ఆటుపోట్లు యెదుర్కొన్నందుకు చిహ్నంగా నల్లటి ముడతలు. చూడగానే ఆగర్భశ్రీమంతుడిలాగా, గౌరవం పుట్టించేలాగా వున్నాడాయన.

గోవర్ధనం మళ్ళీ మొదలుపెట్టాడు. "నేను ఆ పిల్ల బీదరాలని కాదు, పెళ్ళికి అభ్యంతరం పెడ్తున్నది. ఆ పిల్ల గుణం మంచిది కాదని తెలిసింది...."

శేషు తీక్షణంగా చూస్తున్నాడు గోవర్ధనంవంక. వాసు కళ్ళతోనే శేషును వారించాడు—ఏదైనా తొందరపడి మాట తూలనాడతాడని! ఆడపిల్ల శీలం గురించి యెవరయినా అపవాదులు వేయబోతే శేషు సహించడు! గతంలో కొంత మంది యువకులు తాము ప్రేమించిన ఆడపిల్లల గురించి చెడుగా చెప్పబోతే వాళ్ళని కొట్టినంత పని చేశాడు. అదే భయం వాసుకి. అయితే శేషు నోరు మెదపకుండా వింటు

న్నాడు.

"మీకు ఆ అమ్మాయి మీద అనుమానం ఎందుకొచ్చింది?" వాసు మెల్లగా అడిగాడు.

"అనుమానం కాదండి, రుజువులే దొరికాయి. ఆ అమ్మాయి బాగా వెనకబడిన తరగతిలోంచి వచ్చినపిల్ల. అలా అని వెనుకబడ్డ తరగతుల్లో ఆడపిల్లలు మంచివాళ్లు కారని కాదు నా అభిప్రాయం! ఆడపిల్లల పతనానికి కొంతవరకు ఆమె పెరిగిన వాతావరణం ప్రభావం తప్పకుండా వుంటుంది. ఇది నా అనుభవంతో నేను గ్రహించినది.... ఆ పిల్ల గతంలో యిలాగే మరో డబ్బున్న అబ్బాయితో తిరిగిందట! పెళ్ళిదాకా వచ్చిన వాళ్ళ ప్రేమ వ్యవహారం యెందుకో బెడిసికొట్టింది. ఆ కుర్రాడు తెలివిగా తప్పించుకుని పెద్దవాళ్ళు చేసిన సంబంధం చేసేసుకుని సుఖపడ్డాడు."

"ఆ అబ్బాయి కావాలని ఆ పిల్లని మోసం చేశాడేమో" శేషు నోరు విప్పాడు.

"అబ్బె. అదేం కాదండి! ఆ పిల్ల మంచిది కాదని ఆ కుర్రాడికి తెలిసి తప్పించుకున్నాడండి. ఆ పిల్ల ఓ పట్టాన వదలకపోతే ఓ పదివేలు యిచ్చుకుని వదిలించుకున్నాడు."

"ఇంతవివరంగా ఆ సంగతులు మీకెలా తెలుసు?"

గోవర్ధనం శేషును అమాయకుడ్ని చూసినట్టు చూసి మెల్లగా నవ్వాడు. "ఆ కుర్రాడు యెవరో కాదండి నా మేనల్లుడే! అందుకే యింత కచ్చితంగా చెప్పగలుగుతున్నాను. మా సుధాకర్ తెలిసి తెలిసీ యీ ఊబిలో చిక్కుకు పోవడం చూసి వివరాలు సేకరించాను. గతంలో ఆ పిల్లను నేను చూశాను గూడా! అందుకే ఎట్టి పరిస్థితుల్లోను ఆ పిల్ల నా కోడలు కాకూడదని నిర్ణయించుకున్నాను"

అన్నాడు.

శేషు గోవర్థనం వంక శల్య పరీక్ష చేస్తున్నట్టు చూస్తున్నాడు. ఆయన మాటల్లోని నిజాలు బేరీజు వేస్తున్నాడని అతని వాలకమే చెపుతోంది. అతను చటుక్కున ఏదైనా నోరు జారతాడని వాసుకి యింకా భయంగానే వుంది.

వాసు గోవర్థనం వంక చూసి, "ఇంతకీ మీకు మా వల్ల కావలసిన సహాయం చెప్పారు కాదు!" అన్నాడు.

"అదే చెప్పొస్తున్నానండి! మా సుధాకర్ ఆ పిల్ల మైకంలో పడి నన్నుకూడా లెక్కచెయ్యని పరిస్థితి కొచ్చాడండి. నేను కాదన్నా, నా ఆస్తి చిల్లిగవ్వ దక్కకపోయినా లెక్కచేయడట. ఆ పిల్లను తప్ప మరో ఆడపిల్లను కన్నెత్తిగూడా చూడడట! నన్ను వదలి పోవటానికూడా సిద్ధంగా వున్నాడు. నేనెంతగానో నచ్చచెప్పి చూశాను. నా మేనల్లుడు గూడా ఆ పిల్లగురించి పూర్తిగా వాడితో చెప్పేశాడు.

ఎవరు చెప్పినా విననంటున్నాడు. బీద పిల్లయినా, కట్నం యివ్వలేకపోయినా మంచి పిల్లని సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చిన పిల్లను తన యిష్టప్రకారమే చేసుకోమంటున్నాను నేను—కాని మా సుధా వినడంలేదు. ఈ పిల్లనే చేసుకుంటాడట! మీరు దయచేసి మా వాడి మనసు మార్చాలి! ఆ పిల్ల కారక్టర్ విషయం పూర్తి ఆధారాలతో మా వాడికి చూపించి వాడు సరైన దారిలో నడిచేటట్టు చూడాలి!...." గోవర్థనం ఆయాసం తీర్చుకోవటాని కన్నట్టు ఆగాడు.

"మీవాడి మనసు మారుందో లేదో మేము గ్యారంటీ యివ్వలేం. ఆ పిల్ల గురించి పూర్తి వివరాలు—పుట్టినప్పట్నుంచీ కావాలన్నా సేకరించి యివ్వగలం. ఆమె ప్రవ

ర్తన, శీలం వగయిరా ఆంతరంగిక విషయాలు గూడా ఆధారాలతో సంపాదించి యివ్వగలం. వాటిని చూపి మీ అబ్బాయి మనసు మార్చుకున్నా మార్చుకోక పోయినా, అది మా బాధ్యత కాదు!" అన్నాడు వాసు కచ్చితంగా.

గోవర్ధనం పేళ్ళున నవ్వి "హన్నన్న, ఎంతమాట సెలవిచ్చారు!? ఆధారాలు సంపాదిస్తే చాలునండీ! మారక పోవటానికి వాడి మనసు రాయీ రప్పా కాదు. బుద్ధున్న వాడెవడూ చెడిపోయిన దాన్ని, కావాలని చెడు తిరుగుళ్ళు తిరిగిన చెడ్డదాన్ని-చేసుకోవటానికి సిద్ధపడడు! నా కొడుకు బుద్ధున్నవాడే! కాకపోతే ప్రేమ పైత్యంవల్ల ఆ బుద్ధికి గ్రహణం పట్టిందంతే!" అన్నాడు.

అప్పటికీ శేషు పెదవి విప్పలేదు. అదే మహాభాగ్యం అనుకొన్నాడు వాసు.

"సరే, మేం యీ కేసు టేకప్ చేస్తున్నాం. మీ అబ్బాయి ఏం చేస్తుంటాడు, ఎలా వుంటాడు మొదలైన వివరాలు, మీ అబ్బాయి వరించిన పిల్ల పేరు అడ్రసు వగయిరా అన్నీ చెప్పండి, మా శేషు నోట్ చేసుకుంటాడు. మీ అడ్రసు వివరంగా యివ్వండి. మీ ఫోన్ నంబరుగూడా చెప్పండి!" అంటూ శేషు వంక సాభిప్రాయంగా చూశాడు వాసు.

శేషు వివరాలు నోట్ చేసుకున్నాడు. వివరాలిస్తూ ఆ పిల్ల పేరు ప్రమద అని చెప్పాడు గోవర్ధనం. ఫోటో కార్డు సైజు దొకటి డిటెక్టివ్‌ల కిచ్చాడు.

డిటెక్టివ్ లిద్దరు తదేక దీక్షతో ఆ ఫోటోవంక కొద్ది క్షణాలు అలాగే చూస్తుండిపోయారు. ఫోటోలో చాలా అందంగా వుంది ప్రమద. చూడటానికి రెండు కళ్ళూ చాలవనిపించేలాగా వుంది. అందుకే సుధాకర్ ఆమెని

వదులుకోలేక పోతున్నాడనిపించింది వాళ్ళిద్దరికీ.

గోవర్ధనం చిన్నగా దగ్గి వాళ్ళనీ లోకంలోకి తీసుకొచ్చాడు.

"ఇక నేను వెళ్ళవచ్చా?"

"ఓ.కే. వెళ్ళిరండి!" అన్నాడు వాసు. గోవర్ధనం ఫీజిచ్చే సూచనే కనిపించడం లేదు. గుర్తు చెయ్యాలా వద్దా అన్న మీమాంసలో వున్నాడు వాసు. శేషు వంక భావయుక్తంగా చూశాడు. కాని శేషు యిదేమీ గమనిస్తున్నట్టు లేదు. ఏదో లోకంలో వున్నట్టున్నాయి అతని చూపులు.

గోవర్ధనం రెండడుగులు బయటకు వేసి అంతలోనే అర్జంటుగా వెనక్కి వచ్చి "సారీ, మీ ఫీజు విషయం మరిచే పోయాను సుమా! ఇంద....యిది అడ్వాన్సుగా వుంచండి" అంటూ కొన్ని నోట్లు టేబిల్‌మీద పెట్టాడు.

"నువ్వు మౌనంగా వుండటం నా కాశ్చర్యం కలిగించింది. ఈ కేసు ఒప్పుకోవడం నీ కిష్టముండదని భయపడ్డాను" అన్నాడు వాసు గోవర్ధనం వెళ్ళిపోయాక.

శేషు దీర్ఘంగా నిట్టూర్చి, "గోవర్ధనం చెప్పింది నిజమని నాకు నమ్మకం కలిగింది. అలాంటి అమ్మాయిలు గూడా యీ రోజుల్లో యెదురవుతున్నారు" అన్నాడు గంభీరంగా.

వాసు ముఖంలో ప్రశ్నార్ధకం అలాగే చాలాసేపు వుండిపోయింది. ఇంక ఏమి ప్రశ్నించలేదు శేషుని.

ఆ క్షణం నించీ తమ పరిశోధన మొదలుపెట్టారు.

ముందుగా ప్రమద ఇంటి నుంచి మొదలుకుని, గోవర్ధనం ఇంటి మీదుగా అతని క్లాత్ షో రూం అక్కడి పరిస్థితులు క్షుణ్ణంగా ఆకళింపు చేసుకున్నారు.

తర్వాత గోవర్ధనం మేనల్లుడు చిదంబరాన్ని కలుసుకున్నారు. చిదంబరం కోటీశ్వరుడైన ఓ బిజినెస్ మాగ్నెట్ అల్లుడు. అతని భార్యని చూసి వాసు శేష చాలా ఆశ్చర్యపోయారు. అంతటి అనాకరి. బహుశా కట్నం డబ్బుకి ఆశపడి ఆమె మెళ్ళో తాళి కట్టివుంటాడనుకున్నారు.

అతను ప్రమద గురించి చాలా విషయాలు చెప్పాడు. ఆమె పూర్తిగా డబ్బు మనిషని, కేవలం డబ్బుకోసమే తనతో స్నేహం చేసిందనీ చివరికి పదివేలు డబ్బు కోసం తనని శాశ్వతంగా వదిలెయ్యటానికి సిద్ధపడుతుందనీ— అంతా గోవర్ధనం చెప్పినట్టే చెప్పాడు.

ఆ తర్వాత సుధాకర్ని కలిశారు. అతను తండ్రి చెప్పినట్టే పూర్తిగా ప్రమద మైకంలోనే వున్నాడు. తండ్రి తరపున పనిచేస్తున్నట్టు చెప్పకుండా ప్రమద వైపు బంధువులమని చెప్పుకున్నారు.

"మిమ్మల్ని గురించి ప్రమద ఎప్పుడూ చెప్పలేదే!" అని ఓ క్షణం ఆశ్చర్యపోయాడు సుధాకర్. కాని వాసు, శేష ప్రమద గురించి వివరంగా మాట్లాడేసరికి వాళ్ళని అనవసరంగా అనుమానించినందుకు తెగబాధపడిపోయాడు. ప్రమదని తప్ప ఎవర్నీ చేసుకోననీ, వీలయినంత త్వరలో ప్రమదతో వివాహం ఏర్పాటు చెయ్యమనీ చాలా దృఢంగా చెప్పాడు.

చిదంబరం సంగతి అతనివద్ద ఎత్తటం ఏ మాత్రం భావ్యంగా వుండదని వాసు శేషులకు తెలుసు. అందుకే ఆ ప్రసక్తి రాకుండా జాగ్రత్తపడ్డారు.

సుధాకర్ దగ్గర్నుంచి ప్రమదను కల్సుకోవటానికి వస్తుండగా దార్లో అనుకోకుండా చిదంబరం ఎదురయ్యాడు. అయితే అతను వాసు శేషుల్ని చూడలేదు. సరాసరి ప్రమద

వుంటున్న ఇంటి వైపు వెళ్ళటం వాసు శేషులకి ఆశ్చర్యం కలిగించింది

అతనికి తెలీకుండా వెంబడించారు.

చిదంబరం ప్రమద ఇంటి ముందు ఆగాడు. డిటెక్టివ్‌లు దూరంగా వీధి మొదట్లో ఆగి చూస్తున్నారు. చిదంబరం ప్రమద వాళ్ళింట్లోకి వెళ్ళాడు. పది నిమిషాల తర్వాత తిరిగి వచ్చాడు. వాసు, శేషు అతనికి కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

చిదంబరం మళ్ళీ నడక సాగించాడు. ప్రమద ఇంటికి వెళ్దామా అని ఓ క్షణం తటపటాయించారు వాసు శేషు — చివరికి చిదంబరాన్ని వెంబడించటానికే నిశ్చయించుకున్నారు.

చిదంబరం హోటల్ బృందావన్‌లోకి ప్రవేశించే వరకు అలా వెంబడిస్తూనే వున్నారు. మన ప్రస్తుత కథ అక్కడ్నుంచే మొదలయ్యింది.

3

"చిదంబరం ఏమయిపోయాడు?" అన్నాడు గుసగుసగా శేషు. అది పన్నెండోసారి అతనా ప్రశ్న వేయటం!

"సరే. యిక లోపలికి వెళ్ళి చూద్దాం!" వాసు పేపరు మడిచి హోటలు లోపలికి దారి తీసాడు. శేషు అనుసరించాడు.

హోటలు బృందావన్ సిటీలోకెల్లా పేరున్న హోటలు. లక్షాధికారులు ఎక్కువగా దర్శించే హోటలది! చిదంబరం ఆ హోటల్‌కి రావడంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. కాని వాళ్ళ నాశ్చర్యపరచింది అతను ఆ హోటల్‌కి రావటం కాదు — ప్రమదని కల్సుకోవటం! ఆమెతో పూర్తిగా తెగ

తెంపులు చేసుకున్న చిదంబరం ఆమె ఇంట్లోకి ఎందుకు వెళ్ళాడు?

లోపల చాలా గదులున్నాయి. గదుల్లో మగవాళ్ళే కాకుండా ఆడవాళ్ళుగూడా యథేచ్ఛగా తింటున్నారు, తాగుతున్నారు, నవ్వుతున్నారు, తుళ్ళుతున్నారు. చాలా సందడిగా, హుషారుగా ఏదో కొత్త లోకంలో వున్నట్టు యీ లోకంతో సంబంధం లేనట్టు గాల్లో తేలిపోతున్నారు.

శేషు వాసు చెయ్యి పట్టుకుని నొక్కి కళ్ళతోనే సైగ చేశాడు. వాసు అటు చూశాడు. కొద్ది క్షణాలు యిద్దరు నోట మాట లేకుండా అటే చూస్తూండిపోయారు.

అక్కడ చిదంబరం, ప్రమద పక్కపక్కన కూచుని వున్నారు ఇద్దరు నవ్వుతూ తుళ్ళుతూ ఏదో తింటున్నారు.

వాసు శేషు చెయ్యి పట్టుకుని బయిటికి తీసుకు వచ్చేశాడు. శేషు యీలోపల మినీ కెమెరాతో వాళ్ళిద్దర్నీ ఫోటో తీసేశాడు.

"ఇంతకీ ఒకప్పుడు వద్దనుకుని తెంచేసుకున్న బంధం చిదంబరం మళ్ళీ ప్రమదతో యెందుకు పెట్టుకున్నట్టు?"

"ఇద్దరికీ ఒకరిమీద మరొకరికి యింకా మోజు తీరి వుండదు. పాపం, సుధాకర్ ఆమె తనమీద చూపిస్తున్న వగలు నిజమేనని మోసపోతున్నాడు. ఆమెనే పట్టుకు వేళ్ళాడుతున్నాడు."

వాసు తుళ్ళిపడి, "శేషూ! అటు చూడు. ఆ షాప్‌లో ప్రమదలా వుంది. లా ఏమిటి, ప్రమదే!" అన్నాడు.

శేషుగూడా ఆ షాపులోకి పరీక్షగా చూసి విస్తుపోయాడు. "అవును. ప్రమదే! అనుమానం లేదు. కాని యిదెలా సంభవం? హోటల్ గదిలో ఓ ప్రమద, బయట యీ షాపులో మరో ప్రమద? ఇది కలా, నిజమా?"

అన్నాడు.

"నువ్విక్కడే వుండు. హోటల్లోపలికి వెళ్ళి వెరిఫై చేసుకుని వచ్చేస్తాను" అని వాసు రెండడుగులు వేశాడు.

శేషు వారించి, "అదిగో—చిదంబరం, నకిలీ ప్రమద బయటి కొస్తున్నారు" అన్నాడు.

వాసు హోటల్ ద్వారం వైపు చూశాడు. చిదంబరం, ప్రమదగా పరిచయమైన నకిలీ ప్రమద ఒకరినొకరు అనుకుని బయటికొచ్చి రెండు నిమిషాలు అక్కడే నిల్చుని తర్వాత ఆటో ఎక్కి యెటో వెళ్ళిపోయారు.

"దీన్నిబట్టి నీ కర్థమయిందేమిటి? చిదంబరం గోవర్ధనంతో కలిసి కుట్రలో పాల్గొన్నాడు. ప్రమదలాగే మేకప్ చేసిన అమ్మాయితో మన ముందు విన్యాసాలు చేస్తున్నాడు. కావాలనే మన దృష్టిని తనవైపు ఆకర్షించుకుని, తనని మనం వెంబడించేలా చేసుకుని నకిలీ ప్రమదతో యిక్కడ మనకు ప్రదర్శన ఏర్పాటుచేసి మనిద్దర్నీ రాంగ్ ట్రాక్‌లో నడిపించాలని ప్రయత్నించాడు. మనం తెలీకుండానే అతని ట్రాప్‌లో పడిపోయాం, ప్రమదని పూర్తిగా అనుమానించాం. కమాన్, ప్రమద బయటికి వెళ్ళిపోతోంది. ఆమెతో మాట్లాడవలసిన విషయా లున్నాయి రా!" అంటూ వాసు చకచక ప్రమద వున్న షాప్‌వైపు నడిచాడు.

4

"మీతో ఓ అయిదు నిమిషాలు మాట్లాడాలి!" అంటున్న వాసువంక ఆశ్చర్యంగా చూసింది ప్రమద. అందమైన పెద్ద పెద్ద కళ్ళు విప్పార్చి చూసింది డిటెక్టివు లిద్దరి వంక.

"అవునండి. సుధాకర్‌కి కావలసిన వాళ్ళం. మీకూ కావలసిన వాళ్ళమే!" అన్నాడు శేషు.

సుధాకర్ పేరు వినగానే మంత్రముగ్ధలా వాళ్ళను అనుసరించింది ప్రమద.

ముగ్గురు గార్డెన్‌లో కూచున్నాక, "చెప్పండి. సుధాకర్ యెలా వున్నారు? రెండు రోజులుగా ఆయన కనిపించటం లేదు" అన్నది.

"మీ రిద్దరు ప్రేమించుకున్నారు కదూ! పెళ్ళి యెంత వరకు వచ్చింది?" అన్నాడు వాసు.

ప్రమద బుగ్గల్లో గులాబీలు పూశాయి.

"త్వరలోనే మేమిద్దరం భార్యాభర్తలు కాబోతున్నాం."

"సుధాకర్ తండ్రికి యిష్టం లేదనుకుంటాను!"

"మా పెళ్ళిని ఆయన వ్యతిరేకించటం మా దుర దృష్టం."

"సుధాకర్ తండ్రిచాటు బిడ్డ. తండ్రి నెదిరించగలడను కోము."

"అదేం కాదు. నాకోసం తండ్రిని, ఆస్తిని వదులుకోవ టానికి సిద్ధమయ్యారు సుధా."

"సుధాకి ఉద్యోగం గూడా ఏదీ లేదే! ఎలా బతగ్గల మనుకుంటున్నారు?"

"నాకు వారం రోజుల క్రితం టీచరు ఉద్యోగం దొరి కింది. సుధా నేను గ్రాడ్యుయేట్సు. మేం తలచుకుంటే— చిన్నపిల్లల కాన్వెంటు స్కూలు పెట్టుకుంటే చాలు, మా జీవనం గడిచిపోతుంది" నిబ్బరంగా చెపుతున్న ఆ పిల్ల మాటలకి ముచ్చటేసింది వాసుకి. శేషు ఆమె కంఠంలో తొణికిసలాడుతున్న ఆత్మ విశ్వాసానికి. పట్టుదలకి మెచ్చు కున్నాడు మనసులోనే.

"ఒక్క విషయం. మీకు చిదంబరం తెలుసా?" వాసు అడిగాడు.

ఒక్క క్షణం ఆమె ముఖం మలినమయింది. విన గూడనిదేదో విన్నట్టు అప్రసన్నంగా అయిందామె ముఖం.

"అతనో గోముఖ వ్యాఘ్రం: సుధా నేను ప్రేమించు కున్నట్టు తెలిసిగూడా మా మధ్య చిచ్చు పెట్టడానికి ప్రయత్నించిన మహానుభావుడి సంగతి తెలియకపోవడ మేమిటి? ఓసారి అసభ్యంగా ప్రవర్తించి నాచేత చెంపదెబ్బలు తిన్నాడుగూడా! అప్పట్నుంచీ నామీద కక్షపూని సుధావాళ్ళ నాన్నగారితో నామీద యెన్నో లేనిపోనివి కల్పించి చెప్పి ఆయన మనసు విరిచేశాడు. అసలు అందుకే సుధా నాన్న గారు మా పెళ్ళికి అభ్యంతర పెడ్తున్నారు. చిదంబరం వాళ్ళకి ఏదో బంధువవుతాడు!" అన్నది ప్రమద.

"అలాగా! చిదంబరం ఒకప్పుడు మిమ్మల్ని ప్రేమించాడా?"

"ఎవరన్నారు? చిదంబరం సుధాకన్న కనీసం ఏడెనిమి దేళ్ళు పెద్ద! పైగా చదువుసంధ్యలు లేనివాడు. కనీసం మాతో యెప్పుడు చదువుకోనైనా లేదే. అతను మా కెలా పరిచయ మవుతాడు? సుధాని నేను ప్రేమిస్తున్న విషయం తెలిసి ఒకటి రెండుసార్లు నన్ను మా యింటికొచ్చి మరీ బెదిరించి వెళ్ళాడు. నేను గుమ్మం ఎక్కొద్దని వార్నింగిచ్చాను. ఓసారి మీద చెయ్యి వేయబోయి చెంపలు వాయించేసరికి మళ్ళీ నా ఛాయలకు రాలేదు!"

"మీ యింట్లో మీ రొక్కరేనా?"

"అమ్మ, తమ్ముడు వున్నారు. ఒకప్పుడు మేమూ శ్రీమంతులమే! నాన్నగారు జిల్లా మేజిస్ట్రేటుగా పనిచేస్తూ ఆక్సిడెంట్లో పోయారు. మా పరిస్థితి ఆర్థికంగా చితికి పోయింది."

"అలాగా. పాపం!" శేషు జాలిపడ్డాడు.

"ఇంతకీ మీరు సుధాకి యెలాంటి బంధువులో చెప్ప లేదు. చిదంబరం గూడా సుధాకి దగ్గర బంధువే మరి!" ప్రమద మెల్లిగా నవ్వింది.

"మమ్మల్ని అతనితో పోల్చకండి. మేం మంచి బంధువులమే! మీదగ్గర దాచవలసిన పనిలేదు. మేము డిటెక్టివ్‌లం. నాపేరు వాసు, యితని పేరు శేషు. మీ గురించి సుధాకర్‌కి చెడ్డగా చెప్పి అతని మనసు విరిచెయ్యటానికి అతని తండ్రిచేత నియమించబడ్డ వాళ్ళం! మీకు వ్యతిరేకంగా సాక్ష్యాలు ఆధారాలు సేకరించటానికి ఫీజుగూడా తీసుకున్నాం" అన్నాడు శేషు.

విస్ఫారిత నేత్రాలతో వారిరువుల వంకా చూసింది ప్రమద.

వాసు అభయమిస్తూ, "భయపడకండి! ఇప్పుడు మాకు తెలిసిపోయింది. గోవర్ధనం ప్లాన్ అర్థమయిపోయింది. ఈ క్షణం నించీ గోవర్ధనంతో మేం చేసుకున్న ఒప్పందం రద్దయిపోయి నట్టే! మీకు అన్యాయం జరగటానికి మేం అంగీకరించం. పవిత్ర ప్రేమికుల్ని యెవరూ విడదీయ లేరు!" అన్నాడు.

ప్రమద వారిద్దరికీ చేతులు జోడించి నమస్కరించి, "మీ మేలు యీ జన్మకు మరచిపోను" అన్నది.

"మీ కాబోయే మామగారికి చక్కటి గుణపాఠం నేర్పాల్సి వుంది. అందుకు మీరు మాతో సహకరించాలి" అన్నాడు శేషు.

5

"నువ్వా, ఎందుకొచ్చావు?" గోవర్ధనం చిరాగ్గా అడిగాడు.

"అదేమిటి మామయ్యా, నకిలీ ప్రమదను బుక్ చేసి నాటకమాడుతున్నాను కదా! ఖర్చులుండవా?" చిదంబరం చిద్విలాసంగా నవ్వుతూ అన్నాడు.

"నీకు వేలకి వేలు తెచ్చి పొయ్యలేక పోతున్నానయ్యా బాబూ. దానికన్న ఆ పిల్లతో మా వాడికి పెళ్ళి జరిపించేస్తే నే నయంలా వుంది"

"ఆ పని ఎప్పుడో చెయ్యాల్సింది. ఈ నాటకం పుణ్యమా అని ఆ పిల్లచేత చెంపదెబ్బలు గూడా తిన్నాను. దాని ఖరీదెవరిస్తారు? ఎన్ని వేలిచ్చినా నా కష్టం తీరేది కాదు!"

"ఇదిగో యీ రెండువేలు తీసుకుని వెళ్ళు. మళ్ళీ నన్ను వేధించకు!" డబ్బుతీసి చిదంబరాని కిచ్చాడు గోవర్ధనం. ఎక్కడినుంచో ఫ్లాష్ వెలుతురు పడింది.

ఒక గంట తర్వాత ప్రమద అక్కడి కొచ్చింది.

"నువ్వా?" ఆశ్చర్యంతో నోరు తెరిచాడు గోవర్ధనం.

"అవును, అంతలా ఆశ్చర్యపోతున్నారేం?" ప్రమద నవ్వింది.

"నా యింటి గుమ్మం యెక్కడానికి యెంత ధైర్యం నీకు?"

"మీ యింటికి కోడలు కావలసినదాన్ని, ఆ అధికారం మీ అబ్బాయిగారే యిచ్చారు."

అదే దురహంకారం. నువ్వు నా కొడుక్కి పట్టిన పిశాచానివి. నిన్ను వదిలించటానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేయించాను. నిన్ను మావాడు శవాలమీద వెళ్ళగొట్టేసే రోజు దగ్గర్లో వుంది.

"అన్ని మాటలెందుకు చెప్పండి. ఏదో కొంత డబ్బు నా మొహాన పడేస్తే నేనే వెళ్ళిపోతాను కదా!"

గోవర్ధనం మెదడులో బల్బు వెలిగింది.

"ఎంత కావాలి?"

"ఓ లక్ష!"

"రూపాయిలే!?"

"మరి!....?"

"పదివేలిస్తాను."

"మరీ బేరం దించెయ్యకండి. మీ అబ్బాయికి కనీసం ఏభై లక్షలు కట్నం సిద్ధంగా వుంది — నే నొదిలేస్తే! అలాంటిది ఓ లక్షకోసం చూసుకుంటారా?"

"సరే. ఏభై వేలిస్తాను. ఇక్కడే వుండు" గోవర్ధనం లోపలికి వెళ్ళాడు. పది నిమిషాల తర్వాత నోట్లకట్టలతో హాల్లోకి వచ్చాడు.

ప్రమద చెయ్యి చాపింది.

గోవర్ధనం పక్క గుమ్మంవైపు చూసి నవ్వాడు.

అక్కడ సుధాకర్ నించుని వున్నాడు.

"ప్రమదా, యింత నీచాని కొడికడతావా?" అతని కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయి.

"నీచమా? డబ్బు విషయంలోనా? నేను నీతో స్నేహం చేసిందే డబ్బుకోసం! నువ్వు కోటీశ్వరుడి కొడుకువి కదా, ఆస్తంతా నీకే దక్కుతుందనుకుంటే నువ్వు మీ నాన్నను వదిలేసి నన్ను కట్టుకుంటానని సిద్ధ మయ్యావు. డబ్బులేకపోయాక నీకూ విలువలేదు. నన్నేం పెట్టి పోషిస్తావు? అందుకే సులభంగా యీ దారి యెన్ను కున్నాను. కమాన్ ఆ డబ్బిలా యివ్వండి!" గోవర్ధనాన్ని చూసి అన్నది ప్రమద.

గోవర్ధనం డబ్బు వెనక్కి తీసుకుని నవ్వాడు.

"నాక్కావలసింది నువ్విలాంటిదానివని నా కొడుక్కి

తెలిపి వాడు నిన్నొదిలెయ్యటం! కళ్ళారా చూశాకగూడా వాడు నీకోసం వెంపర్లాడతాడని నేననుకోను. నీకు డబ్బు యివ్వాల్సిన పనిలేదు. నువు వెళ్ళొచ్చు. నేననుకున్నది అనుకున్నట్టే జరిగింది. మావాడు కళ్ళు తెరిచాడు."

ప్రమద కోపంగా చూసింది.

సుధాకర్ ప్రమదని సమీపించి, "ఇదంతా మా నాన్న ఆడిస్తున్న నాటకంలో భాగమని నాకు తెలుసుగాని యింక దయచేయి నకిలీ ప్రమదా! మా బావగూడా నీకు బాగానే జతయ్యాడు. వాడితో పెర్మనెంటుగా సెటిలయిపో!" అన్నాడు నవ్వుతూ.

గోవర్ధనం దొరికిపోయినట్టు చూశాడు.

"ఇందాక బావతో నీ మంతనాలు వినలేదనుకున్నావా, నాన్నా! నువ్వు వాడికి డబ్బివ్వటం కళ్ళారా చూపి ఫోటో గూడా తీశాను. అంతక్కా అదిగో నా ప్రమద గుమ్మం దగ్గర. మీ ఆశీర్వాదం కోసం ఎదురు చూస్తోంది!" అన్నాడు సుధాకర్ గుమ్మంలో నిల్చుని వున్న ప్రమదను చూపిస్తూ.

గోవర్ధనం కొడుకు ముఖంలోకి సూటిగా చూడలేక పోయాడు.

నకిలీ ప్రమద హఠాత్తుగా రివాల్వర్ హేండ్ బ్యాగ్ నించి తీసి గోవర్ధనానికి గురి చేసింది.

"ఎవరూ కదలొద్దు. నేను కాల్చటానికి సంకోచించను. మిష్టర్ గోవర్ధనం. ఆ డబ్బిలా తే! అంతేకాదు నీ యినప్పెట్లో వున్న కాష్, నగలు వెంటనే నా కిచ్చెయ్యకపోతే నిన్ను నిర్ధాక్షిణ్యంగా కాల్చేస్తాను!" అన్నది నకిలీ ప్రమద.

గోవర్ధనంతోపాటు అందరూ ఓ క్షణం విస్తుపోయి నించుండిపోయారలాగే.

గోవర్ధనం నోట్ల కట్టలు నకిలీ ప్రమద కిచ్చేశాడు. "ఓహో, గుడ్! ఆ తాళాలు యిలా యిస్తే నేను బీరువా తెరిచి నాపాట్లేవో నేపడతాను" అన్నదామె.

గోవర్ధనం "నేనివ్వను. ఏం చేసుకుంటావో చేసుకో" అన్నాడు మొండిగా. సుధాకర్, ప్రమద నిస్సహాయంగా చూస్తున్నారు.

"ఇవ్వకపోతే చిక్కుల్లోపడి పోతావు మామయ్యా, యిచ్చెయ్యి పాపం!" చిదంబరం గుమ్మంలో నవ్వుతూ నించున్నాడు. అతని చేతిలోగూడా రివాల్వర్ వుంది.

"ఓరి దుర్మార్గుడా, యిదంతా నీ పన్నాగమా?"

"నువ్వు నేర్పిన విద్యే కదా మామయ్యా! ఈ కొత్త పార్టు నేను స్వయంగా కల్పించాను, అంతే! ఇచ్చెయ్యి మామయ్యా, యిచ్చెయ్యి!" చిదంబరం మెత్తగా నవ్వుతున్నాడు.

ఎప్పుడు వచ్చిందో ప్రమద, నకిలీ ప్రమద వెనగ్గావచ్చి ఆమె చేతిలోని రివాల్వర్ యెగరకొట్టేసింది.

నకిలీ ప్రమద అదిరిపోయింది.

చిదంబరం మరుక్షణం ప్రమదని కాల్చేసి వుండేవాడే. కాని, ప్రమదకి గురిచేసిన అతని రివాల్వర్ యెగిరి దూరంగా పడింది. అతని చేతినుంచి రక్తం ధార కట్టింది.

"ఇది మాత్రం నిజమే మిస్టర్!" అన్న మాటలు గుమ్మంవైపు నించి వినిపించి అందరూ తలలెత్తిచూశారు. అక్కడ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ తన బలగంతో సిద్ధంగా వున్నాడు.

పక్కనే వాసు, శేషు ముసిముసిగా నవ్వుతున్నారు.

సుధాకర్ ఒక్క అంగలో వాళ్ళిద్దర్నీ సమీపించి చేతులు పట్టుకుని కృతజ్ఞతగా చూశాడు.

శ్రీకాంత్ నకిలీ ప్రమదను, చిదంబరాన్ని అరెస్టుచేసి తీసుకుపోతూ, "మీరోసారి స్టేషన్ కొచ్చి రిపోర్టు రాసివ్వాలి!" అన్నాడు గోవర్ధనంతో.

గోవర్ధనం తలూపాడు.

వాసు శేషు గోవర్ధనం వంక చూసి, "ఇక మేంగూడా వెళ్తాం! ప్రమద మీ ప్రాణం రక్షించటానికి రిస్కు తీసుకుంది. ఇంకా ఆమెను పరాయిదానిగానే భావిస్తున్నారా?" అన్నాడు.

గోవర్ధనం ఆనందబాష్పాలు రాలుస్తూ, "ఎంత మాట! త్వరలోనే ముహూర్తం పెట్టిస్తాను. ఆశీర్వదించి పొండి. మీ ఫీజుగూడా అప్పుడే చెల్లించేస్తాను" అన్నాడు. □

బాస్ పిలుపు!



నేను దొంగని కాను!

అజీజ్

వెనుక ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు వినిపించి చటుక్కున వెనుదిరిగి చూశాను.

పోలీస్!

ఒకరు కాదు.

ఇద్దరు కానిస్టేబుళ్ళు!!

ఒకడి చేతిలోని టార్చి వెలిగి, టెలిఫోన్ బూత్‌లో

పడింది. మరుక్షణం కళ్ళు చెదరగొట్టే దాని వెలుగు నా మొహంమీద పడగానే కళ్ళు చిట్లిస్తూ మోచేతు లడ్డం పెట్టుకున్నాను. అప్పుడు గమనించి వుంటారు వాళ్ళు నా చేతిలో చాకులాంటి ఇనుపముక్కని.

"ఓహో, ఇదా సంగతి! టెలిఫోను బాక్సులు పగలగొట్టి చిల్లరడబ్బులు దోచుకుంటున్నావుట్రా చిల్లరదొంగా!" అన్నాడో కానిస్టేబులు వ్యంగ్యంగా నవ్వుతూ.

"లేదు. నేను దొంగను కాను. ఫోను చెయ్యడానికి బూత్‌లో కొచ్చాను."

"అలాగా నాయనా! మా బాబే! నీ చేతిలో వున్న ఆ ఇనుప ముక్కా, కిందపడ్డ చిల్లర నాణాలూ చూసి కూడా నిన్ను సత్యహరిశ్చంద్రుడి వనుకోవడానికి మేమేం పచ్చు చవటల మనుకున్నావా నాయనా!" అంటూ జేబులోంచి రుమాలు తీశాడు కానిస్టేబులు.

"నా మాట నమ్మండి నేను దొంగను కాను" భయంతో నా కంఠం వణికింది.

"నువ్వు దొంగవో, దొరవో క్రైంబ్రాంచ్ హెడ్ క్వార్టర్స్‌లో తెలుస్తుందిగానీ, ముందా యినుపముక్కని ఈ రుమాల్లో పడెయ్యి" అన్నాడు కానిస్టేబులు రుమాలు అరచేతిలో చాపుతూ.

ఆ ఇనుపముక్కపై తప్పకుండా నా వేలిముద్రలు పడుంటాయి. అందుకే ఆ జాగ్రత్త! గత్యంతరం లేదు. మౌనంగా అతని చేతిలో పెట్టేశాను దాన్ని. అటువంటి పరిస్థితిలో వారి కంటబడ్డాను మరి.

"నా మాట నమ్మండి. నేను ఫోను చెయ్యాలనే వచ్చానిక్కడికి. అదృష్టం బాగులేక...."

"మా కంటబడ్డానంటావ్! అంతేనా? చూడబ్బాయ్, ఈ

మధ్య నగరంలో టెలిఫోను బూతులు పగలగొట్టి డబ్బులు దోచుకునే చిల్లర మల్లర దొంగతనాలు చాలా జరుగుతున్నాయి. ఇది మద్రాసు మహానగరం! ఇలాంటి టెలిఫోను బూతులు ఈ నగరంలో కొన్ని వేల సంఖ్యలో ఉన్నాయి.

దొంగతనాలు జరక్కుండా ప్రతి టెలిఫోను బూత్ ముందూ ఓ కానిస్టేబుల్ని కాపలా పెడితే, ఇహ ప్రభుత్వాదాయమంతా మా పోలీస్ డిపార్ట్‌మెంట్‌కే సరిపోతుంది. అందుకే ఆ చిల్లర దొంగలింత వరకూ పట్టుబడకుండా యథేచ్ఛగా తమపని చేసుకుపోతున్నారు.

ఇప్పుడు యాధృచ్ఛికంగా నువ్వు మా కంటబడ్డావ్. మేమిద్దరం ఈ వైపు గస్తీకి రావడం, అదే సమయంలో ఈ బూత్‌లోంచి అనుమానాస్పదంగా చప్పుడు వినిపించడం, అంతా అనుకోకుండా జరిగిందనుకో. అది సరేగానీ, జేబులోంచి నీ కర్చీఫ్ తియ్యి బైటికి."

"ఎందుకూ?"

"ఎదురు ప్రశ్న వెయ్యకు. చెప్పినట్టు చెయ్!" ఉరిమి చూశాడు కానిస్టేబుల్. పోలీసోడితో పేచీకి దిగడం చాలా ప్రమాదమని విన్నాను. నా ముందు ఒకడు కాదు, ఇద్దరున్నారు మరి. వారితో పేచీ పెట్టుకుంటే లేనిపోనివి కల్పించి, కేసుని మరింత సాగదీస్తారుట. అందుకే మౌనంగా జేబులోంచి కర్చీఫ్ తీసి పట్టుకున్నాను.

"ఇహ బుద్ధిగా ఆ నాణాలన్నీ ఏరి ఆ రుమాల్లో మూటగట్టు!" అన్నాడు.

కింద కూర్చుని, టార్చి వెలుగులో కింద పడున్న నాణాలన్నీ ఏరి కర్చీఫ్‌లో వెయ్యసాగాను.

"అదుగో, టెలిఫోను బాక్సులో ఇంకొన్ని వున్నట్టు

న్నాయి" అన్నాడు కానిస్టేబులు.

అవీ దులిపి, రుమాల్లో పడేసి మూటగట్టాను.

"దాన్నిలా ఇవ్వు!"

మూట అతని చేతికందించి, "మీరు చెప్పినట్టల్లా విన్నాను. ఇక నేను చెప్పేది కాస్త వింటారా?" అడిగాను ప్రాధేయపూర్వకంగా.

"నేనేం వినదల్చుకోలేదు. బూత్‌లోంచి బైటికిరా!"

"నేను నిరపరాధినని నిరూపించుకునే అవకాశం కూడా ఇవ్వరా?" అడిగాను దీనంగా.

"అంటే, నేను కళ్ళారా చూపింది కూడా అబద్ధమే నంటావా?"

నేను జవాబిచ్చేలోపలే, అంతవరకూ మౌనంగా టార్చి వెలిగిస్తూ నిల్చున్న కానిస్టేబులు కల్పించుకుని, "అతను చెప్పేది వినడం మంచిదేమో!" అన్నాడు.

దాంతో మొదటి కానిస్టేబులు శాంతించి, "ఊఁ, ఏడు!" అన్నాడు.

"సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో నేనూ, నా ముగ్గురు మిత్రులూ మా కార్లో షికారుకు బైలుదేరాం! ఎన్నిమిదిన్నర వరకూ మెరీనా బీచ్‌లో గడిపి, నా స్నేహితుల్ని వారి వారి ఇళ్ళదగ్గర దింపి, నా ఇంటికి పోతుండగా పార్కువద్ద కారు చెడిపోయింది.

అదృష్టవశాత్తూ ఈ పబ్లిక్ బూత్ కనిపించేసరికి, ముందు యింటికి ఫోనుచేసి, నాన్నకు కారు చెడిపోయిన సంగతి చెప్పి, తర్వాత వర్క్‌షాప్‌కు ఫోనుచేసి మెకానిక్‌ని పిలిపించాలని...."

"బూత్‌లో కొచ్చావు. జేబులు తడుముకుంటే చిల్లర కనిపించలేదు. ఎందుకంటే మెరీనా బీచ్‌లో రెండు గంటల

పాటు నువ్వూ, నీ స్నేహితులూ వేరుశనగలూ, బఠాణీలూ తెగనముల్తూ డబ్బు తగలేశారు కదా, అందుకని టెలిఫోను బాక్సు పగలగొట్టి చిల్లర తీశావు అంతేనా?"

నేను జవాబిచ్చేలోగా రెండో కానిస్టేబులు అందుకున్నాడు. "అలాచేస్తే టెలిఫోను చెడిపోతుందని అతనికి తెలియదా? మరి ఫోనెలా చేస్తాడు? అతను చెప్పేది విను ముందు."

"ఊఁ. చెప్పి తగలడు."

"ఫోను చెయ్యాలనే వుద్దేశంతో బూత్‌ను సమీపించానో లేదో. సరిగ్గా అదే సమయంలో చటుక్కున బూత్ తలుపు తెరుచుకుని ఓ వ్యక్తి బైటికి వచ్చి. చరచరా చీకట్లో కలిసిపోయాడు. అతన్ని స్పష్టంగా గమనించలేకపోయాను.

బూత్‌లోకి వచ్చి చూస్తే పగిలిన టెలిఫోను బాక్సూ, కిందపడ్డ చిల్లర నాణాలూ, బాక్సుమీదున్న ఆ ఇనుప ముక్కా కనిపించాయి. నేను చేసిన తప్పల్లా అనాలోచితంగా ఆ ముక్కను చేతిలోకి తీసుకోడమే. అదే సమయంలో మీరు రావడం జరిగింది."

"బాగానేవుంది కథ! ఏదో కారన్నావు కదూ? ఎక్కడుంది బాబూ నీ కారు?"

"పార్కు టర్నింగ్‌లో! బ్రౌన్ కలర్ అంబాసిడర్ కారు."

"చూద్దాం రా!"

బూత్‌లోంచి బైటికి వచ్చాను. ఇద్దరూ నా చెరోపక్క చేరారు. పార్కు మలుపు దగ్గరికి తీసికెళ్ళాను వారిని రోడ్డు మీద జనసంచారం లేదు. అప్పుడప్పుడూ ఒకటీ అరా వాహనమో, సైకిలో సాగిపోతున్నాయి.

రోడ్డు పక్కన ఆగివున్న అంబాసిడర్ కారుని చూడ

గానే, "దాని తాళం చెవులేవి?" అడిగాడు కానిస్టేబులు.

తీసిచ్చాను.

"ఇందులో ఇగ్నిషియన్ కీ ఏది?"

చూపాను వేలితో.

డ్రైవింగ్ సీట్ డోర్ తెరిచి, స్టీరింగు ముందు కూర్చున్నాడతను. కీని ఇగ్నిషియన్ హోల్లో దూర్చి తిప్పాడు. సెల్ఫ్ స్టార్టర్ గరగర శబ్దం చేస్తోందే కానీ, ఇంజను స్టార్ట్ కావడంలేదు.

నిట్టూర్చాను తేలిగ్గా.

సాలోచనగా తలూపాడు కానిస్టేబులు. "కారు చెడి పోయి వున్నంత మాత్రాన ఇతను దొంగతనం చెయ్య డానికి ప్రయత్నించలేదని ఏమిటి గ్యారంటీ?"

"దొంగతనం చేశాక చెడిపోయిన కార్లో ఎలా పారి పోతాడు?" అంటూ నావైపు తిరిగి, "నీ పేరేమిటి?" అడి గాడు రెండో కానిస్టేబులు.

చెప్పాను.

"తండ్రి పేరు?"

అదీ చెప్పాను.

"కారు రిజిస్ట్రేషను ఆయన పేరుమీదే వుందా?"

తలూపాను.

"నీ డ్రైవింగ్ లైసెన్సు ఏది?"

జేబులోంచి తీసిచ్చాను లైసెన్సు బుక్. అందులో అతి కించి వున్న నా ఫోటో, దానిమీద వేసివున్న ఆర్.టి.ఓ. స్టాంప్, సంతకం చూపి సాలోచనగా తలూపాడతను. "ఇంతవరకూ నువ్వు చెప్పిందంతా సబబుగానే వుందనిపి స్తోంది."

"అనిపించడం కాదు. అది అక్షరాలా నిజం! ఇక

నన్ను వెళ్ళనిచ్చి, బూత్‌లోంచి బైటికి వస్తుండగా నేను చూసిన ఆ రెండో మనిషి కోసం వెతకండి. ఇప్పటికే ఆలస్యమైంది. సాధ్యమైనంత త్వరగా నేను మా ఇంటికి ఫోనుచేసి, కారు పాడైన సంగతి చెప్పి, ఆ తరవాత మోటార్ గ్యారేజ్‌కు ఫోను చెయ్యాలి'' అన్నాను అసహనంగా.

''చూడబ్బాయ్, పోలీస్ డిపార్ట్‌మెంట్లో మా సర్వీసంత వయసు కూడా వున్నట్టు కనిపించడం లేదు నీకు. నీలాంటి చిట్టిబాబుల్ని ఎంత మందిని చూశామో ఇహ అంచనా వేసుకో! నీ కారూ, జోరూ, డ్రైవింగ్ లైసెన్సూ చూడగానే ఐసైపోయి వదిలేస్తామనుకున్నావా?

ఏ స్థితిలో మేము నిన్ను చూశామో, అది పూర్తిగా తేలేవరకూ నిన్ను విడిచిపెట్టే అధికారం మాకు లేదు మా ఆఫీసర్లకు తప్ప! పోలీస్ రికార్డులో నీ పేరింతవరకూ ఎక్కడా, ఎప్పుడూ, ఏ విషయంలోనూ పొందుపర్చబడ లేదని ఏమిటి గ్యారంటీ?''

''ఈ జన్మలో కాదుకదా, వెనుకటి ఏ జన్మలోనూ నా పేరు పోలీసు రికార్డులో లేదు. ఇలాంటి చిల్లర దొంగ తనాలు చేసేటంతటి గతిలేనివాణ్ణి కాను నేను'' అన్నాను కటువుగా.

కానిస్టేబులు నవ్వి ''అబ్బాయ్, అనవసరంగా కోపం తెచ్చుకుని, మాకు కోపం తెప్పించక! ఇలాంటి పనులు చేసిన ఎందరో ఘరానా పిల్లల్ని మేము చూశాం! అందుకు అనేక కారణా లుంటాయి. తండ్రి ధనవంతుడే అయినా, పిల్లల జేబు ఖర్చుకు తగినంత డబ్బివ్వని పిపినారి కావచ్చు!

లేదా, నెలకింత చొప్పున జేబుఖర్చులకు డబ్బిచ్చినా,

ఈ నాటి పిల్లలకు ఆ మొత్తం ఏ మూలకూ చాలక, ఇంట్లో అదనంగా అడగలేక, ఇలాంటి పనులకు పూనుకోవచ్చు. లేదా, డబ్బవసరం లేకున్నా ఈ నాటి సినిమా ప్రభావంవల్ల హీరోగారు చేసే ఘనకార్యాల్లాటివి తామూచేసి, కేవలం మానసికానందం పొందాలనే ఉద్దేశంతోనూ చెయ్యవచ్చు. ఆ విషయాలేవో హెడ్ క్వార్టర్స్‌లో ఇన్‌స్పెక్టర్‌గారు నిర్ణయిస్తారు. పద మా వెంట!'' అన్నాడు.

“మరి నా కారు?'' అడిగాను ఉరిమి చూస్తూ.

“అక్కణ్ణించే మీ నాన్నకూ, మోటార్ గ్యారేజ్‌కూ ఫోను చేద్దువుగాని, పద!'' గత్యంతరం కనిపించడంలేదు. మౌనంగా అనుసరించాను వాళ్ళని.

2

క్రైం బ్రాంచ్ హెడ్ క్వార్టర్స్ చేరుకున్నాక చూసుకున్నాను రిస్టువాచీ.

రాత్రి పదిన్నరవుతోంది!

కానిస్టేబుళ్ళ వెంట లోనికెళ్ళి మెట్లగుండా పైఅంతస్తు చేరుకున్నాను.

నడవా కిరుప్రక్కలా ఆఫీసు గదులున్నాయి. కానిస్టేబుళ్ళు నన్ను ఓ గదిముందు నిల్చోబెట్టారు. అప్పుడు చూశాను గుమ్మానికి బిగించివున్న నేమ్‌ప్లేట్.

ఇన్‌స్పెక్టర్ యుగంధరరెడ్డి.

ఆ పేరు చూడగానే ఎందుకో గుండెలో గుబులు ప్రారంభమైంది.

ఓ కానిస్టేబులు ముందు లోనికెళ్ళి, రెండు నిమిషాల తరవాత బైటికి వచ్చి, “పద లోపలికి!'' అన్నాడు నాతో.

స్ప్రింగ్ డోర్స్ తీసుకుంటూ వారివెంట లోనికి నడిచాను. టేబిల్ కవతల వైపు కూర్చున్న ఇన్‌స్పెక్టర్

యుగంధర రెడ్డి బెబ్బులిలా తోచాడు నా కంటికి. నా వైపు చూస్తున్న ఆయన చూపులు గామా కిరణాల్లా చర్మాన్ని తొలుచుకుంటూ శరీరంలోకి చొచ్చుకుపోతున్నట్టు తోచి బిత్తర చూపులు చూడసాగాను.

నన్ను కింది నించి మీది వరకూ ఎక్స్‌రే తియ్యడం పూర్తయ్యాక, కానిస్టేబుళ్ళ వైపు తిరిగి, "ఏం చేశాడితను?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

టెలిఫోను బూత్ దగ్గర నాతో ఎక్కువగా మాట్లాడిన కానిస్టేబులు జరిగిందంతా పూస గుచ్చినట్టు వివరించి, నా కర్చీఫ్‌లో మూటగట్టిన నాణాలు టేబులు మీదుంచాడు.

ఇన్‌స్పెక్టర్ సాలోచనగా తలూపి, నోట్‌బుక్ తెరుస్తూ "నీ పేరేమిటి?" అడిగాడు నాతో.

"సూర్యప్రకాశ్!"

"వయస్సు?"

"పందొమ్మిది!"

"తండ్రి పేరు?"

"సత్యనారాయణ!"

"వృత్తి?"

"పయొనీర్ సిండికేట్ మేనేజింగ్ డైరెక్టర్!

"ఇంటి చిరునామా?"

"ఏ.జడ్, ఫిఫ్టీసిక్స్, నైంటీన్, క్రిష్ణమాచార్య స్ట్రీట్!"

"ఫోను నెంబర్?"

చెప్పాను.

"సాయంత్రం నీ వెంట కార్లో నీ స్నేహితులెవరో వున్నారన్నావు కదూ? వారి పేర్లేమిటి?"

"బి.ఎన్. శాస్త్రి, లక్ష్మయ్య, సుధాకర్.

"వారి చిరునామాలు?"

చెప్పాను. "సుధాకర్ అనే స్నేహితుణ్ణి అతనింటి వద్ద దింపి బైలుదేరుతుండగా పార్కు దగ్గర కారు ఫైల్ అయింది. ఆ సంగతి నాన్నకు తెల్పుదామని, ఆ టెలిఫోను బూత్‌ను సమీపించానో లేదో, ఓ వ్యక్తి విసురుగా బూత్ లోంచి బయటపడి గబగబ చీకట్లో కలిసిపోయాడు.

ఇన్‌స్పెక్టర్ కానిస్టేబులు వైపు తిరిగి, "ఇతని తండ్రికి ఫోను చేసి వెంటనే ఇక్కడికి రమ్మని చెప్పు. ఈ వ్యవహారం త్వరగా ముగించి, మరో కేసుమీద బైలుదేరాలి నేను" అన్నాడు.

"ఏదైనా మర్డర్ కేసా సార్?" అడిగాడు కానిస్టేబులు ఫోనందుకుంటూ.

"కాదు. పది నిమిషాల క్రితం ఓ అమ్మాయి తండ్రి ఫోను చేశాడు. తన కూతురు సాయంత్రం పూట యిప్పుడే వస్తానని వెళ్ళి, ఇంతవరకూ ఇల్లు చేరలేదని. ఆమె స్నేహితులందరి ఇళ్ళకూ వెళ్ళి విచారించాడట. జాడ తెలియ లేదట.

ఏ రోడ్డు ప్రమాదానికో గురైందేమోనన్న అనుమానంతో నగరంలోని అన్ని హాస్పిటళ్ళకూ ఫోనుజేసి కనుకున్నాడట. ఐనా, ఆచూకీ దొరకలేదట. చివరి ప్రయత్నంగా మాకు తెలియజేశాడు."

కానిస్టేబులు రిసీవర్ ఎత్తి మా ఫోను నెంబర్ రింగ్ చెయ్యసాగాడు.

ఇన్‌స్పెక్టర్ నా వైపు తిరిగి, "నువ్వు ఏం చేస్తున్నావ్?" అడిగాడు.

"చదువుకుంటున్నాను."

"ఏమిటి?"

"బి.కాం. ఫస్టియర్!"

"ఏ కాలేజీలో."

"గాంధీ మెమోరియల్ కాలేజీలో!"

ఇన్‌స్పెక్టర్ కనుబొమలు ముడిపడ్డాయి. "ఆ కాలేజీలో చదివే సరిత అనే అమ్మాయి తెలుసా నీకు?"

"తెలుసు! నాకన్న సీనియర్ క్లాసు ఆమెది. బి.కాం. ఫైనలియర్ స్టూడెంట్." వివరాలు చెప్పానేగానీ ఇన్‌స్పెక్టర్ హఠాత్తుగా నా సంగతి వదిలి సరిత గురించి ఎందుకడుగుతున్నాడా అని చాలా ఆశ్చర్యం వేసింది.

"ఆ క్లాసులో ఆమెతోబాటు ఇతర అమ్మాయిలు కూడా ఉన్నారా?"

"ఉన్నారు. నలుగురైదుగురు."

"సరిత మనస్తత్వం ఎలాంటిది?"

"చాలా కలుపుగోలు మనిషి. ఆడా, మగా అందరితోనూ చనువుగా మాట్లాడుతుంది. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ వుంటుంది. ఐతే. మా మధ్య ఎప్పుడూ మాటలు జరగలేదు. కారణం, నేను ఆమెకన్నా జూనియర్ విద్యార్థిని. సీనియర్ స్టూడెంట్లు, జూనియర్ విద్యార్థులతో మాట్లాడటాని కంతగా ఇష్టపడరు."

"కాలేజీలో ఆమెకెవరైనా బాయ్‌ఫ్రెండ్స్ వున్నారా? ఐమీన్ క్లోజ్ ఫ్రెండ్స్!"

"అందరితో ఆమె మామూలుగావున్నా చంద్రమోహన్ అనే ఆమె క్లాస్‌మేట్‌తో మాత్రం కాస్త చనువుగా వుంటుంది వారి మధ్య ప్రేమ గొడవ కూడా నడుస్తున్నట్టు కాలేజీలో అందరూ చెవులు కొరుక్కుంటున్నారు. సాయంత్రాలు అప్పుడప్పుడూ వాళ్ళిద్దర్నీ బీచ్‌లో చూశా

రట కొందరు. నిజం ఏమిటో నాకు తెలీదు. ఇంతకీ ఇవన్నీ ఎందు కడుగుతున్నారు సార్?" అడిగాను ఇక వుండబట్టలేక.

"ఇందాక ఓ అమ్మాయి కనిపించడం లేదని ఆమె తండ్రి ఫోను చేశాడన్నానే, ఆమే సరిత! తన కూతురు గాంధీ మెమోరియల్ కాలేజీ స్టూడెంట్ అని చెప్పాడాయన. నువ్వూ అదే కాలేజీలో చదువుతున్నానని చెప్పేసరికి వివరాలు తెలుసుకుందామని అడిగానంతే! ఈ రోజు సాయంత్రం ఆమె ఇంట్లోంచి బైలుదేరి చంద్రమోహన్ని ఏ బీచ్ లోనో కలుసుకుని వుంటుందంటావా?"

"ఏమో. చెప్పలేను ఖచ్చితంగా!"

అంతలో స్ప్రింగ్ డోర్స్ అవతలి నించి, "మే ఐ కమిన్ సర్?" అన్న సుపరిచిత కంఠం వినిపించింది.

"ఎస్, కమిన్!" అన్నారు ఇన్స్పెక్టర్.

డోర్స్ తోసుకుంటూ లోనికి వచ్చారు మా నాన్న!

"కూర్చోండి" అన్నాడు ఇన్స్పెక్టర్ కుర్చీ చూపుతూ.

"ఏం చేశాడు మా అబ్బాయి?" అడిగాడు నాన్న కూర్చుంటూ.

చెప్పాడు ఇన్స్పెక్టర్.

"మా వాడికి టెలిఫోను బూత్‌లు పగలగొట్టి చిల్లర దొంగిలించే గతేం పట్టింది?" అడిగారు నాన్న కాస్త తీక్షణంగా.

"అదంతా నాకు తెలీదు. మా బీట్ కానిస్టేబుళ్ళ కథనాన్ననుసరించి, సరైన విచారణ జరిపి అతను దోషి ఔనో, కాదో నిర్ధారణ చేసుకోడం నా విధి. ప్రస్తుతం నేను మరో ముఖ్యమైన పనిమీద వెళ్ళవలసి వుంది గనుక, అంతవరకూ ఇతన్ని కస్టడీలో వుంచడం భావ్యం కాదని భావించి,

మిమ్మల్ని పిల్చి రేపితను మళ్ళీ ఇక్కడికి వచ్చి నన్ను కలుసుకునేలా మీ వద్ద పూచీకత్తు తీసుకుని విడిచిపెట్టాలని కబురుపెట్టాను."

"సరే. ఎన్ని గంటలకు రావాలి రేపు?"

"మా కారణంగా రేపితని కాలేజీ పాడుకావడం కూడా నా కిష్టంలేదు. అందుకని కాలేజీ వదిలాక, ఐదు గంటలకు పంపించండి."

నాన్న తలూపి, నన్ను పరీక్షగా చూస్తూ, "నీ మోకాళ్ళ మీద పాంటుకు ఆ మట్టి మరకలేమిటి?" అడిగారు అనుమానంగా.

వంగి చూసుకున్నాను. "బహుశా, టెలిఫోను బూత్‌లో కానిస్టేబుళ్ళ అజ్ఞ ప్రకారం నేలమీది నాణాలు ఏరుతున్నప్పుడు అంటివుంటుంది" అంటూ చేతులతో దులిపాను పాంటును. ఐనా, ఆ మట్టిమరకలు పూర్తిగా పోలేను.

"ఇక్కడికి తీసుకొచ్చాక మీ అబ్బాయిని చితక బాదామనుకుంటున్నారా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

నాన్న తలూపి, "అనుమానంమీద కస్టడీలోకి తీసుకున్న వాళ్ళతో పోలీసులెలా ప్రవర్తిస్తారో పత్రికల్లో చదవడం, వినడం జరిగింది. అందుకే రవంత అనుమానం కలిగిన మాట నిజమే!" అన్నారు.

ఇన్‌స్పెక్టర్ నవ్వి—"పత్రికల్లో చదివి, ఆ నోటా ఈ నోటా విని ప్రజలు మా పట్ల చాలా దురభిప్రాయం ఏర్పరచుకున్నారు. నిజానికి మేమంత క్రూరులం కాము. అందరిలా మేమూ మనుషులమే. ఐతే, కొన్ని పరిస్థితుల్లో మా వృత్తిధర్మం దృష్ట్యా కాస్త కఠినంగా ప్రవర్తించక తప్పదు మరి!" అంటూ ఓ తెల్ల కాగితం తీసి, నాన్న ముందుకి తోసి, "పూచీకత్తు రాసివ్వండి" అన్నాడు.

నాన్న ఆయన చెప్పినట్టు రాసి, సంతకంపెట్టి, "ఇక మేము వెళ్ళవచ్చా?" అడిగారు లేస్తూ.

తలూపాడు ఇన్‌స్పెక్టర్.

నా భుజం తట్టి—"పద!" అన్నారు నాన్న.

3

"హలో, సూర్యప్రకాశ్!" అన్న పిలుపు విని చటుక్కున వెనుదిరిగి చూశాను.

సుధాకర్!

"రా, నీకోసమే వెదుకుతున్నాను. పద. క్యాంటీనులో కూర్చుని మాట్లాడుకుందాం!" అంటూ కాలేజీ ఆవరణలో వున్న కాంటీనువైపు నడిచాను.

రాత్రి నాన్నతో ఇంటి కెళ్ళగానే సుధాకర్‌కు ఫోనుచేసి జరిగిందంతా వివరించాను. పోలీసులు అతన్ని వాకబ్ చేస్తే జరిగింది జరిగినట్టు చెప్పమని కోరాను. ముఖ్యంగా అతన్ని నేను ఇంటివద్ద దిగబెట్టిన సమయాన్ని.

"నువ్వన్నట్టే జరిగింది. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఇద్దరు కానిస్టేబుళ్ళు మా ఇంటికి వచ్చి అడిగారు. నువ్వు చెప్పినట్టే చెప్పాను వాళ్ళకు" అన్నాడు సుధాకర్ క్యాంటీన్లో కూర్చున్నాక.

"వెరీగుడ్! దాంతో నేను చెప్పిందంతా నిజమేనని నమ్మకం కలగవచ్చు వాళ్ళకు. నా ఖర్మకాలి ఈ రొంపిలో దిగబడ్డాను."

"అది సరేగానీ, నువ్వు మా యింటివద్ద నన్ను దిగబెట్టి వెళుతున్నప్పుడు సరితని చూశావా?"

"లేదే! రాత్రి పోలీసులు కూడా ఆమెగురించి అడిగారు నన్ను. నిన్న సాయంత్రంనించీ కనిపించడం లేదట! వాళ్ళ నాన్న పోలీస్ రిపోర్టిచ్చాడట. ఇంకా యిల్లు చేర

లేదా?''

"లేదు. మా వీధిలో మా యింటికి నాలుగిళ్ళవతలే వుంటుంది సరిత యిల్లు. ఉదయం పోలీసులు మా యింటికి వచ్చినప్పుడు ఆమె గురించి కూడా అడిగారు. ఈ మధ్య కాలేజీలో ఆమెకూ, చంద్రమోహన్‌కూ పొసగడంలేదని పుకారు బైలుదేరింది.

అందుకే కాబోలు ఆమె ఈ మధ్య అతనికి దూరంగా వుంటూ. నిరంజన్ అనే ఆమె క్లాస్‌మేట్‌తో చనువుగా తిరుగుతోందిట. ఒకటి రెండు సార్లు వాళ్ళిద్దర్నీ సాయంత్రం పూట పార్కులోనూ, బీచ్‌లోనూ చూశారట కొందరు.

కాలేజీకి రాగానే నిరంజన్ని అడిగాను, ఆమె గురించి. నిన్న సాయంత్రం ఆమె తనని శివశక్తి టాకీసు దగ్గర కలుసుకున్న మాట నిజమేననీ, ఆ టాకీస్‌లో తామిద్దరూ బ్రూస్‌లీ నటించిన రిటర్నాఫ్ ది డ్రాగన్ సినిమా చూశామనీ, ఆ తరువాత ఆటోరిక్షాలో తను ఆమెని మా వీధిలో దిగబెట్టి వెళ్ళాననీ చెప్పాడు.

అతను చెప్పింది నిజమే అయితే సరిత ఇంటికెళ్ళకుండా ఇంకెక్కడికెళ్ళుంటుంది? సినిమా తొమ్మిది గంటలకు వదులుతుంది గనక, వాళ్ళిద్దరూ ఆటోలో మా వీధికి చేరేసరికి తొమ్మిందింబావయుంటుంది. దాదాపు అదే సమయంలో నువ్వు నన్ను మా యింటివద్ద దింపి వెళ్ళావ్. అందుకే అడిగాను మా వీధిలో ఆమె నీకు ఎదురైందా అని?''

"లేదు. వీధిలో వచ్చేపోయేవాళ్ళని నే నంతగా గమనించలేదు. ఐనా ఇతర్ల గొడవ మనకెందుకు? నా తలనొప్పి నా కుంటే!'' అన్నాను చేతి గడియారం చూసు

కుంటూ.

క్లాసు పైమైంది. ఇద్దరం లేచి కాలేజీలో కెళ్ళాం!

4

"మే కమిన్ సర్?"

"ఎస్. ప్లీజ్!" వినిపించింది లోపలినించి.

స్ప్రింగ్ డోర్స్ తోసుకొంటూ లోన అడుగు పెట్టాను.

"రా, కూర్చో!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ యుగంధరరెడ్డి గంభీరంగా.

వెళ్ళి ఆయనకెదురుగా వున్న కుర్చీలో కూలబడ్డాను. కాలేజీ వదిలాక ఇంటికెళ్ళి స్నానం అదీ కానిచ్చి బైలుదేరుతుంటే, నాన్ననుకూడా నా వెంట వెళ్ళమంది అమ్మ. అందుకాయన నిరాకరించి, నేను చిన్నపిల్లవాణ్ణి కాననీ, ఈ వయసులోనూ పెద్దవాళ్ళ తోడు చూసుకుంటే ముందు ముందు యెదురయ్యే యిలాటి యిక్కట్లను యెదుర్కొనే ధైర్యం నాలో లుప్తమౌతుందనీ అన్నారు.

అందుకే నేనే బైలుదేరాను ఒంటరిగా!

ఇన్‌స్పెక్టర్ నన్ను పరీక్షగా చూసి, "నీగురించి వాకబ్ చేశాం! ఇదివరకెప్పుడూ నువ్వు మా రికార్డులో కెక్కలేదని తెలిసింది" అన్నాడు.

"థాంక్స్! ఐతే దురదృష్టవశాత్తూ యిప్పుడు నేను చెయ్యని నేరంలో మీ అనుమానానికి గురయ్యాను. మొదటి నించీ నా కిలాంటి వ్యవహారాలంటే చాలా భయం!"

"కావచ్చు. ఐతే ఈమధ్యే మేమొక అబ్బాయిని అరెస్టు చెయ్యడం జరిగింది. అతనుకూడా నీలాగే మంచి విద్యార్థి. గొప్ప కుటుంబీకుడు. ఎన్నడూ పోలీస్ రికార్డుల్లో పడని

మంచి నడవడి కలవాడు. ఐతే, మొన్న స్నేహితులతో పందెం కట్టి మూర్‌మార్కెట్‌వద్ద ఓ స్కూటర్ దొంగిలిస్తూ పట్టుబడ్డాడు. మనిషికి యెప్పుడేం బుద్ధి పుడుతుందో చెప్పలేం కదా?

నువ్వు నిజం చెప్పకుండా ఏమైనా దాస్తుంటే, ఇప్పటికీ ఏం మించిపోలేదు. జరిగింది జరిగినట్టు చెప్పమని సలహా యిస్తున్నాను. అది నీకూ, నాకూ మంచిదని నా అభిప్రాయం!"

"నా నోటిద్వారా నిజానికి బదులు అబద్ధాన్ని కక్కించా లనుకుంటున్నారా? పరిస్థితులు నాకు యెంత వ్యతిరేకంగా మారినా సరే నామీద మోపబడ్డ ఆరోపణ పూర్తిగా నిరాధారమైనదని నొక్కి చెబుతున్నాను."

"ఆ సంగతలా వదులు. నిన్నరాత్రి తొమ్మిదింబావు ప్రాంతంలో నీ స్నేహితుడు సుధాకర్‌ని అతనింటివద్ద దింపి పార్కు ముందునించి యింటికి వెడుతుండగా మీ కారు పాడైందన్నావు కదూ?

ఉదయం నీ స్నేహితుడిదగ్గరికి మా కానిస్టేబుళ్ళని పంపి విచారిస్తే నువ్వు చెప్పిందంతా నిజమేనని తేలింది. ఐతే, దాదాపు అదే సమయంలో సరితనుకూడా ఆమె స్నేహితుడు నిరంజన్ ఆ వీధిలో దిగబెట్టాడని తెలిసింది. ఆమెని చూశావా నువ్వు?"

"లేదు!"

"బాగా ఆలోచించుకుని చెప్పు. చూశావేమో!" ఇన్‌స్పెక్టర్ కంఠంలో పూర్తి విశ్వాసం వ్యక్తమౌతోంది.

సన్నగా వణుకు ప్రారంభమైంది నాలో. "లేదు. చూళ్లేదు" అన్నాను గట్టిగా.

"ఆమె యెలా వుంటుంది? ఐమీన్ ఒడ్డూ పొడుగు?"

"ఆమెపట్ల నేనెప్పుడూ పెద్దగా శ్రద్ధాసక్తులు చూప లేదు. చెప్పుకోతగ్గ అందగత్తె కాదు సామాన్యంగా వుంటుంది. ఐతే, ఒకసారి చూపినవారు మరొక్కసారి చూడాలనిపించే ఆకర్షణ ఏదో ఆమెలో వుందని ఒప్పుకోక తప్పదు, ముఖ్యంగా ఆమె నడక!

"తన సహాధ్యాయి లందరితోనూ కలుపుగోలుగా వుంటుందని ముందే చెప్పాను. ఐతే, ముందు చంద్ర మోహన్‌తో చనువుగా వుండేదని చెప్పుకునేవారు. ఐతే, ఈమధ్య వారి స్నేహం బెడిసి, ఆమె నిరంజన్‌తో ఎక్కువగా కనిపిస్తోందని తెలిపింది ఈ రోజే!"

"నువ్వు కూడా ఆమెపట్ల ప్రత్యేక ఆసక్తి కనబర్చే వాడివని తెలిపింది నాకు. మరి దీనిగురించేమంటావ్?"

ఉలిక్కిపడ్డాను. కొంపదీసి ఉదయం సుధాకర్ చెప్ప లేదుకదా ఈ సంగతి? "ఎవరు చెప్పారు మీతో?" అడిగాను వుబుకుతున్న కోపాన్ని తాళలేక.

"ఎవరో ఒకరు చెప్పార్లే!"

"ఐతే వాడికేదో పిచ్చిపట్టినట్టుంది. వెంటనే పిచ్చాసు పత్రిలో చేరమని చెప్పండి....సరిత నా కన్నా రెండు సంవత్సరాలు సీనియర్ స్టూడెంటు. సీనియర్ స్టూడెంట్లు జూనియర్ విద్యార్థులపట్ల ఆసక్తి చూపరని మీకు వేరే చెప్పనవసరంలేదనుకుంటాను."

"నువ్వామె నెప్పుడూ అల్లరిపెట్టడానికి ప్రయత్నించ లేదా?"

"ఇన్‌స్పెక్టర్! అనవసరంగా మీరు నన్ను రెచ్చగొడు తున్నారు. ఆమె వయసులో నాకన్నా పెద్దదనీ, ఆమె ముందు నేను చిన్నపిల్లాడికన్నా ఎక్కువ ప్రాముఖ్య లేని వాణ్ణనీ మర్చిపోతున్నారు."

"నీది ఉడుకు రక్తం! అందుకే అంతగా ఉద్రేకపడు తున్నావ్! ఈ రోజుల్లో నీకన్నా చిన్నవయసు కుర్రాళ్ళెం దర్నో తమకన్నా రెట్టింపు వయసుగల అమ్మాయిల్ని ఏడి పించడం చూశాను నేను."

"కావచ్చు. ఐతే, నేనలాంటివాణ్ణి మాత్రం కాను. ఐనా, మీరు అసలు విషయాన్ని వదిలేసి, నాకు సంబంధం లేని అనవసర విషయాలు యెందుకు చర్చిస్తున్నారు నాతో?"

ఇన్స్పెక్టర్ ముఖం గంభీరంగా మారిపోయింది. "ఇది అనవసర విషయం కాదు. రాత్రి ఏ పార్కు సమీపంలో నీ కారు చెడిపోయిందో, సరిగ్గా ఆ పార్కులోనే ఈ ఉదయం సరిత శవం కనిపించింది."

నోరు తెరిచాను. "శవమా!"

"ఔను. ఎవరో ఆమెను బలత్కరించడానికి ప్రయ త్నించి, ఆమె ప్రతిఘటించడంతో రెచ్చిపోయి, గొంతు పిసికినట్టున్నారు. శరీరంమీద అక్కడక్కడా దెబ్బల గుర్తులు కూడా వున్నాయి."

"ఐతే, ఆమెని చంపింది కూడా నేనేనని మీ అభి ప్రాయం? ముందు నామీద టెలిఫోనుబూత్ దోచుకున్నానని నేరం మోపారు. ఇప్పుడు హత్యవంటి ఘోరమైన నేరం కూడా మోపుతున్నారు. మీ కళ్ళకు నేను ఒకే సమయంలో అనేక నేరాలు చెయ్యగలిగే అసాధారణ నేరస్థుడిలా కనిపి స్తున్నానా?"

"మనిషి తలుచుకుంటే అసంభవమన్నదేదీ లేదు మరి!"

"మీరు నన్నే యెందుకు అనుమానించాలి? చంద్ర మోహన్, నిరంజన్, సుధాకర్ని కూడా అనుమానించ

డానికి అస్కారం లేదా? ముందామె చంద్రమోహన్‌తో చనువుగా వుండేది. ఇప్పుడు నిరంజన్‌తో తిరుగుతోంది.

ఆ కక్షతో చంద్రమోహనే ఆమెను పార్కులోకి తీసి కెళ్ళి చంపి వుండవచ్చు కదా? ఇక నిరంజన్ సంగతి. అతను చెప్పిన విషయాలనే మీరు నమ్మారు నిజానికి అత డామెను వీధిలో దింపకుండా తిన్నగా పార్కులోకే తీసు కెళ్ళి బలాత్కరించి, అందుకామె ఒప్పుకోకపోవడంతో ఆవేశపడి చంపివుండచ్చుగా?

అదీ నిజం కాకుంటే సుధాకర్ వున్నాడు. వాడూ నా నా క్లాస్‌మేటే. మీరన్నట్టు నాలాగే వాడూ ఆమెవైపు ఆక ర్షితుడై వుండచ్చుగా? అంతేకాదు, వాడి యిల్లూ, ఆమె యిల్లూ ఒకే వీధిలో వున్నాయి నేను వాణ్ణి ఇంటివద్ద దిగ బెట్టి వెళ్ళగానే. వాడికి సరిత కనిపించిందేమో. ఏదో సాకుతో ఆమెను దగ్గర్లోనే ఉన్న పార్కులోకి తీసుకెళ్ళా డేమో. అది సంభవం కాదా?''

"నేను వాళ్ళగురించి కాదు, నీ గురించి మాట్లాడు తున్నాను. నా హేతువాదం ప్రకారం ఏం జరిగివుంటుందో చెబుతా విను. సుధాకర్ని అతనింటిదగ్గర దింపి. బైలుదేరు తుండగా అప్పుడే తన యింటివైపు వెళుతున్న సరిత కనిపించి వుంటుంది నీకు.

కారాపి, ఆమెను పలకరించి, కాలేజీలో ఆమెపై జరుగుతున్న దుష్ప్రచారం గురించి కొన్ని ముఖ్య విష యాలు చెబుతాను రమ్మనుంటావు. సహజంగా తమకు సంబంధించిన అటువంటి విషయాలు తెలుసుకోడానికి ఎవ రైనా ఆసక్తి చూపుతారు.

ఆ కుతూహలంతోనే ఆమె కారెక్కి నీ వెంట బైలు దేరింది. తనకంటే చిన్నవాడివయిన నీ గురించి ఆమెకు

భయం కలిగివుండదు. పైగా కలుపుగోలు మనిషి. కారు పార్కు దగ్గరాపి, నింపాదిగా పార్కులో కూర్చుని మాట్లాడుకుందామని ఆమెను లోపలికి తీసికెళ్ళింటావ్.

ఆలనాపాలనాలేక ఆ పార్కు పాడుపడి వుంది నిర్మానుష్యంగా వుంటుంది. అదను చూసి ఆమెమీద పడుంటావు. ఊహించని ఆ పరిణామంతో ఆమె శాక్తిని ప్రతిఘటించి వుంటుంది. లొంగదీసుకోడానికి దెబ్బలు కొట్టివుంటావు. ఎంతకీ లొంగకపోయేసరికి అవమానం భరించలేక గొంతు నులిమేశావు.

తరవాత పారిపోదామని కారెక్కితే అది స్టార్ట్ కాలేదు. దాంతో నీ గుండె గతుక్కుమంది. పార్కుముందు నీ కారు ఆగివుండటం, లోపల సరిత శవం! పాలుతాగే పిల్లవాడు కూా చెప్పగలడు జరిగిందేమిటో? ఆ విపత్తునించి యెలా బైటపడాలా అని తీవ్రంగా ఆలోచించివుంటావు. అప్పుడు కనిపించింది నీకు పార్కు చేరువలో వున్న టెలిఫోను బూత్....”

నవ్వాను అతికష్టంమీద. “అదంతా మీ ఊహాగానం! అనుమానించదగ్గ ముగ్గురు ముఖ్యమైన యువకుల్ని వదలి, ఆమెతో ఏ సంపర్కమూ లేని నా మీద నేరం మోపుతున్నారు మీరు. కోర్టులో ఊహాగానాలు పనికిరావు ఇన్స్పెక్టర్! సాక్ష్యాలు కావాలి. ఆధారాలు కావాలి.”

నెమ్మదిగా లేచి నిల్చున్నాడు ఇన్స్పెక్టర్. “సాక్ష్యం వుంది. ఇక్కడ నావద్దలేదు. మీ యింట్లోనే వుంది! నిన్న రాత్రి నువ్వు తొడుక్కున్న పాంటు. ఉదయం హత్యా ప్రదేశాన్ని నేను నిశితంగా పరిశీలించినప్పుడు హంతకుడి మోకాళ్ళకు బాగా మట్టి అంటుకు నుండాలని స్ఫురించింది.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది నాకు! నిన్నరాత్రి నువ్వు

తొడుక్కున్న పాంటుకు అంటిన మట్టి సంగతి మీ నాన్నే స్వయంగా మా దృష్టికి తెచ్చాడు. అప్పుడేదో బొంకావు. బూత్‌లో కూర్చుని నాణాలేరుతుంటే అంటిందని.

టెలిఫోన్ బూత్‌లో ధూళితప్ప మట్టి వుండదు. బటల కంటిన ధూళిని గట్టిగా దులిపితే రాలిపోతుంది. నువ్వు యెంత దులిపినా నీ మోకాళ్ళకంటిన మట్టి పోలేదు. గుర్తుందా? ఇప్పుడు నిన్నిక్కడ కస్టడీలో ఉంచి, నేను మీ ఇంటికెళ్ళి ఆ పాంటు తెచ్చి, మా లాబొరేటరీలో పరీక్షిస్తే ఆ మట్టి యెక్కడిదో చిటికెలో తేలిపోతుంది. ఆ ఆధారం చాలనుకుంటాను కోర్టులో నీ నేరం ఋజువు కావడానికి?....”

నా కళ్ళు చీకట్లు కమ్మకోసాగాయి. ఆ పాంటు యింకా లాండ్రీకి పంపబడలేదు. లాబొరేటరీ పరీక్షలో దాని కంటిన మట్టి యెక్కడిదని తేలుతుందో నాకు బాగా తెలుసు!

ఆ ఆలోచన రాగానే నా బుర్ర చక్రభ్రమణం చెయ్య సాగింది భయభ్రాంతితో!! □

“సారీ! రాంగ్ నెంబర్!!”



కాటుకోలిన పిల్లి

కె.బి.యస్. కుమార్

"ఎక్కడి కెళ్ళాల్సార్!?" అసహనంగా అడిగాడు కండక్టర్.

"ఈ బస్సు యెందాక వెడుతుంది?" ప్రశ్నించాడా యువకుడు.

"సనత్‌నగర్, వయా పంజాగుట్ట కాలనీ...."

"అయితే సనత్‌నగర్...." కండక్టర్ చేతిలో రెండ్రూ

పాయలు కౌగితం వుంచాడా యువకుడు.

టికెట్ పంచ్‌చేసి చిల్లరిచ్చేసి మరో పాసింజర్‌కేసి దృష్టి సారించాడు కండక్టర్.

బస్సు చాల రద్దీగా వుంది. పైగా అది ఆఫీస్‌వేళ. వాతావరణంలో చలిగా వున్నా బస్సులో బాగా వెచ్చగా వుంది. కండక్టర్ మొహంలో విసుగూ చిరాకూ బాగా కన్పిస్తున్నాయి అవి యెవరిమీదా కాదు. బహుశ, బస్సులోని రద్దీని ఉద్దేశించి వుండచ్చు.

బస్సు సనత్‌నగర్ వచ్చేసింది. బ్రతుకుజీవుడా అనుకొని తాత్కాలికంగా బయటిగాలి పీల్చుకొని, డ్రయివర్‌తో కల్సి ఇరానీ హోటల్లో అడుగుపెట్టాడు కండక్టర్. రెండు 'చాయ్'లు ఆర్డరిచ్చాడు.

"ఏమైనా వుందా....?" అదో రకంగా అడిగాడు డ్రైవరు.

"ఎక్కడా!! మూడో ట్రిప్పు అప్‌లో వున్నాం. పాతిక దాకా గిట్టుబాటైంది...." చప్పగా అన్నాడు కండక్టరు.

సీజన్ టికెట్లు కొనలేని రెగ్యులర్ పాసింజర్లు కండక్టర్లు "ముఖ పరిచయం" కావడంతో టికెట్టుకి డెబ్బయ్ అయిదు పైసలో రూపాయో యివ్వాల్సిందానికి బదులుగా ఏభై పైసలో మరో పదిపైసలు కలుపుకొనో కండక్టరు చేతిలో కుక్కేసి ఆప్యాయంగా చెయ్యి నొక్కేస్తూ వుంటారు. కండక్టర్లు స్నేహపూర్వకంగా నవ్వేసి కళ్ళతోనే టికెట్లిచ్చేస్తోంటారు.

అలా సంపాదించిన బాపతది.

టీ త్రాగడం ముగించి 'ప్రభాత్' కిళ్ళీ వేసుకొని బస్సు దగ్గరి కొచ్చాడు కండక్టరు. డ్రయివరు అప్పటికే తన సీట్లో రెడీగా వున్నాడు.

బస్ కదిలింది.

టికెట్లిస్తోన్న కండక్టరు కళ్ళు ఒక వ్యక్తిని చూసి విచ్చుకున్నాయి. 'ఎక్కడికి' అన్నట్టు ఈసారి కళ్ళతోనే సైగచేశాడు.

"ఎందాక వెడుతుంది?"

"నాంపల్లి. వయా పంజాగుట్ట కాలనీ...."

"అయితే నాంపల్లి ...."

"....మీరి వూరికొత్తనుకుంటాను...." టికెట్‌ని గోటితోనే పంచ్ చేస్తూ అన్నాడు కండక్టరు.

"అవును. అందుకే ఏ బస్సు యెక్కణ్ణుండి యెందాకా వెడుతుందో అంతగా తెలీదు."

"బోర్డు చూళ్ళేదా?"

అడ్డంగా తలూపాడు ఆ యువకుడు.

"టికెట్ ....ఇంకా ఎవరయ్యా టికెట్ ....?" మిగతా వాళ్ళని అడుగుతూ ముందుకు సాగిపోయేడు కండక్టరు.

2

శవాన్ని నిశితంగా పరిశీలించాడు క్రయిం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ చక్రవర్తి. దాన్నిబట్టి ఈ క్రింది విధంగా వూహించగలిగాడు.

చనిపోయే ముందు హతుడి ముఖంలో భయం తాలూకు చిహ్నాలు లీలగా గోచరిస్తున్నాయి. అయితే చనిపోయే ముందు మరికొన్ని క్షణాల్లో తను మరణించబోతున్నాడని అతనికి తెలీదు. అలాంటప్పుడు తనని ఎవరేనా చంపవచ్చు అన్న భయం అతనికి ముందునుండే వుండాలి.

ఇంతలో ఖాకీ దుస్తుల్లో వున్న బస్ కండక్టర్ చక్రవర్తి దగ్గరగా వచ్చాడు.

"మీరేకదూ మాకు ఫోన్ చేసింది?" అన్నాడు అతన్నే

చూస్తూ.

"అవున్సార్.... నేనీ బస్ కండక్టర్ని"

"యిదివర్లో మీరితన్నెప్పుడేనా చూశారా?"

"లేస్సార్! యితడు ఈ వూరికి కొత్త వాళ్ళా గున్నాడు...."

"ఎలా చెప్పగలరు?"

"బస్సెక్కాక 'ఎందాక వెళుతుంది' అనడిగాడు. చెప్పాను. దవున్ జర్నీలోగూద అదేవిధంగా అడిగాడు...."

"సనత్‌నగర్లో దిగాలని టికెట్ తీసుకొని దిగకుండా మళ్ళీ నాంపల్లికి టికెట్ తీశాడా!?"

"అవున్సార్! ఒకసారి కాదు. మొత్తం మూడు ట్రిప్పులు."

"ఓహ్! నా బుర్ర పనిచెయ్యడం లేదు. వివరంగా చెప్పండి...."

కండక్టరు చిన్నగా దగ్గి చెప్పడం ప్రారంభించాడు.

"తార్నాకదిగంటల ప్రాంతంలో స్టేజీవద్ద బస్సెక్కాడు సార్. టికెట్లు చించి యిస్తూ అందరికీ మల్లే యితన్ని అడిగాను 'ఎందాకా' అని. ఎందాకా వెళుతుందో తెలీదులా వుంది లాస్ట్ స్టేజి ఏదని అడిగాడు. చెప్పాను. సనత్‌నగర్ చేరాక నేనూ డ్రయివరూ చాయ్ తాగాం.

"బస్సు దవున్ జర్నీకోసం కదిలింది. మొదట్లో నాకూ డవుట్ రాలేదు. సనత్‌నగర్లో బస్సు దిగ్గానే పనై పోయిందేమో వెంటనే యెక్కేశాడనుకున్నా. మళ్ళీ లాస్ట్ స్టేజీ ఏదని అడిగాడు. చెప్పాను. పాసింజర్స్ యెక్కువగా లేక పోవడంతో నాలుగు ముక్కలు మాట్లాడే అవకాశం కలి

గింది. నే నడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా తనీ వూరి క్కొత్తనీ ఏ బస్సు ఎక్కడినుండి ఎక్కడికి వెడుతుందో అంతగా తెలీదనీ చెప్పాడు.

నాంపల్లిలో పది నిమషా లాగుతుంది బస్సు. అలాగే ఆగి బయల్దేరింది. మళ్ళీ అతను అదే బస్‌లో వున్నాడు. అయితే ఈసారి అతడు బస్ దిగి మళ్ళీ ఎక్కలేదనీ అసలు దిగకుండా అలాగే కూర్చున్నాడనీ గ్రహించాను. దాన్నిబట్టి సనత్‌నగర్లో గూడ యితనిలాగే ప్రవర్తించి వుంటాడని వూహించాను.

అతను మళ్ళీ సనత్‌నగర్‌కే టికెట్ కొన్నాడు. సనత్ నగర్లో అతను దిగలేదు. మళ్ళీ అక్కడ నాంపల్లికి టికెట్ కొన్నాడు. నాంపల్లిలో అందరూ దిగారు. యితను కళ్ళు మూసుకొని వున్నాడు.

టికెట్ మళ్ళీ యివ్వొచ్చులే అనుకొని మిగత పాసింజ ర్లకు యివ్వటం మొదలుపెట్టాను. బస్సులో పదిమందిని మించి ఎవరూ లేరు. బస్సు అప్పటికే కదిలింది. అందరికీ టికెట్లిచ్చి తర్వాతి స్టేజి సమీపిస్తోందటంతో కుదిపి లేప బోయాను. దబ్బున క్రింద పడ్డాడు. చచ్చిపోయాడని తేలి పోయింది. వెంటనే బస్సు ఆపించి మీకు ఫోన్ చేశాను" అన్నాడు కండక్టరు బాధగా శవాన్ని చూస్తూ.

"అలా అక్కడికీ యిక్కడికీ అదేపనిగా ఒకే బస్సులో ప్రయాణించడాని క్కారణం అడిగారా మీరు?"

"క్యూరియాసిటీతో ఓసారడిగాను. సరదా అట...."

"మీరతన్ని చూపిన కొద్ది గంటల్లో అతని మొహంలో ఏవేనా చెప్పుకోదగ్గ మార్పులు గమనించారా?"

"లేస్సార్! జంట నగరాల్లో సిటీ బస్సులు! మనషు ల్లోని—అయ్‌మీన్ పాసింజర్ల మొహాల్లోని భావాలు చదివే

టైమ్ ఎక్కడుంది సార్ మాకు?''

"పోనీ, యితను బస్సులో ఎవరితోనయినా మాట్లాడు తోండటంకాని.అతని ప్రక్కన కూర్చున్న వ్యక్తుల్నిగాని....

"సారీ సార్....గమనించలేక పోయాను. అయినా అత డిలా మరణిస్తాడని అనుకున్నానా!?'' అని గట్టిగా అని– 'అలా వూహించేశక్తే వుంటే కండక్టర్నెందు కవుతానూ?' అని మనసులో పూర్తి చేసుకున్నాడు కండక్టరు.

"బస్సులో ఎడమవేపు అయిదవ 'టూ సీటర్'లో ముందు సీటు రాడ్పై మోచేతులు ఆన్చి వాటిపై తలవాల్చి అలాగే ప్రాణం కోల్పోయిన ఆశాల్తీని అలాగే రెండు మూడు భంగిమల్లో ఫొటోలు తీశారు.

పోలీస్ డాక్టరు సాధారణ పరీక్షలో, ఆరగంట క్రితం ప్రాణం పోయి వుండొచ్చనీ కుడితొడ పై భాగంపై ఏర్ప డిన చిన్న గాయాన్ని బట్టి పైనేడ్లో ముంచిన నీడిల్ హత్యాయుధం అయి వుండొచ్చనీ చెప్పాడు.

శవం పోలీసుల పరమైంది.

3

స్టేషనులో కూర్చొని ఇన్స్పెక్టర్ చక్రవర్తి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఎంతగా ఆలోచించినా చక్రవర్తికి అంతుబట్టలేదు, ఈ కేసులో ఎలా ముందుకు సాగాలో.

బస్సులో అంతవరకూ కూర్చొని ప్రయాణం చేస్తున్న వాళ్ళంతా అది శవమని తెలీగానే బెంబేలుపడి చెదురు మదు రుగా పారిపోయినంత పని చేశారు. బస్సులో వున్నవాళ్ళె వరూ శవాన్ని ఫలానా మనిషిగా గుర్తుపట్టలేదని కండక్టరు చెబుతున్నాడు.

హతుడు ఏ ప్రాంతానికి చెందినవాడు? మృత్యుభయంతో

అతడు బస్సులో ప్రయాణం చెయ్యడానికి కారణమేమిటి? హతుడి జేబుల్లో పదిరూపాయల చిల్లరనోట్లు తప్ప హత్యా కారణాన్ని గుర్తించే ఆధారాలుగాని తనని ఫలానాగా ఋజువు చేసే సమాచారాలు కనిపించలేదు.

మరో జేబులో దొరికిన హేండ్ కర్చిఫ్‌పై ఎరుపు 'R' అనే అక్షరం ఎంబ్రాయిడరీ చెయ్యబడి వుంది. దాని ఆధారంగా ముందుకు సాగటం అసాధ్యం.

ఛ.... వెధవ కేసు ...తల్నొప్పి మాత్రలకి గిరాకీ పెంచు తోంది అప్రయత్నంగా బయటికే అనేశాడు చక్రవర్తి.

"సార్ ...మరో కాఫీ చెప్పిరానా?" అన్నాడు సార్జంటు సారంగధర.

"ఇది కాఫీల్తో మాత్రలతో తేలికపడే కేసు కాదు. డిటెక్టివ్ జలంధర్‌కి మరోసారి ఫోనుచేసి యింటి నుండి బయల్దేరాడో లేదో కనుక్కో....."

"అలాగే సార్...."

"అవసరం లేదు. వచ్చేశాను" అన్న స్వరం వినిపించి యిద్దరూ స్టేషను గుమ్మంకేసి చూశారు.

"హమ్మయ్య—వచ్చేశావా మహానుభావా! నీ కోసమే ఎదురుచూస్తున్నాను" అన్నాడు చక్రవర్తి ఆనందంగా.

కాఫీలు తెప్పించుకొని ముగ్గురూ తాగారు. కేసులో ఇంతవరకూ జరిగింది చెప్పి, "నీ సహాయం కావాలి" అన్నాడు చక్రవర్తి.

రెడ్ విల్స్ వెలిగించుకొని ఓ నిమిషంపాటు దీర్ఘంగా ఆలోచిస్తూ వుండిపోయాడు జలంధర్.

"ఫోటో పేపర్లో వేయిస్తే?"

"ప్రయోజనం వుండొచ్చు. ప్రయత్నించు. మరో మార్గంలో కూడా వెళదాం...."

"చెప్పు గురూ! ఖ్లూ దొరకాలేగాని చొచ్చుకుపోమా!"

"ఆ కండక్టర్ని పిలిపించు. సీజను టికెట్టుకొని ఆ బస్సులో రెగ్యులర్‌గా ప్రయాణం చేస్తోన్న వుద్యోగుల్లో హత్య జరిగిన ట్రిప్పులో అతని పరిచయస్థుల వివరాలు తెలుసుకో."

"అలాగే...." ఉత్సాహంగా అన్నాడు చక్రవర్తి ఆర్టీసీ బస్ డిపోకి ఫోన్ చెయ్యటం కోసం ముందుకి వంగుతూ.

4

"హనుమంతరావుగారూ!" గట్టిగా పిలిచాడు మఫ్టీలో వున్న డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ చక్రవర్తి, ఆ యింటి తలుపు తడుతూ

అరనిమిషం తర్వాత ముప్పయ్ అయిదూ నలభై కిమధ్య వయసున్న వ్యక్తి బయటికి వచ్చాడు లుంగీ కట్ బనియన్ మీద వున్నాడు.

"ఎవరు కావాలండీ!?"

"హను...."

"నేనే హనుమంతరావుని...."

"వీరు డిటెక్టివ్ జలంధర్. నేను యిన్‌స్పెక్టర్ చక్రవర్తిని."

"నమస్కారం. కూర్చోండి...." ముక్తసరిగా అన్నాడు హనుమంతరావు.

"థాంక్స్....చూడండి. హత్య జరిగిన క్షణంలో మీరు బస్సులో వున్నారు. మీరే కాదు. మరి కొందరున్నారు. యింతమంది కళ్ళుగప్పి ఓ మనిషి నిండు ప్రాణం తీశాడు హంతకుడు. అలాంటివాళ్ళని పట్టివ్వటంలో మాకు సహకరించండి" మృదుగంభీర స్వరంతో అన్నాడు డిటెక్టివ్.

"ఈ కాలంలో ఈ సంఘంలో ఒకోసారి చూపింది చూసినట్టు చెప్పినా నేరమే సార్! ఖర్మగాలి అదే సమయంలో నేను ప్రయాణించాలా! నే నెక్కిన బస్సులోనే వాడు చావాలా!?" అంటూ విచారించాడు హనుమంతరావు.

"దీన్ని కర్మ అనుకోకూడదు రావుగారూ! సాటిమనిషి చచ్చాడు. కాదు—చంపబడ్డాడు. అఫ్‌కోర్స్—అతను దుర్మార్గుడు కావచ్చు—లేదా హంతకుడే అయివుండవచ్చు. చట్టానికి పట్టించాలి. అంతే కాని...."

"సరే....యింతకూ నేనేం చెయ్యాలి? వాడు నిజంగా చచ్చాడని కోర్టులో సాక్ష్యం చెప్పాలా!?"

హనుమంతరావు ప్రశ్నకు జలంధర్‌కి నవ్వొచ్చింది. "అవసరం లేదు. మే మడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పండి."

"అడగండి...."

"హత్య చెయ్యబడ్డ వ్యక్తిని మీ రిదివర్లో ఎక్కడైనా చూశారా!? దయచేసి నిజం చెప్పండి. మీరు యిచ్చే ఏ చిన్న ఆధారమైనా హంతకుణ్ణి పట్టిచ్చే అవకాశం వుంది."

"లేదు. ఎక్కడా చూళ్ళేదు."

"అతను చనిపోయింతర్వాత గాని చనిపోక ముందుగాని అతని ప్రక్కన మరెవరేనా కూర్చొని వుండడం చూశారా!?"

"చనిపోయాక చూళ్ళేదు. కాని—"

"కాని....?!!" ఆత్రంగా ముందుకు వంగారు జలంధర్, చక్రవర్తి.

"చనిపోక ముందు ఒక అమ్మాయి కూర్చొని వుండింది...."

"వాట్ ....!?"

డిటెక్టివ్‌ల ఎగ్జయిట్‌మెంటుని పెంచుతూ అతడు ఓ నిమిషంపాటు ఆలోచించాడు.

"బస్సు నాంపల్లిలో ఆగింది. అప్పుడు నేను కిళ్ళీ కొట్టులో సిగరెట్ కొంటున్నాను. అందరూ దిగారు. సిగరెట్ వెల్గించుకొని తెచ్చుకున్న కిరాయి నవల యిచ్చేసి యింకో నవల తీసుకొని బస్సెక్కాను. అప్పుడు అతని ప్రక్కన దాదాపు యిరవయ్యేళ్ళ అమ్మాయి కూర్చొని వుంది.

నేను వెళ్ళి వాళ్ళ వెనక 'రో' లో కూచున్నాను. కాసేపటికి ఆమె "రవీ! ఏమిటి నీ అలక బస్సులో —? మనుషులు వస్తూ వున్నారు. యిలాగైతే నేను వెళతాను...." అంది. అతను మాట్లాడలేదు. ముందుసీట్ రాడ్‌పై చేతులు ఆన్చి తల వాటిపై పెట్టుకొని వున్నాడు. ఆ తర్వాత ఆమె వెళ్ళిపోయింది."

"మళ్ళీ రాలేదా?"

"రాలేదు. అలిగి వెళ్ళిపోయిందనుకున్నాను."

"ఆమె వివాహితలా కన్పించిందా మీకు?"

తల అడ్డంగా వూపాడు హనుమంతరావు. "మెడలో ఎలాంటి హారమూ లేదు. బహూశ బావా మరదళ్ళయి వుండాలి. లేదా ప్రేమికులై వుండాలి...."

"రెండూ కాదు. ఆ పిల్లే హంతకి."

హనుమంతరావు ఆశ్చర్యంగా చూశాడు.

"బస్సు దిగాక ఆమె ఎటు వెళ్ళింది?"

"గబగబా వెళ్ళింది .... హోటల్ ఆదిత్యలోనికి."

"ఎంత నాటకమాడింది?" కోపంగా అన్నాడు జలంధర్.

"సార్!? ఆమే హంతకురాలని యెలా చెప్పగలరు?"

అన్నాడు హనుమంతరావు.

"ఆమె చాల తెలివిగా ప్రవర్తించింది హనుమంతరావు గారూ! మీరు వచ్చేసరికే విషంలో ముంచిన సూదితో రవిని పొడిచి చంపేసింది. తప్పుకుందామనుకుంటోండగా మీరు బస్సెక్కారు. మధ్యలో వెళ్ళిపోతే మీ కనుమానం వస్తుందని అతను తనపై అలిగినట్టు యిలాగైతే నేను వెళ్ళిపోతా చూడు అని మీకు అనుమానం రాకుండా వెళ్ళి పోయింది."

"మైగాడ్!"

"ఆ పిల్ల మళ్ళీ యెక్కడైనా కన్పిస్తే దయచేసి వెంటనే ఈ నెంబరుకు ఫోన్ చెయ్యండి" అని చెప్పి విజిటింగ్ కార్డు యిచ్చి ఆమెను గురించిన వర్ణన నోట్ చేసుకొని, థాంక్స్ చెప్పి బయటపడ్డా రిద్దరూ.

5

హోటలు ఆదిత్య కేషియరు డిటెక్టివ్‌నీ ఇన్స్పెక్టర్నీ సాదరంగా ఆహ్వానించాడు. వారిక్కావలపిన ఇన్ఫర్మేషన్ అందించాడు.

ఎర్రగా — రింగు రింగుల జుత్తుతో — కోలమొహంతో — ఎడమ చెంపపై అందమైన నల్లని పుట్టుమచ్చతో — ఎర్రని చీర, జాకెట్‌తో ఆకర్షణీయంగా వున్న ఓ అమ్మాయి వచ్చి ఫోను చెయ్యాలని రిక్వెస్టు చేసిందట. క్యాషియరు ఆమె అందానికీ ఆమె శరీరం నుండి వెలువడుతోన్న కొత్తరకం అత్తరు పరిమళానికీ పరవశుడవుతూ ఆమె తన ఫోను తాకితేనే దానికి పవిత్రత చేకూరుతుందన్నంత 'యిది'గా అనుమతించాడట.

ఆమె వయ్యారంగా 'థేంక్సు' చెప్పి ఏదో నెంబరుకి

డయల్ చేసి. పక్కింటి కుర్రాడొచ్చి తమ యింట్లో బార్ లైటు రిపేరీ చేశాడనీ మెయిన్ స్విచ్‌లోని ఫాల్ట్‌ని కూడా సరిజేశాడనీ మళ్ళా శ్రమపడి రావాల్సిన పన్లేదనీ 'రవి' అనే వ్యక్తితో చెప్పిందిట క్యాషియర్‌కి మరోసారి ధన్య వాదాల్చెప్పి డబ్బు యివ్వబోయిందిట.

వీణ మీటినట్టున్న ఆమె కంఠ ధ్వనికి మరింత పుల కించి డబ్బు లొద్దన్నాడట. చిలిపిగా నవ్వేసి టాటా చెప్పి తుర్రుమందిట.

క్యాషియరు కవిలాగున్నాడు. ఆ అమ్మాయిని కళ్ళెదు రుగా వూహించుకున్నాడులా వుంది, పరవశుడవుతూనే చెప్పాడు. అంతా చెప్పి, "సార్! షీ ఈజె బ్యూటీ క్వీన్ ఇండీడ్! ఈసారి కన్పిస్తే—"

"....'కన్యాశుల్కం యిచ్చి పెళ్ళాడేస్తాను ఎంతిమ్మం టావ్ చెప్పు' అనక—ఏదో వంకమీద ఆమెని నిలబెట్టి మాకు ఫోను చెయ్యి. ఆమె హంతకి!" అనేసి, చక్రవర్తి చెయ్యి పట్టుకొని బయటకు నడిచాడు జలంధర్.

అవాక్కయి—నోరు వెళ్ళబెట్టి 'మల్లిక్' కార్టూనులో బొమ్మలా చూస్తూండిపోయిన క్యాషియర్ని వాళ్ళు గమ నించలేదు.

6

టైము చూసుకున్నాడు చక్రవర్తి. సినిమాకి యింకా టైముంది. కాసేపన్నీ మర్చిపోయి రిలాక్సవాలనుకున్నాడు. డిటెక్టివ్ జలంధర్ నెంబరుకి ఫోన్ చేశాడు, కంపెనీ ఇస్తా డేమోనని.

"నీకోసం నేనే ఫోన్ చెయ్యబోతున్నాను. ఇంతలో నువ్వే చేశావు. వెంటనే వచ్చెయ్, క్లూ దొరికింది" అర్చాడు జలంధర్.

"క్లూ దొరికిందా? వెంటనే వచ్చేస్తున్నాను" సగం మత్తు వదిలిపోయింది చక్రవర్తికి.

"ఎక్కడికొస్తావ్?"

"ఎక్కడికి రమ్మంటావ్?"

"కళ్యాణి ఫొటో స్టుడియో, సీతాఫల్ మండి. నేను అక్కడికే వస్తాను."

"ఓకే...." ఫోన్ పెట్టేశాడు. బయటి కొచ్చి ఆటో పిలిచాడు. పావుగంటలో గమ్యం చేరుకున్నాడు.

కళ్యాణి స్టుడియో దగ్గర జలంధర్ ఎదురు చూస్తూ నుంచున్నాడు.

"కమాన్ కమాన్....ఇందాక హనుమంతరావు ఫోను చేశాడు. హంతకి ఫోటో యిక్కడ ఆల్బమ్‌లో వుందిట. కాసేపట్లో హనుమంతరావు కూడా యిక్కడికి వస్తాడు, ఆమె ఫోటో మనకి చూపించటం కోసం...."

"మొగాడ్! పెద్ద ఆపద నుండి రక్షించాడు. హనుమంత రావు విజిటేరియనా, నానా?"

"ఎందుకూ?"

"డిన్నర్ యిస్తాను" నవ్వాడు చక్రవర్తి.

హనుమంతరావు 'లూనా'పై వచ్చాడు.

"సార్! యింత త్వరగా ఆమె యిలా నా కంట పడు తుందనుకోలేదు. నిన్న మా ఆఫీసరు ట్రాన్స్‌ఫరైన సంద ర్భంగా పార్టీ అరేంజ్ చేసి ఫోటో తీసుకున్నాం. ప్రూఫ్ చూద్దంకోసం ఇంత క్రితమే వచ్చాను. ఇంకా కడుగు తున్నారు. కాలక్షేపం కోసం ఆల్బమ్ తిరగేస్తోంటే ఫోటో కన్పించింది. గ్రూప్ ఫోటో. స్నేహితురాళ్ళతో కల్పి తీయించుకుంది అయితే అప్పటికీ యిప్పటికీ మార్పు లున్నాయి. బహూశ, మూడు నాలుగు సంవత్సరాల క్రితం

తీయించుకున్న దనుకుంటాను. రండి చూపిస్తాను...."
అంటూ వాళ్ళిద్దర్నీ మేడపైకి తీసికెళ్ళాడు హనుమంత రావు.

ఆల్బమ్ తీసి—హనుమంతరావు ఒక గ్రూప్ ఫోటోలో హంతకిగా చూపించిన అమ్మాయిని చూసి—అప్రతిభులై పోయారు చక్రవర్తి జలంధర్లు.

ఆమె ఆ ఏరియా సబిన్‌స్పెక్టర్ రాజారావు కూతురు నీలిమ!!!

7

రాజారావు భార్య గతించి దాదాపు పది సంవత్సరాలు కావస్తోంది. నీలిమ ఒక్కతే కూతురు. అయినా తల్లిలేని లోటు ఏ మాత్రం తెలీకుండా పెంచాడా అమ్మాయిని.

నేరస్థులకూ అవినీతికీ సింహస్వప్నం రాజారావు. అలాంటి మహోన్నతమైన వ్యక్తి కడుపున పుట్టిన నీలిమ....

ఛ....ఊహకే ఘోరంగా వుంది.

ఒక నిండు మనిషి ప్రాణాలను అవలీలగా పెకలించ గలిగిందంటే అది నిజంగా ఊహాతీతమే!

'పులి కడుపున పులి పుట్టాలిగాని, రాక్షసి పుట్టిందేమిటి?' అనుకున్నాడు చక్రవర్తి. జలంధర్ కళ్ళు చింత నిప్పుల్లా మండిపోతున్నాయి.

వాళ్ళిద్దరూ ప్రస్తుతం మారువేషాల్లో వున్నారు. ఈ సమయంలో వాళ్ళిద్దర్నీ ఎవరు చూసినా డిటెక్టివ్‌గా, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పోల్చుకోలేరు. సిక్కు యువకులుగా, అన్నదమ్ములుగా భావిస్తారు.

ఇన్‌స్పెక్టర్ రాజారావు గృహం ఒక మహామాంత్రికు రాలిని—ఒక దుష్టశక్తిని దాచుకున్న గుహలా కన్పిస్తోంది

వాళ్ళిద్దరికీ. అనుమానం రాని విధంగా నుంచొని నీలిమ రాకకోసం ఎదురు చూడసాగారు.

పావుగంట— అరగంట— గంట గడిచింది. నీలిమ బయటికి రాలేదు. బోరుకొడుతోంది.

మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత వాళ్ళ కళ్ళు జిగేలు మన్నాయి. ఆ చిరుబంగళాలోంచి నీలిమ అందరికీ మయూరంలా బయటికి వస్తోంటే. వాళ్ళిద్దరికీ చిరుతలా బయటికి రాసాగింది. ఆమెని పాతిక గజాలు వెళ్ళనిచ్చి వెంటాడ సాగారు.

దాదాపు ఫర్లాంగు దూరం నడిచింది నీలిమ ఆ తర్వాత ఆటోని పిలిచింది. ఆటో కోఠీవైపు దూసుకుపోయింది.

"నీకు 'కోతి— వేరుశనక్కాయలు' కథ తెలుసునా!?" అలవోకగా నవ్వుతూ అన్నాడతను.

"ఓ కోతి గుప్పెడు వేరుశనక్కాయల్తో ఓ యింట్లో కొచ్చిందిట. దాని కా ఇంట్లో నిప్పు కణికలున్న ఓ పొయిలీ కన్పించింది. దాన్ని చూడగానే కోతికి వాటిని కాల్చుకు తినాలని బుద్ధి పుట్టింది. వెంటనే పొయ్యిలో వేసింది. కాని వాటిని కెలకటానికీ బయటికి తియ్యటానికీ దానికి గరిట దొరకలేదు. దిక్కులు చూస్తోన్న కోతికి ఓ మూలన నిద్రి స్తోన్న పిల్లి కన్పించి బుర్రలో తళుక్కున మెరుపు మెరిసింది. వెంటనే పిల్లిని లాక్కొచ్చి దాని ముందు కాలును గరిటగా వుపయోగిస్తూ నిప్పుకణికల మధ్యవున్న వేరుశనక్కాయల్ని బయటికి తీసింది. కోతికేమో కడుపు నిండింది. పిల్లికేమో కాలు కాలింది. అదీ కథ. ఎలా గుంది?"

నీలిమ మాట్లాడలేదు.

"కాని ఆ కథలో పిల్లికి వ్రతం చెడినా ఫలం దక్క లేదు. ఈ కథలో ఈ పిల్ల వ్రతం చెడగొట్టుకొని ఫలం కావాలంటోంది. అలాగే ఇస్తాను. కాని ఒక్క షరతు ..."

"రామ్మూర్తిని ఈ లోకం నుండి తప్పించటం మినహా మన అగ్రిమెంటులో మరే షరతూలేదు. మర్యాదగా ఆ కవరిచ్చి మాట నిలుపుకో...."

"ఏ కవరు? ఫోటోలున్న కవరేనా?"

"ఆఁ... ఫోటోలూ నెగెటివ్‌లూ వున్న కవరు ..."

"పడకగదిలో వున్నాయి. నాతోబాటు నువ్వూ లోపలకి వస్తే యిస్తాను...."

"మిస్టర్ ప్రభాకర్!!" ఆడపులిలా గర్జించిందామె.

"అవును. దవుటేమీ లేదు ..." వికటంగా నవ్వాడతను.

"జీవితంలో ఒకే ఒక్క తప్పటడుగు వేశాను. మా నాన్న నా కిచ్చిన స్వేచ్ఛని దుర్వినియోగం చేశాను ఆయన వృత్తికి మాయని మచ్చని తెచ్చేపని చేశాను...."

"నీలాంటి వాళ్ళు తప్పటడుగులు అప్పుడప్పుడూ వేస్తూ వుండాలి. లేకపోతే మాలాంటి వాళ్ళ పనులెలా సానుకూలంగావాలి చెప్పు....మా బుజ్జివి కదూ! పద పడగ్గదిలోకి...." ఆమె చెయ్యి పట్టుకున్నాడు ప్రభాకర్.

'కెవ్వ్'న కేక వినబడింది. నీలిమ పెదవు ల్నుండి కాదు.

ప్రభాకర్ నోట్లోంచి. చటుక్కున ఆమెని వదిలేసి, బుల్లెట్ దూరిన జబ్బని కుడిచేత్తో అదిమి పట్టుకున్నాడు.

దిమ్మెరపోయి శబ్దం వినవచ్చినవేపు చూసింది నీలిమ.

"నీలాంటివాళ్ళు అప్పుడప్పుడూ నేరాలుచేస్తూవుండాలి.

లేకపోతే మాలాంటివాళ్ళకి పేరుప్రఖ్యాతులూ ప్రమోషన్లూ యెలా రావాలి చెప్పు మా చిట్టివి కదూ! పద కటకటాల్లోకి...." వ్యంగ్యంగా అన్నాడు చక్రవర్తి, ప్రభాకర్‌కి గురిపెట్టి.

"మీరు.... మీరు...."

"ఆయన డిటెక్టివ్ జలంధర్. నేను క్రయింబ్రాంచి ఇన్‌స్పెక్టర్ చక్రవర్తిని. ఆకాశం నుండి వూడిపడ్డాం. తమరు బ్లాకుమైలరూ, మర్డరరూ ఎందుకయ్యారో చెబితే 'సన్మానం' చేస్తాం...."

వాళ్ళిద్దరి పేర్లూ విని సీలిమ భోరున ఏడుస్తూ కూలబడిపోయింది.

"ఎందుకేడుస్తావు? హత్యచేసినా ఎస్పై కూతురివికాబట్టి నీకు శిక్ష పడకపోవచ్చు. చెవులే తప్ప కళ్ళెరుగని కోర్టులు నీకు గంధంపూసి సన్మానంచేసి నిర్దోషిగా విడుదలచేస్తాయి. అవే కోర్టులు నిర్దోషైన నా అన్నయ్యను జీవితాంతం కటకటాల మధ్య పడివుండమని శాసించాయి. కారణం ఆ దుర్మార్గుడు వాడే....ఆ రామ్మూర్తిగాడు.

"జవహర్ పురంలో మా అన్నయ్య పేరు తెలియని వారులేదు. ఆయన ఆరెంపీ డాక్టరయినా ఎంబీబియస్‌లంతా ఆయనముందు బలాదూర్!

"ఆయన ప్రాక్టీస్‌చూసి హడలెత్తి ఆ వూళ్ళో కొత్తగా ప్రాక్టీస్‌పెట్టి దోమలు తోలుకుంటూన్న ఓ డాక్టర్—ఆ వూరి సర్పంచూ, తన బంధువూ అయిన శరభయ్యతో చేతులు కలిపి, స్వామి కార్యమూ స్వకార్యమూ కలిపివస్తాయని తమకు ప్రత్యర్థి అయిన ఆ వూరి వ్యక్తిని చంపి, ఆ నేరాన్ని మా అన్నయ్యపై తోశారు.

"ఈ రామ్మూర్తిగాడు డబ్బుకు దానిసై—ఆ స్వార్థ

పరులకు తొత్తై, మా అన్నయ్య హత్య చేస్తోండగా తను కళ్ళారా చూసినట్టు సాక్ష్యం చెప్పాడు. అంతే—

"మా అన్నయ్యకు యావజ్జీవ కారాగారశిక్ష పడింది. నా రక్తం మరిగిపోయింది. రామ్మూర్తితో ప్రతిజ్ఞ చేశాను, నెలరోజుల్లో నిన్ను చంపుతానని. అంతే! ఈ వూరు పారిపోయి వచ్చాడు. తెలీకుండా ఫాలో చేశాను. తప్పించుకు తిరుగుతున్నాడు.

"ఓ కెమెరా కొన్నాను. ఒకరితో హత్య చేయించి, మరొకరిమీదికి నెట్టి, వాళ్ళను కోర్టులో పెట్టి వారిపై నేరం పడేలాచేసి, ఆ తర్వాత అసలు హంతకుణ్ని ఋజువుచేసి-యిలాగే ఆనాడు నా అన్నయ్య విషయంలోనూ జరిగిందని, మీ చట్టానికీ, కోర్టుకీ తెలియజేయాలనుకున్నాను, ఫోటోల ద్వారా.

"జనప్రియ లాడ్జింగ్‌లో రూమ్ తీసుకొన్నాను. ఓ రోజు రాత్రి నా గది ప్రక్క గదిలో నీలిమ, ఆమె ప్రేమికుడు మాట్లాడుకోవటం విన్నాను.

"ఆ మాటల్నిబట్టి నీలిమ ఎస్సై రాజారావు కూతురనీ ఆ కుర్రాడితో ఆమె వివాహం నిశ్చయమైందనీ ఆ ధీమాతో వాళ్ళిలా కల్సుకొంటున్నారనీ గ్రహించాను. చక్కని అవ అవకాశం....

"వారి చిత్రవిచిత్ర భంగిమల్ని రహస్యంగా ఫోటోలు తీశాను. నీలిమని లొంగదీసుకున్నాను. పరువూ ప్రతిష్ఠలకి ప్రాణంగా పేరుపొందిన ఓ మర్యాదస్థుని కూతురు పెళ్ళికి ముందే జరిగిన 'శోభనాన్ని' చాటుకోటానికి ప్రయత్నించదు సరికదా దాన్ని కప్పిపుచ్చటానికి ఎన్ని దారుణాలైనా చేస్తుందని ఋజువు చేశాను."

"కాని మిస్టర్ ప్రభాకర్...." మధ్యలోనే అందు

కున్నాడు డిటెక్టివ్ జలంధర్ గంభీరంగా....

"నువ్వు తప్పటడుగు వేశావు. రామ్మూర్తిని చంపించి నంత మాత్రాన నువ్వు శిక్ష తప్పించుకోలేవు. నీ అన్న య్యని నిర్దోషిగా విడిపించలేవు. నీ పథకం కసి తీర్చు కోవటంపై కాక మీ అన్న నిర్దోషిత్వంపై మొగ్గుచూపిఉంటే రామ్మూర్తిలోని 'మానవతామూర్తి'ని తట్టిలేపి, మీ అన్న య్యని నిర్దోషిగా ఋజువు చెయ్యటమే కాకుండా ఏ కోర్ట యితే నీ అన్నయ్యని శిక్ష అనుభవించమని శాపించిందో, అదే కోర్టే నీ అన్నయ్యని క్షమాభిక్ష యాచించే స్థితికి తీసుకువచ్చివుంటే నీలో భగవంతుడు తొంగిచూసేవాడు.

"ఒక పండు చెడిపోతే గంపలోని పండ్లన్నీ చెడి పోయినవే నన్న పసిబాలుడి మనస్తత్వంతో కలిసిపోయి మూర్ఖుడి వన్పించుకున్నావు. న్యాయాన్ని చట్టాన్ని కామెర్ల కళ్ళతో చూసి 'అబ్బే—అంతా పచ్చగానే వుంది' అను కున్నావు.

"మిస్ నీలిమా!!" మరింత గంభీరంగా అన్నాడు జలంధర్.

"ఉన్నతమైన ఉద్యోగి కడుపున పుట్టావు. మాస్టర్ డిగ్రీ తీసుకున్నావు. సంస్కారాన్ని అలవరచుకున్నావు. అయినా నువ్వూ తప్పటడుగులు వేశావు. వయసు మత్తులో పడి వేసిన తప్పటడుక్కి శిక్షగా బ్లాక్ మెయిలింగ్ వలలో చిక్కావు. ఓ పోలీసు అధికారి కూతురుగా ధైర్యంగా దాన్ని ఎదుర్కొనే వుద్దేశంతో మా సాయంకోరటం మాని, కొరివితో తల గోక్కున్నావు. బంగారు భవిష్యత్తును పాడుచేసుకున్నావు. ఇది తెలిస్తే నీ తండ్రి గుండె ఆగి చస్తాడు—" భారంగా ముగించాడు డిటెక్టివ్ జలంధర్. □

గుడ్డి దర్బారు

వసుంధర సీరియల్

(గతసంచిక తరువాయి)

18

గౌరి ఇంకా టీ దుకాణం వద్దనే వుంది. ఒక రిక్షా ఆమె పక్కగా ఆగింది. రిక్షావాడామెను—"ఎక్కడకు

వెళ్ళాలమ్మా!" అనడిగాడు.

"నాకే తెలియదు—" అంది గౌరి.

రిక్షావాడు గౌరివంక చిత్రంగా చూశాడు. కాస్త ముందుకు వెళ్ళి రిక్షా ఆపి ఆమెవంకే చూస్తున్నాడు.

ఈ లోగా గౌరి పక్కన ఆటో ఒకటి ఆగింది.

"ఎక్కడికి వెళ్ళాలమ్మా?"

"ఎక్కడికీ లేదు—" అంది.

ఆటో మరి కాస్త ముందుకు వెళ్ళి ఆగింది. ఆటోవాలా అక్కణ్ణించే గౌరిని చూస్తూ వున్నాడు.

ఆటో యిలా వెళ్ళగానే అలా ఓ టాక్సీ వచ్చి ఆమె పక్కన ఆగింది. "ఎక్కడికి వెళ్ళాలమ్మా?" మళ్ళీ అదే ప్రశ్న.

ఈసారి గౌరి పెదవి విప్పలేదు. కళ్ళతోనే వద్దన్నట్లుగా జవాబు చెప్పి—'ఇంత హడావుడిగా వున్న ఈ పట్నంలో మనిషి స్థిమితంగా ఓ చోట నిలబడనివ్వని వారు కూడా వుంటారా?' అనుకుంది మనసులో.

గౌరికి కాస్త దూరంలో ఓ మనిషి వున్నాడు. వాడి చేతిలో వేరుశనక్కాయల పొట్లం వున్నది. వాడు ఒక్కో వేరుశనక్కాయే తీపి నుదుటికి కొట్టుకుని వలిచి తింటున్నాడు. ఉన్నట్లుండి వాడు గౌరిని సమీపించి—"చూడమ్మా—చాలాసేపట్నుంచి ఇక్కడ నిలబడ్డావు. ఎక్కడకి వెళ్ళాలి?" అనడిగాడు.

గౌరికి వాడు మాట్లాడిన తీరు నచ్చింది. అదీకాక ఎక్కడికైనా నడకనే వెళ్ళాలని ఆమె నిర్ణయించుకుంది. "అన్నయ్యా—మనసు బాగోలేదు. దగ్గర్లో ఎక్కడైనా గుడి వుందా?" అనడిగిందామె.

"గుడికి వెడతావా?" అన్నాడు వాడు — "అయితే

1983 'వెంకట్ అవార్డు' పోటీలో

ప్రత్యేక బహుమతి పొందిన కార్టూను



పద. నేనూ అక్కడికే వెడుతున్నాను....”

సరేనంది గౌరి. వెంటనే వాడు ఓ రిక్షాను పిలవ బోయాడు. గౌరి వాడిని వారించి—“దూరంలో గుడికాదు. దగ్గర్లోనే ఏదైనా ఉంటే చెప్పు” అంది.

వాడు క్షణం ఆలోచించి—“ఆఁ ఇక్కడో శివాలయం వుంది. చూపిస్తాను—పద!” అన్నాడు.

“నీకు శ్రమెందుకు? నాకు దారి చూపిస్తే చాలు....” అంది గౌరి.

వాడు ఆమెకు దారి చెప్పి వెళ్ళిపోయాడు.

గౌరి వెంటనే బయల్దేరలేదు. దారి చెప్పినవాడు పూర్తిగా కనుమరుగయ్యేవరకూ ఆగిందామె — “ఈ పట్నంలో ఎవ్వర్నీ నమ్మగూడదు—” అని మనసులో అనుకుంది.

గౌరి తను తెలుసుకున్న దారినే బయల్దేరింది. దారిలో గూడా ఆమె అటూ యిటూ చూస్తూంటే కొంద రామెను పలకరించి అడిగి తెలుసుకుని గుడికి దారి చెబుతూండే వారు.

కొంతసేపటి కామె ఓ మైదాన ప్రాంతం చేరింది. ఎక్కడా గుడి జాడలేదు. అప్పుడే ఆమె గ్రహించింది. ఎక్కడా మనుషుల జాడగూడా లేదు.

తనిలా ఎలా వచ్చింది?

అప్పుడామెకు నాలుగు పక్కలా నలుగురు మనుషులు కనిపించారు. ఒకడు రిక్షావాలా, ఒకడు ఆటోవాలా, ఇంకొకడు టాక్సీవాలా—ఇంకొకడు వేరుశనక్కాయలు తినేవాడు!

తను మోసపోయానని గ్రహించింది గౌరి. మళ్ళీ తనను పట్టుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అపరాధ పరిశోధనపోటీ-186

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హాం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-1-'84 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు మార్చి '84 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఇటీవలనే ఇండియాలో ఇవి జరిగినవి—?
   (క్రికెట్ టెస్ట్ పోటీలు, కామన్వెల్తు దేశాధినేతల సభలు)
2. మన దేశంలో అధికార పార్టీలకు ఇవంటే అంతులేని ఆగ్రహం—? (పత్రికలు, ప్రతిపక్షాలు)
3. ఈ ఏడాది వీటి ఉత్పత్తి బాగా తగ్గింది?—
   (పప్పు దినుసులు, నూనె గింజలు)
4. ఇది చేసే మేలు తల్లి కూడ చేయదంటారు—?
   (ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ)
5. నేటి నాగరిక ప్రపంచంలో దీని అవసరం ఎంతైనా వుంది—? (టెలిఫోన్, టెలివిజన్)

ఇది పట్నం!

గౌరి చుట్టూ వున్న ఆ నలుగురి వంకా ఓసారి చూసి వున్నట్లుండి మెరుపులా పరుగు లంకించుకుంది. అనుకోని ఈ సంఘటనకు ఆశ్చర్యపడినా వాళ్ళు త్వరగానే తేరుకుని ఆమె వెంట బడ్డారు.

పల్లెటూళ్ళో గతుకుల రోడ్లోనే గౌరి యెవరికీ దొరికేది కాదు. అసలే ఆమెది లేడి పరుగు. దానికి తోడు పులులామె వెంట పడ్డాయి.

గౌరి అలా పరుగెడుతూండగా కొంత దూరం వెళ్ళాక ఓ పక్క సందులోంచి ఓ పోలీసు జీపు మలుపు తిరుగుతూ కాస్త స్లో అయింది. గౌరి జీపు వెనుకభాగాన్ని గట్టిగా పట్టుకుంది.

టైగర్, అతడి బృందం చూస్తూండగా జీపు వారి కనుమరుగయింది. టైగర్ గోపాలకృష్ణ వద్దకు చిన్న బోయిన ముఖంతో వెళ్ళాడు.

జరిగిందంతా విని—"సమయానికి పోలీసు జీపు వచ్చిందంటే అది పోలీసుల మనిషే అయుండాలి" అన్నాడు.

"కాదు బాస్! అది పల్లెటూరి పిల్ల—అందులో ఇంకేమీ సందేహం లేదు" అన్నాడు టైగర్ అనుచరుల్లో ఒకడు.

గోపాలకృష్ణ టైగర్‌వంక నిరసనగా చూసి—"టైగర్ అని పేరు పెట్టుకున్నావు. ఓ పల్లెటూరి పిల్లను పట్టుకోలేక పోయావు. ఒకప్పుడు నీకు పెద్ద పనులేతప్ప చెప్పకూడదనుకున్నాను. ఇంకమీదట చిన్నపనులు చెప్పడం విషయం గూడా ఆలోచించాలేమో!" అన్నాడు.

"బాస్—అది పల్లెటూరి పిల్లకాదు. అడవి జింక—దాని పరుగు....నిజంగా ఏం పరుగు?" అన్నాడు టైగర్.

1983 'వెంకట్ అవార్డు' పోటీలో
ప్రత్యేక బహుమతి పొందిన కార్టూను

"అది అడవి జింకయితే నువ్వు సర్కస్ పులివి. అందుకే దాన్ని పట్టుకోలేక పోయావు. అంతేకదా!" అని నవ్వి—"టైగర్—దగ్గర్లో ఎక్కడైనా నుయ్యి వుందా?" అన్నాడు గోపాలకృష్ణ.

"ఉంది బాస్?" అన్నాడు టైగర్ కుతూహలంగా.

"ఒక పల్లెటూరి పిల్ల నిన్ను తప్పించుకుని పారిపోతే నుయ్యుందని తెలిసినవాడివి—అందులో దూకి చావాలని పించలేదా?" అన్నాడు గోపాలకృష్ణ హేళనగా టైగర్ని చూస్తూ.

"మరీ అన్యాయంగా మాట్లాడకు బాస్ — ఆ పిల్లను మీరు మళ్ళీ చూడడం అంటూ జరిగితే—ఇక్కడే! వస్తాను...." అంటూ టైగర్ విసురుగా అక్కణ్ణించి వెళ్ళి పోయాడు.

19

పోలీసు సూపరెంటెండెంటు వీరభద్రానికి డిపార్ట్ మెంట్లో ప్రత్యేకమైన పేరు ఉంది. పోలీసుల్లో మానవతా వాది అనీ—నేరస్థుల్ని పట్టుకోవడంలో ఎంత సామర్థ్యం చూపిస్తాడో, వాళ్ళను అర్థం చేసుకోవడంలో అంతటి అవగాహన చూపిస్తాడనీ—చెప్పుకుంటారు. ఆయనకు చిక్కిన నేరస్థుడు తను నేరం చేసినందుకు చింతిస్తాడు తప్పితే—పోలీసులకు చిక్కినందుకు బాధపడడు.

డైనింగ్ టేబిల్ వద్ద వీరభద్రం దిగులుగా వుండడం గమనించాడు గోపాలకృష్ణ.

"డాడీ—అదోలా కనిపిస్తున్నావు నువ్వు" అన్నాడు గోపాలకృష్ణ.

"ఏమీ లేదోయ్—ఈ రోజొక అమ్మాయి నేను డ్రైవ్ చేస్తున్న జీపును పట్టుకుని వ్రేలాడుతోంది. అది గమనించ

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 64 : మేజర్ రంగనాథ్‌కు గుఱ్ఱపు స్వారీ చాలా ఇష్టం. ఎక్కడకు వెళ్ళినా గుఱ్ఱం మీదే వెడుతుంటాడు. ఒకరోజలాగే ఒక నగల దుకాణానికి వెళ్ళాడు. దుకాణం బయట వదిలిన గుఱ్ఱం ఎందుచేతనో బెదిరి జనంలోకి పరుగెత్తింది.

గుఱ్ఱం క్రింద ఎవరైనా పడితే ప్రమాదమని ట్రాఫిక్ కానిస్టేబుల్ దానిని అదుపులోనికి తేవటానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో కానిస్టేబుల్‌కు బలమైన గాయాలు తగిలి నెల రోజులు హాస్పిటల్లో వుండవలసి వచ్చింది. వైద్యం కోసం అయిన ఖర్చులు ఇవ్వటానికి మేజర్ నిరాకరించటంతో, ఆయనపై నష్టపరిహారానికి దావా వేశాడు కానిస్టేబుల్.

న్యాయమూర్తిగా మీ తీర్పు ఏమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 5-1-84 తేదీలోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు మార్చి '84 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 62 (తీర్పు)

బన్సారీ దాస్‌కు నష్టపరిహారం చెల్లించాలి.

ఓటు వేసే హక్కు 21 సం.లు నిండిన ప్రతి పౌరుడికి రాజ్యాంగం ఇచ్చిన హక్కు. దానిని త్రోసి రాజనే హక్కు ఎవరికీ లేదు. అందుకు భంగం కలిగిస్తే ఆ కలిగించిన వారు నష్టపరిహారం చెల్లించాలి. బన్సారీ దాస్ ఓటు వల్ల జయాపజయాలు నిర్ణయించబడకపోయినా అతడే గెలుస్తాడు.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీమతి వేదాంతం శ్రీలక్ష్మి, c/o వి. ఎస్. ఆర్. అవధాని, అరండల్ పేట, నరసారావుపేట-522 601.

గానే నేను సడన్ బ్రేక్ వేశాను. ఆమె పట్టు విడిపోయింది. సరిగ్గా అదే సమయానికి ఓ కారు వచ్చి ఆమెమీద నుంచి వెళ్ళిపోయింది. పోస్టుమార్టం కోసం హాస్పిటలుకు తరలించాం'' అని—''ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకోసం కదా మా డిపార్టుమెంటు సృష్టించబడింది? కానీ ఈ రోజు ఆ డిపార్టుమెంటుకు చెందిన నేను — ఆ అమ్మాయి ప్రాణాలు పోగొట్టుకునే విశేషంలో పాత్ర వహించాను— నా మనసేదోలా గుంది'' అన్నాడాయన.

గోపాలకృష్ణ కనులముందు గౌరి మెదిలింది.

టైగర్ పౌరుషం కొద్దీ తనపని పూర్తి చేశాడా? ఆ పల్లెటూరి పిల్ల పట్టుకున్న పోలీసు జీపులో తన తండ్రి వున్నాడా?

గోపాలకృష్ణకు తన ముఖంలో భావాలు తండ్రికి తెలియడం యిష్టంలేదు. అందుకని అతడు టాపిక్ మార్చుతూ ''విశేషాలేమిటి డాడీ—మీ డిపార్ట్‌మెంట్లో?'' అన్నాడు.

''ఏముంది? బంగారం, నార్కొటిక్స్—స్మగ్లింగ్ ఎక్కువయింది. బజార్లోకి సరుకెలా వస్తోందో తెలియడంలేదు గానీ—మత్తు పదార్థాలకు అలవాటుపడ్డ దురదృష్టవంతులు మాత్రం దొరుకుతున్నారు—'' అన్నాడు వీరభద్రం.

అయితే గోపాలకృష్ణ ఆలోచనల్లోంచి గౌరి పూర్తిగా తొలగిపోలేదు. అతడు మళ్ళీ టాపిక్ మార్చకుండా వుండలేకపోయాడు—''డాడీ—హత్యలో నీకూడా భాగమిచ్చిన ఆ శవం నేనూ చూడాలనుకుంటున్నాను-నీతో రావచ్చా?'' అన్నాడు గోపాలకృష్ణ.

''ఏమన్నావ్?'' అన్నాడు వీరభద్రం ఉలిక్కిపడి.

''డాడీ—నీ యూనిఫారంలో ఇంద్రజాలముంది. ఆ జీపులో వున్నది నువ్వు కాబట్టి వాజ్మూలంతో సరిపోతుంది.

1983 'వెంకట్ అవార్డు' పోటీలో
ప్రత్యేక ప్రశంస పొందిన కార్టూను

1983 'వెంకట్ అవార్డు' పోటీలో
ప్రత్యేక ప్రశంస పొందిన కార్టూను



అదే సామాన్య పౌరుడెవరైనా అయితే కోర్టుల చుట్టూ తిప్పి ఏడ్పించేవారు—" అన్నాడు గోపాలకృష్ణ.

"నీ తెలివితేటలు నేను మెచ్చుకుంటున్నాను. కానీ జాగ్రత్త! నా యూనిఫారంలోని ఇంద్రజాలాన్ని నీకులాగే నీ స్నేహితులు కూడా గుర్తిస్తే అది నీకూ నాకూ కూడా ఇబ్బంది కలిగిస్తుంది—" అన్నాడు వీరభద్రం.

తండ్రీ కొడుకులు భోజనం ముగించి హాస్పిటల్‌కు వెళ్ళారు. అక్కడ గోపాలకృష్ణ శవాన్ని చూశాడు. అది గౌరి శవమే!

గోపాలకృష్ణ అప్రయత్నంగా కొంతసేపు ఆ శవాన్నే చూస్తూ వుండిపోయాడు. ఒకనాడు తనచేత అత్యాచారానికి గురయిన పిల్ల. ఆ రోజు తాత్కాలికంగా గుడ్డిదానిలా నటించి వుండవచ్చు. కానీ ఈ రోజున ఆమె కనులు శాశ్వతంగా మూతలుపడ్డాయి.

శవానికి గొంతువరకూ గుడ్డ కప్పారు. మూతివద్ద కారిన రక్తం గడ్డకట్టి వుంది. ఆ శవాన్ని ఆ రీతిలో చూస్తూంటే గోపాలకృష్ణకు ఏదోలాగనిపించింది. అతను తొందరగా తండ్రివద్ద సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

20

"టైగర్!" అన్నాడు గోపాలకృష్ణ.

"ఎస్ బాస్!"

"ఆ అమ్మాయి చచ్చిపోయింది—"

టైగర్ గర్వంగా నవ్వి—"నన్ను తప్పించుకోవాలనుకున్నవారిని ఆహ్వానించగలిగేది మృత్యువు మాత్రమే!" అన్నాడు.

"ఏమైతేనేం—మనకు ఓ సమస్య తీరిపోయింది—" అన్నాడు గోపాలకృష్ణ.

అపరాధ పరిశోధన పోటీ-184

[ఫలితాలు]

నవంబరు '83 నెల "అపరాధ పరిశోధన పోటీ—184"కి సరియైన సమాధానాలు:

1. వెస్ట్ ఇండీస్.
2. 20.
3. కన్నాట్ సర్కస్.
4. నాదెండ్ల
5. ముఠా కొట్లాటలు.

పై జవాబుల ప్రకారం ఇద్దరు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి ఫిబ్రవరి '84 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీ ఎస్. రమేశ్,
ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా,
జగిత్యాల—505 327,
(కరీంనగర్ జిల్లా).

(2) శ్రీ వి.వి.ఎస్.ఎస్. శర్మ,
సౌతన్ ఏజెన్సీస్,
జె.పి.ఎన్. రోడ్,
వరంగల్—506 002.

రాత్రికి గోపాలకృష్ణ ఇల్లు చేరాడు.

అక్కడంతా నిశ్శబ్దంగా వుంది.

అతను హాల్లో అడుగుపెట్టగానే అంతవరకూ వెలుగుతున్న దీపాలు ఒక్కసారిగా ఆరిపోయి అంతటా చీకటి ఆవరించుకుంది.

"రంగయ్యా!" అని కేక పెట్టా డతను.

బదులివ్వలేదు. అసలింట్లో యెవరైనా వున్న అలికిడి లేదు.

గోపాలకృష్ణ ఆ చీకట్లోనూ తడుముకుంటూ సోఫాల దగ్గరకు వెళ్ళాడు. అక్కడికి చేరేసరికి అతడి కళ్ళు చీకటికి కాస్త అలవాటుపడ్డాయి. సోఫాలో కూర్చున్నాడతను. రంగయ్యా అని పిలవబోయి ఆగాడు. ఎదురుగా టీపాయ్ మీద విస్కీ బాటిలు, ఒక గ్లాసు అస్పష్టంగా కనబడుతున్నాయి.

"ఒకోసారి మనక చీకట్లో ఆడదాన్ని కని పెట్టలేకపోవచ్చు. కానీ చీకట్లో కూడా విస్కీ బాటిలు నా కళ్ళు దాటిపోలేదు—" అనుకుంటూ అతడు మూతతీసి గ్లాసులో పోసుకున్నాడు. విస్కీ నెమ్మదిగా చప్పరిస్తూ—"రంగయ్యా!" అని పిలిచాడు.

"ఇష్!" అని ఎవరో గదిమినట్లయింది.

గోపాలకృష్ణ ఓసారి చుట్టూచూశాడు. ఎవరూ కనబడలేదు. ఆ చీకట్లో యెవరయినా మనుషులుంటే అస్పష్టంగానైనా కనబడాలి కదా! అదీకాక ఆ శబ్దం తనకు చాలా దగ్గర్నుంచే వచ్చింది.

తను భ్రమపడి వుండాలనుకున్నాడతను. గ్లాసులో మరికొంచెం విస్కీ పోసుకున్నాడు—యింకా విస్కీ ఉండగానే.

1983 'వెంకట్ అవార్డు' పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కార్టూను



1983 'వెంకట్ అవార్డు' పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కార్టూను



అప్పుడు వినబడింది—సన్నని, మెత్తని నవ్వు!

అది ఆడదాని నవ్వు!!

ఆ వాతావరణంలో యెవరికైనా వళ్ళు గగుర్పొడిచే నవ్వు అది!

"ఎవరూ?" అన్నాడు గోపాలకృష్ణ. అతని గుండెలో సన్నని బెదురు ప్రారంభమయింది.

"నేను!" అంది ఒక స్త్రీ కంఠం.

అతను చుట్టూ చూశాడు.

హాల్లో నాలుగుపక్కలా తెరలున్నాయి. ఆ తెరలన్నింటి పైనా గౌరి ఆకారం కనబడుతోంది.

నిలువెత్తు గౌరి ఆకారం....నాలుగు తెరలమీదా....

గోపాలకృష్ణ తెల్లబోయి చూస్తున్నాడు. అతడలా చూస్తుండగానే ఆ ఆకారంపైజు క్రమంగా తగ్గిపోసాగింది. క్రమంగా అది జానెడయింది.

అతను తన చేతిలోని విస్కీ గ్లాసువంకా, ఆ తెరల వంకా మార్చి మార్చి చూసి—మళ్ళీ ఓ గుటక మింగాడు.

"నన్ను గుర్తించావా?" ఓ తెరచాటు నుంచి స్త్రీ గొంతు వినిపించింది. ఆ గొంతు గుర్తుపట్టాడతను.

"గుర్తించాను. నిన్ననేగా నీ శవం చూశాను" అన్నాడతను.

అప్పటికి విస్కీ అతడిమీద ప్రభావం చూపించసాగింది.

తెరమీద గౌరి మళ్ళీ ప్రత్యక్షమయింది.

"నిన్నటి శవమే తప్ప—కొద్ది నెలల క్రితం మనిషి నీకు గుర్తులేదా?"

"నువ్వెవరో నాకు తెలియదు!"

"పోనీ—ఇది నీదేనా?"

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, 1 నెలానెల పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టుఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంప వచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీ లలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంత టితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చి తంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

"గౌరి చేతిలో పులిగోరు పతకం వున్నది. గోపాల కృష్ణ అది చూడగానే కలవరపడ్డాడు—"అది నాదే!" అన్నాడతను.

"ఇది నా దగ్గరకెలా వచ్చిందో ఊహించగలవా?"

"గలను.... కానీ—ఆమె గుడ్డిది.... నువ్వు...."

"వెర్రివాడా—గుడ్డితనం నా శరీరానికి. ఆత్మకు లేదు...."

"ఏం కావాలి నీకు?" అన్నాడు గోపాలకృష్ణ.

"నువ్వు!" అంది గౌరి—"కేవలం నిన్ను తీసుకు వెళ్ళడంకోసమే నేనిలా వెంటబడి వచ్చాను...."

"నిన్ను చంపేస్తాను...." అంటూ గౌరివైపు తన జేబులోంచి చాకుతీసి విసిరాడు గోపాలకృష్ణ.

ఒక్కక్షణం నిశ్శబ్దం.

మరో తెరచాటునుంచి మళ్ళీ గౌరి మాటలు వినిపించాయి—"నిన్ను తీసుకువెళ్ళడానికే నేనొచ్చాను—"

గోపాలకృష్ణ అప్రతిభుడై నాలుగుపక్కలా చూశాడు. అన్ని తెరలమీదా గౌరి ఆకారం కనబడుతోంది. అన్ని తెరలవెనుకనుంచీ గౌరి నవ్వు భయంకరంగా ఆ హాలంతా ప్రతిధ్వనిస్తోంది.

"కత్తి విసిరావేం—పేల్చడానికి పిస్తోలు లేదా?"

గౌరి నవ్వింది.

మొదటిసారిగా గోపాలకృష్ణ మనసులో భయం చోటు చేసుకుంది. తను యేదో మానవాతీత శక్తితో మాట్లాడుతున్నానన్న అనుభూతి కూడా అతడికి అప్పుడే కలిగింది. భయం భయంగా—"నువ్వెవరో చెప్పు!" అన్నాడు.

"అసహాయురాలైన గుడ్డిదాన్ని నిర్దాక్షిణ్యంగా వేటాడిన వాడికీ రోజు భయం కూడా వేస్తున్నట్లుందే — నీ

1983 'వెంకట్ అవార్డు' పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కార్టూను

1983 'వెంకట్ అవార్డు' పోటీలో ప్రత్యేక ప్రశంస పొందిన కార్టూను



భయం నిన్ను రక్షించదు. నీ గొంతు పిసికి నిన్ను నాతో తీసుకొనిపోతాను. నేను అందుకే వచ్చాను...." అంది గౌరి.

"నేను అందుకే వచ్చాను...." గౌరి కంఠం నాలుగు వైపుల నుంచీ ప్రతిధ్వనించింది. ఆమె నవ్వు చాలా భయంకరంగా వుంది.

"నేను నిజం చెబుతున్నాను. నా మాట నమ్మ. నా తప్పేమీలేదు. వంద రూపాయలకు కక్కుర్తి పడి ఆ చలం గాడు నిన్ను నా దగ్గరకు తీసుకొచ్చాడు. ప్రత్యేకంగా నీ కోసం నేను కబురుపెట్టలేదు. ఒకసారి నువ్వు నా దగ్గరకు చేరాక నాలోని రాక్షసుడు విజృంభించిన మాట నిజం!" గోపాలకృష్ణ భయంగా అన్నాడు.

"అప్పుడు నీ లోని రాక్షసుడు విజృంభించినా ఇప్పుడు నువ్వు మనిషిలాగే సుఖంగా బ్రతుకుతున్నావు. నేను మాత్రం పిశాచంగా మారిపోయాను."

"నాది తప్పే—నన్ను మన్నించు."

"మన్నించు అంటే సరిపోతుందా? నీ బిడ్డకు తల్లి కాబోతున్న నాకు శాంతి కలుగుతుందా?"

"ఏం చెయ్యను? నువ్వు బ్రతికివుంటే మా నాన్నకు చెప్పి పెళ్ళి చేసుకుని వుండేవాణ్ణి ఆ రోజు నిన్నలా చేసినప్పట్నించీ నా మనసు మనసులో లేదు. నీ కోసమే ఎదురు చూస్తున్నాను. నీ శవం చూడగానే మతిపోయినట్లయింది" అన్నాడు గోపాలకృష్ణ.

"మన పెళ్ళికి మీ నాన్న ఒప్పుకుంటా డంటావా?" అంది గౌరి.

"ఎందుకొప్పుకోనమ్మా—ఇంత తెలిసేక!"

ఆ గొంతు వీరభద్రానిది!

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5- -'84 తేదీలోపల మాకు చేరాలి. ఫలితాలు మార్చి '84 నెల సంచికలో ప్రకటిస్తాము.

నవంబరు '83 పోటీ ఫలితాలు

(1) నవంబరు '83 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

రణరంగంలో రమణి,
రసజగత్తుకు రమ్మని!!

పంపినవారు: శ్రీ షేక్ ముబారక్ అలీ, బి-12, విజయ ఇండస్ట్రీస్, ఆటో నగర్, విశాఖపట్టణం—530 012.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

నన్నాపే వారే లేరు!
నిన్నొదిలే ప్రశ్నే లేదు!!

పంపినవారు: శ్రీ వి. కృష్ణమూర్తి, కెనరాబ్యాంక్ అకౌంట్ సెక్షన్, బషీర్ బాగ్, హైద్రాబాదు.

గోపాలకృష్ణ ఉలిక్కిపడ్డాడు.

ఉన్నట్లుండి హాల్లో దీపాలు వెలిగాయి. తెరల చాటు నుంచి గౌరి, వీరభద్రం, స్లైడ్ ప్రొజక్టర్ను, టేపు రికార్డర్ను ఆపరేట్ చేస్తున్న నలుగురు మనుషులు బయటకు వచ్చారు.

"డాడీ!" అన్నాడు గోపాలకృష్ణ. అంతకుమించి ఏమనాలో ఆ క్షణంలో అతనికి తెలియలేదు.

"ఏమిటోయ్—నీ కోరిక నేనెప్పుడైనా కాదన్నానా? రేపే వైభవంగా నీ పెళ్ళి జరుగుతుంది" అని అక్కడున్న నలుగురి వంకా చూపి—"క్షణాలమీద ఏర్పాట్లు జరిగి పోవాలి. రాత్రికి రాత్రి కారు పంపించి సింహపురి నుంచి గౌరి ముఖ్య బంధువుల్ని కూడా తీసుకువచ్చే యేర్పాట్లు చేయండి. అన్నీ మీకు వివరంగా చెప్పానుగదా!" అన్నాడు.

అంతా వెళ్ళిపోగా అక్కడ గౌరి, వీరభద్రం, గోపాలకృష్ణ మిగిలారు. వారిమధ్య కాసేపు నిశ్శబ్దం రాజ్యమేలింది.

ఉన్నట్లుండి గోపాలకృష్ణ అన్నాడు "డాడీ: నేను ఏకాంతంగా మాట్లాడా లనుకుంటున్నాను."

వీరభద్రం లేచి తనయుడి వంక చిలిపిగా చూపి అదో రకంగా నవ్వుతూ "ష్యూర్! ప్రేమికుల ఏకాంతానికి నే నెప్పుడూ అడ్డుండను" అన్నాడు.

"నో—డాడీ! నేను నీతో ఏకాంతంగా మాట్లాడాలనుకుంటున్నాను" అన్నాడు గోపాలకృష్ణ.

"నాతో ఏకాంతమా? నో....నో....నీ ప్రేయసికి తెలియకూడని రహస్యాలు నాతో ఏముంటాయి? ఫరవాలేదు ఇప్పుడే చెప్పు" అన్నాడు వీరభద్రం.

తప్పక చదవండి!

డిశంబరులో విడుదల

1. దృష్టి — ఎన్. ఆర్. నంది — రు. 17-00
2. నాగభైరవి — ఇల్లాందేవి — రు. 13-00
   (ఆంధ్రప్రభ సీరియల్)
3. స్వప్నలోకం — ,, — రు. 12-00
   (డైరెక్టు నవల)
4. ప్రేమలు - పెళ్ళిళ్లు
   మాదిరెడ్డి సులోచన — రు. 12-00
5. నరాంతకులు — వసుంధర — రు. 13-00
   (ఆపన సీరియల్)
6. బొమ్మలాట
   జి. భవానీ కృష్ణమూర్తి — రు. 12-00

అడ్వాన్సు పంపని ఆర్డర్లు
అంగీకరించబడవు.

ఫోన్ నెం: 63322

శ్రీమహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

గవర్నరు పేట,

విజయవాడ – 520 002.

ఏమనుకుందో గౌరి లేచి నిలబడి "నాకు నిద్ర ముంచుకు వస్తోంది. వెళ్ళి పడుకొంటాను మామయ్యా!" అంది.

వీరభద్రం ఆమె వంక అభిమానంగా చూసి "అమ్మా నీ గొప్పతనం నాకు తెలుసు. ఆ రోజు ఓ బందిపోటు ముఠాని కాపాడినందుకు ప్రభుత్వ మిచ్చిన బహుమతిని నేనే నీకు అందజేశాను. ఈ రోజు నాకు మళ్ళీ మరో దొంగను పట్టియిచ్చావు. నా పెంపకం నా తనయుణ్ణి నేరస్తుణ్ణి చేసింది నీ సంస్కారం వాణ్ణి మనిషిని చేస్తుందన్న ఆశతో వాణ్ణే నీకు అప్పగించాలనుకుంటున్నాను. వెళ్ళి హాయిగా నిద్రపోమ్మా-ఇక నీకే భయమూలేదు" అన్నాడు.

గౌరి వెళ్ళిపోగానే "డాడీ! నీవప్పుడప్పుడు తొందరపడి నిర్ణయాలు తీసుకుంటూంటావు. కానీ—నీ తొందరపాటుకు నా జీవితం బలిచేసుకోమంటావా? ఈ పల్లెటూరి మొద్దుతో జీవితాంతం నరకం అనుభవించమంటావా?" అన్నాడు గోపాలకృష్ణ.

"తొందరపాటంటూ ఉంటే అది నీదే కానీ నాది కాదు. నేను వెతికేలోగానే తొందరపడి నువ్వో పిల్లను చూసుకున్నావు. నువ్వు ఎన్నిక చేసుకున్న ఆడపిల్లతో నీకు పెళ్ళి చేస్తున్నాను. కాదంటావా?" అన్నాడు వీరభద్రం గంభీరంగా.

"కాని—డాడీ! నే నీమెను పెళ్ళి చేసుకుంటే నీ పరువేం కావాలి? నా పరువేం కావాలి? అసలు నలుగురిలోనూ మనం తలెత్తుకు తిరగ్గలమంటావా? నువ్వే ఆలోచించు డాడీ!"

(ఇంకావుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.

Blank Page


Regd.no: H/HD-48
PRABHAKAR.